
www.andhrajyothy.com
పేజీలు: 12
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 237
సోమవారం | 3-11-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి రా.2:06 చతుర్దశి, నక్షత్రం: ఉత్తరాభాద్ర మ.3:06 తదుపరి రేవతి, వర్జ్యం: రా.1:50-3:15, దుర్ముహూర్తం: మ.12:21-1:06, మ.2:37-3:22, అమృతఘడియలు: ఉ.10:41-12:09, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:18, సూర్యాస్తమయం: 5:39
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





బంగారు తల్లుల సువర్ణాధ్యాయం

మహిళల వన్డే వరల్డ్ కప్ విజేతగా భారత జట్టు

దక్షిణాఫ్రికాపై హర్మన్‌ప్రీత్ సేన అద్భుత విజయం

దీప్తి శర్మ, షెఫాలీ వర్మ ఆల్‌రౌండ్ షో.. కీలక వికెట్ తీసిన తెలుగమ్మాయి శ్రీ చరణి 10

ఓ స్వప్నం సాకారమైందన్న కొండంత తృప్తి. అంతకుమించి గుండెల నిండుగా ఉప్పొంగే మాటలకందని ఆనందం! మన మహిళా క్రికెటర్లలో.. మన దేశ కోటానుకోట్ల క్రికెట్ అభిమానుల్లోనూ! భారత మహిళల క్రికెట్ పరంగా మరో చరిత్ర. తొలిసారిగా కపిల్‌సేన కప్పు కొట్టినప్పుడు 1983కు ముందు, తర్వాత అని భారత క్రికెట్‌ను నిర్వచించినట్లుగానే భారత మహిళల జట్టుకు ఇప్పుడిక సరికొత్త అధ్యాయమే. ఆలస్యమైనా భారత అమ్మాయిలు అద్భుతమే చేశారు. ముచ్చటగా మూడో ప్రయత్నంలో ఘన విజయం సాధించారు. వన్డే క్రికెట్‌లో మొట్టమొదటిసారిగా విశ్వవిజేతగా ఆవిర్భవించారు. దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో జరిగిన తుదిపోరులో భారత మహిళల జట్టు 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ.. తన పాత్రకు తగ్గట్టే బ్యాటు, బంతితో అదరగొట్టడం.. చిచ్చరపిడుగు షెఫాలీ బ్యాటుతోనే కాకుండా బంతితోనూ మాయ చేయడం ఈ ఫైనల్లో హైలెట్! టాస్ ఓడినా గత రెండు ఫైనల్స్‌కు భిన్నంగా తొలుత బ్యాటింగ్ చేయడం అద్భుతంగా కలిసొచ్చింది. షెఫాలీ, స్మృతి శతక భాగస్వామ్యంతో విజయానికి ఆదిలోనే గట్టి పునాది పడింది. ఈ పునాదే జట్టు స్కోరును ఏడు వికెట్లకు 298 పరుగుల దాకా తీసుకెళ్లింది. తీవ్ర ఒత్తిడితో కూడుకున్న ఫైనల్లో దక్షిణాఫ్రికా మహిళల ఎదుట ఈ స్కోరు ఎవరెస్టే అయింది. సఫారీ గాళ్ లారా వోల్వార్ట్ సెంచరీ చేసినా ఆ జట్టు పరుగుల వేట 246కే పరిమితమైంది.


గెలుపు సంబరాల్లో షెఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన

జోగి రమేశ్ అరెస్టు

నకిలీ మద్యం కేసులో అదుపులోకి

ఆయనతోపాటు తమ్ముడు కూడా..

ఉదయం ఇంటి వద్ద, రాత్రి ఆస్పత్రిలో, ఆ తర్వాత కోర్టు వద్ద వైసీపీ శ్రేణుల హైడ్రామా.. పోలీసులపై దౌర్జన్యం.. కోర్టులోనూ బైఠాయింపు


జోగి రమేశ్‌ను వైద్య పరీక్షల కోసం బెజవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చిన పోలీసులు

- సిట్ అధికారులు ఇంటికొచ్చాక 3 గంటలు బెడ్‌రూమ్ నుంచి బయటికే రాని రమేశ్
- శ్రేణులను రప్పించి ఆందోళన చేయించే యత్నం
- వారు వచ్చాక తలుపులు తీసుకుని బయటికి
- ఆ వెంటనే అరెస్టు నోటీసులిచ్చిన అధికారులు
- రమేశ్‌తోపాటు ఆయన సోదరుడు రాము, పీఏనూ అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రాత్రి 8 వరకు జోగి ఇంట్లో తనిఖీలు
- కీలక పత్రాలు, 2 ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు, ఒక హార్డ్‌డిస్క్ ఆయన కారు స్వాధీనం
- ఆర్థిక లావాదేవీలపై జోగికి 7 గంటలు సిట్ ప్రశ్నలు
- రాత్రి 10కి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలింపు
- వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్లుగానే నకిలీ మద్యం తయారీ కేసు మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ మెడకు చుట్టుకుంది. ఆయనతో పాటు ఆయన తమ్ముడు జోగి రామును ఎక్సైజ్, సిట్ పోలీసులు అరెస్టు చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఉన్న జోగి ఇంటికి ఎక్సైజ్, సిట్ అధికారుల బృందం ఆదివారం తెల్లవారుఝామున 5.30 గంటలకు వెళ్లింది. ముందుగా ఇంటిని తనిఖీ చేస్తున్నామని సెర్చ్ నోటీసు ఇచ్చారు. పోలీసుల రాకను గమనించిన

మిగతా 12వ పేజీలో...


బెజవాడ ప్రభుత్వాస్పత్రి వద్ద ఎస్ఐ శంకరరావుపై వైసీపీ శ్రేణుల దౌర్జన్యం.. తోపులాట

అరాచకాల జోగి!

- ఎన్నో వివాదాలు, అవినీతి ఆరోపణలు
- నాడు చంద్రబాబు ఇంటిపై దాడికి యత్నం
- ఆ తర్వాత కానుకగా మంత్రి పదవి
- గత ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ భూముల కబ్జా
- అధికారం పోయాక అక్రమాలు బయటకు
- రెవెన్యూ-సీఐడీ జాయింట్ సర్వేలోనూ భూముల కబ్జాపర్వం నిర్ధారణ
- తాజాగా నకిలీ మద్యం కేసులో అరెస్ట్
- అద్దేపల్లి జనార్దనరావుతో కలిసి తయారీ
- కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు కుట్ర



భళా బాహుబలి

భారత గడ్డ నుంచి తొలి భారీ ఉపగ్రహం నింగిలోకి

- స్వదేశీ సీఎంఎస్-03 ప్రయోగంతో ఇస్రో కొత్త చరిత్ర
- ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం
- 16.29 నిమిషాల్లోనే కక్ష్యలోకి కమ్యూనికేషన్ శాటిలైట్
- ఎల్వీఎం3 ప్రయోగాల్లో వరుసగా ఎనిమిదో విజయం
- చరిత్రలో మైలురాయిగా నిలుస్తుంది: ఇస్రో ఛైర్మన్

సూళ్లూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత నేలపై నుంచి తొలిసారిగా అత్యంత బరువైన స్వదేశీ ఉపగ్రహం సీఎంఎస్-3ను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. భారత నౌకాదళం కోసం ఇస్రో చేపట్టిన భారీ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. 4,410 కిలోల బరువైన మల్టీ బ్రాండ్ కమ్యూనికేషన్ శాటిలైట్ సీఎంఎస్-3తో నింగిలోకి ఎగిరిన ఎల్‌వీఎం3-ఎం5 'బాహుబలి' రాకెట్ దాన్ని విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఈ క్రమంలో ఎల్‌వీఎం3 రాకెట్ ప్రయోగాల్లో ఇస్రో వరుసగా 8వ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) రెండో ప్రయోగ వేదిక నుంచి ఆదివారం సాయంత్రం 5:26 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిరిన ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్.. తన మూడు

మిగతా 2వ పేజీలో...

రాయాలా.. వద్దా?

టెట్‌పై అయోమయంలో ఇన్ సర్వీస్ టీచర్లు

రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రాయాలా? వద్దా? అనే విషయంపై ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. టెట్ లేని వారంతా రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో ఇటీవల పాఠశాల విద్యాశాఖ జారీచేసిన టెట్ నోటిఫికేషన్‌లో ఇన్ సర్వీస్ టీచర్లకూ టెట్ రాసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే, టెట్ మినహాయింపు కోసం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మళ్లీ టెట్ మినహాయింపుపై టీచర్లలో ఆశలు చిగురించాయి. అయితే, సుప్రీంకోర్టు తుది తీర్పుపైనే టీచర్ల 'టెట్' భవితవ్యం ఆధారపడి ఉంటుంది.



- లక్ష మంది టీచర్లపై టెట్ ప్రభావం
- ఇప్పటిదాకా 6 వేల మంది దరఖాస్తు
- రివ్యూ పిటిషన్‌కు సర్కారు నిర్ణయం
- సుప్రీంకోర్టు తీర్పుపైనే భవితవ్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రస్తుతం 1.8 లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. అందరూ టెట్ ఉత్తీర్ణులు కావాల్సిందేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 2011కు ముందు డీఎస్సీల ద్వారా నియామకమైన టీచర్లంతా టెట్ రాసి ఉత్తీర్ణత సాధించాలి. వారిలో ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న వారికి మినహాయింపు ఉంది. అయితే, ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నప్పటికీ పదోన్నతి పొందాలంటే మాత్రం తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీం స్పష్టం చేసింది. కాగా, పీఈటీ, పీడీలకు టెట్ అవసరం ఉండదు. దీంతో సుమారు లక్ష మంది టీచర్లు ఇప్పుడు టెట్ రాయాల్సి ఉంటుంది. ఐదేళ్లలోపు సర్వీసు ఉండి పదోన్నతి దక్కదు అనుకునేవారు

మిగతా 3వ పేజీలో...


లండన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులకు స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

లండన్ చేరుకున్న సీఎం చంద్రబాబు

- నేడు పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ
- విశాఖ భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానం
- రేపు భువనేశ్వరి అవార్డుల స్వీకరణకు హాజరు

11

విశాఖలో వైసీపీ 'డ్రగ్స్' దందా!

- ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి విక్రయిస్తున్న వైసీపీ విద్యార్థి విభాగం నేత కొండారెడ్డి
- విద్యార్థులే లక్ష్యంగా మాదక ద్రవ్యాల విక్రయం
- గుడివాడ యువకుడితో బెంగళూరు నుంచి విశాఖకు
- చరణ్ దగ్గర 36 ఎల్ఎస్‌డీ బోల్ట్స్ పట్టేసిన పోలీసులు
- హైదరాబాద్, గోవా నుంచి కూడా తెప్పిస్తున్నట్టు వెల్లడి
- జగన్, అమర్‌నాథ్ రెడ్డిలతో కొండారెడ్డికి సత్సంబంధాలు
- నలుగురి అరెస్టు.. రిమాండ్, మరొకరి కోసం గాలింపు


వైసీపీ అధినేత జగన్‌తో కొండారెడ్డి(ఫైల్)
విశాఖలో చరణ్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎల్ఎస్‌డీ బోల్ట్స్

విశాఖపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఐటీ రాజధానిగా విలసిల్లుతున్న విశాఖలో వైసీపీ నేత డ్రగ్స్ దందా నడిపిస్తున్నారు. విద్యార్థులే లక్ష్యంగా మాదక ద్రవ్యాల విక్రయాలు సాగిస్తున్నారు. డ్రగ్స్ దిగుమతి, విక్రయం కేసులో విశాఖ జిల్లా వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. చరణ్ అనే యువకుడి ద్వారా బెంగళూరు నుంచి ఎల్ఎస్‌డీ బోల్ట్స్ డ్రగ్స్‌ను నగరానికి చేరవేస్తున్నట్టు సమాచారం అందుకున్న ఈగల్ టీమ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఆదివారం విశాఖ రైల్వే స్టేషన్‌లో చరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగ్‌ను

మిగతా 12వ పేజీలో...

మోదీని ఆడిస్తున్న వ్యాపారులు

- అంబానీ, అదానీల చేతిలో రిమోట్ కంట్రోల్
- చిన్న వ్యాపారులను నాశనం చేసి బడా వ్యాపారవేత్తలకు మేలు చేయడమే మోదీ లక్ష్యం
- బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ
- చెరువులో దిగి చేపలు పట్టిన ప్రతిపక్ష నేత
- 18న సీఎంగా ప్రమాణం చేస్తున్నా: తేజస్వి

2

పాక్‌పై బాంబులేస్తే.. కాంగ్రెస్ 'రాచకుటుంబానికి' నిద్ర లేదు: మోదీ
పట్నాలో భారీ రోడ్‌షో


బెగుసరాయ్‌లో మత్స్యకారులతో కలిసి చేపలు పడుతున్న రాహుల్

రోడ్డు ప్రమాదాలకు ఇకపై కాంట్రాక్టర్‌కు జరిమానా!

- 'బీవోటీ' హైవేల పరిధిలో ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ జరిగితే 25 లక్షలు
- తర్వాతి ఏడాదీ పునరావృతమైతే 50 లక్షలు
- కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయం

2

వానలోటు తీర్చిన మొంథా తుఫాను

గణనీయంగా పుంజుకున్న వర్షపాతం

3

జవసత్వాలతోనే వారసత్వం సాధ్యం

- తండ్రి ఆస్తులు పంచుకోవడం కాదు
- జానమద్ది శతజయంత్యుత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- గుమ్మడి గోపాలకృష్ణ, మేడసాని మోహన్, అంకెగౌడ, రేవూరులకు జానమద్ది పురస్కారాలు



కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న వెంకయ్యనాయుడు

కడప (మారుతీ నగర్), నవంబరు 2(ఆంధ్ర జ్యోతి): వారసత్వం అంటే తండ్రి సంపాదించిన ఆస్తులను పంచుకోవడం కాదని, వారసత్వం అందుకోవాలంటే నిజమైన జవసత్వాలు పొందగలిగినపుడే సాధ్యమవుతుందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. కడపలో సీపీ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణకర్త డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శత జయంత్యుత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్య మాట్లాడుతూ.. జానమద్ది చాలా మంచి గొప్ప వ్యక్తి అని, సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని నిర్మించేందుకు ఒక యజ్ఞం లాగా ఆయన తపించారని తెలిపారు. "ఒక విదేశీయుడు(సీపీ బ్రౌన్) మన రాష్ట్రానికి వచ్చి, మన తెలుగు భాష కోసం కృషి చేశారు. ఆ మహోన్నతుడికి శత కోటి అభినందనలు. బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించాలని చాలా కాలంగా అనుకున్నా.. ఇప్పటికి ఆ భాగ్యం కలిగింది. ప్రతి ఊరికి ఒక దేవాలయం, విద్యాలయం, సేవాలయం, గ్రంథాలయం నెలకొల్పేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ, అవధాన సరస్వతి మేడసాని మోహన్, లక్షలాది గ్రంథాల సంరక్షకుడు మరె అంకెగౌడ, ప్రముఖ సాహితీవేత్త రేవూరు ఆనంద పద్మనాభలకు జాన మద్ది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయిప్రతాప, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందు సీపీ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్ర గ్రంథాలయ భవనంలోని విభాగాలను వెంకయ్యనాయుడు సందర్శించారు. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ విగ్రహాన్ని పరిశీలించారు.

మెక్సికోలోని సూపర్‌మార్కెట్‌లో భారీ పేలుడు

- 23 మంది మృతి, పలువురికి గాయాలు

మెక్సికో సిటీ, నవంబరు 2: మెక్సికోలోని ఓ సూపర్‌మార్కెట్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో కనీసం 23 మంది ప్రాణాలు కోల్పోగా, 12 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో పిల్లలు కూడా ఉన్నారని అధికారులు తెలిపారు. శనివారం హెర్మోసిల్లో నగరంలోని వాల్డోస్ అనే సూపర్‌మార్కెట్లో ఈ ఘటన జరిగింది. విషపూరిత వాయువులను పీల్చుకొని ఎక్కువ మంది మృతి చెందారని రాష్ట్ర అటార్నీ జనరల్ తెలిపారు. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

మరో రెండు ఐఏఎస్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్లపై సీసీపీఏ కొరడా.. రూ.8లక్షల చొప్పున ఫైన్

న్యూఢిల్లీ, నవంబరు 2: తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న మరో రెండు ఐఏఎస్ కోచింగ్ సెంటర్లపై కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) కొరడా ఝుళిపించింది. తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసినందుకు సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్స్ అయిన దీక్షంత్ ఐఏఎస్, అభిమను ఐఏఎస్‌లకు సీసీపీఏ రూ.8 లక్షల చొప్పున జరిమానా విధించింది. తమ అనుమతి లేకుండా తమ పేర్లతో పాటు ఫొటోలను ఈ ఇన్‌స్టిట్యూట్లు వాడినట్టు యూపీఎస్సీలో విజయం సాధించిన అభ్యర్థులు చేసిన ఫిర్యాదుల మేరకు సీసీపీఏ చర్యలకు ఉపక్రమించింది.

గల్ఫ్ నుంచి వచ్చి తిరిగిరాని లోకాలకు

- స్పోర్ట్స్ బైక్‌పై అర్ధరాత్రి అతివేగం
- విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఛిద్రమైన తల



హర్షవర్ధన్

పి.గన్నవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గతంలో ఒకసారి ప్రమాదానికి గురైతే కాళ్లలో రాడ్లు వేశారు. ఆ రాడ్లు తొలగించుకోవడానికి గల్ఫ్ నుంచి స్వదేశానికి వచ్చిన యువకుడు.. స్పోర్ట్స్ బైక్‌పై అర్ధరాత్రి మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రాణాలు పోగొట్టుకున్నాడు. హెల్మెట్ లేకపోవడంతో నేరుగా స్తంభానికి తగలడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరం శివారు మొండెపులంక వద్ద శనివారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కోనసీమ జిల్లా రాజోలు మండలం కడలి గ్రామానికి చెందిన నెల్లి హర్షవర్ధన్ (23) తన తండ్రి శ్రీనివాస్‌తో కలిసి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నాడు. నెల రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. కడలి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి వల్లూరి తేజ (16)తో కలిసి శనివారం రాత్రి స్వగ్రామం నుంచి రావులపాలెం వెళ్లడానికి సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో హర్షవర్ధన్ తన స్నేహితుడి వద్ద కవాసాకి నింజా స్పోర్ట్స్ బైక్ తీసుకుని దానిపై తేజను ఎక్కించుకుని బయల్దేరాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో మొండెపులంక లాకుల వద్దకు చేరుకోగా.. అతివేగం వల్ల బైక్ అదుపతప్పి శ్రీబాలగణపతి ఆలయం ఎదుట ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న హర్షవర్ధన్ తలనుజ్జునుజ్జు కాగా... వెనుక ఉన్న తేజకు బలమైన గాయాలయ్యాయి. తేజను చికిత్స నిమిత్తం అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. హర్షవర్ధన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రాడ్లు తీయించుకోవడానికి వచ్చి..: హర్షవర్ధన్ గతంలో ఒక సారి రోడ్డు ప్రమాదం బారిన పడ్డాడు. అప్పుడు కాళ్లకు బలమైన గాయాలు కావడంతో వైద్యులు రాడ్లు వేశారు. అనంతరం అతడు ఉపాధి నిమిత్తం తన తండ్రితో కలిసి గల్ఫ్ వెళ్లిపోయాడు. ఆ రాడ్డులు తీయించుకోవడానికి తండ్రి శ్రీనివాస్ కుమారుడిని నెలరోజుల క్రితమే ఇంటికి పంపించాడు. కానీ, ఈలోగా మరో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్నాడని బంధువులు రోదిస్తున్నారు.

రాజస్థాన్‌లో మరో బస్సు ప్రమాదం
18 మంది దుర్మరణం

జైపూర్/పుణె/ఠాణె, నవంబరు 2: ఏసీ బస్సు దగ్ధమైన సంఘటన మరవక ముందే రాజస్థాన్‌లో ఆదివారం మరో బస్సు ప్రమాదం సంభవించింది. నిలిపి ఉన్న ట్రయిలర్‌ను బస్సు ఢీకొనడంతో 18 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రాజధాని జైపూర్‌కు 400 కి.మీ.దూరంలోని ఫాలోడి జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పర్యాటక కేంద్రమైన జోధ్‌పూర్ జిల్లాలోని సుర్‌సాగర్, బికనేర్ జిల్లాలోని పుణ్యక్షేత్రమైన కోలాయత్‌లను సందర్శించుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం భజన్‌లాల్ శర్మ తెలిపారు. ఈ బస్సు ప్రమాదం పట్ల ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తపరిచారు. పీఎం సహాయనిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గత నెలలో జైసల్మేర్ జిల్లాలో ఏసీ బస్సులో మంటలు వ్యాపించడంతో 26 మంది మరణించారు. అప్పటి నుంచి అధికారులు బస్సులను తనిఖీలు చేస్తున్నప్పటికీ ప్రమాదం జరగడం గమనార్హం. మరోవైపు, మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం వేకువజామున అతివేగంగా వెళ్తున్న కారు మెట్రో పిల్లర్‌ను ఢీకొనడంతో ముగ్గురు మరణించారు. మద్యం సేవించి కారును నడపడమే ఈ ప్రమాదం కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. థానేలో మోటారు సైకిల్‌ను ఓ లారీ ఢీకొనడంతో రెండున్నర ఏళ్ల బాలుడు సంఘటన స్థలంలోనే మరణించాడు.

భళా బాహుబలి



నింగిలోకి దూసుకెళ్తున్న ఎల్వీఎం3-ఎం5

(మొదటి పేజీ తరువాయి)

దశలను సునాయాసంగా పూర్తి చేసుకుని 4,410 కిలోల బరువైన సీఎంఎస్-3 ఉపగ్రహాన్ని 16.29 నిమిషాల్లోనే నిర్ణీత కక్ష్యలో విడిచిపెట్టింది. ఆ వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ సహచర శాస్త్రవేత్తలను ఆలింగనం చేసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఎల్వీఎం3-ఎం5 రాకెట్ విజయవంతమైందని ప్రకటించారు.

వచ్చే ఐదు నెలల్లో ఏడు ప్రయోగాలు

ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం దేశానికే గర్వకారణమని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ అన్నారు. ఈ విజయం ఇస్రో చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. సీఎంఎస్-03 విజయానంతరం ఆయన మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ.. 'కక్ష్యలోకి విజయవంతంగా చేరిన ఉపగ్రహం స్థిరంగా ఉన్నట్లు బెంగుళూరులోని హసన్ మాస్టర్ కంట్రోల్ సెంటర్ గ్రౌండ్ స్టేషన్‌కు సిగ్నల్ అందాయి. ఇది ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన కమ్యూనికేషన్ ఉపగ్రహం. దీని బరువు 4,410 కిలోలు. ఈ ప్రయోగంతో భారత్ మరో ఘనత సాధించింది' అని తెలిపారు. వచ్చే ఐదు నెలల్లో ఏడు ప్రయోగాలు చేపట్టేందుకు ప్రణాళికలు రచించామని తెలిపారు. డిసెంబరు తొలివారంలో ఎల్వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లూబర్డ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామని, డిసెంబరు చివరిలో పీఎస్ఎల్వీ-సీ62 ద్వారా ఈవోఎస్-05 ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం ఉంటుందన్నారు. పీఎస్ఎల్వీ-ఎల్1, ఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ ప్రయోగ పనులు కూడా జరుగుతున్నాయన్నారు.

భారత్ పంపిన భారీ శాటిలైట్లు ఇవే..

శాటిలైట్	బరువు (కేజీల్లో)
సీఎంఎస్03	4,410
చంద్రయాన్-2	3,877
జీశాట్-29	3,423
జీశాట్-19	3,136
ఫ్రెంచ్ గయానా నుంచి పంపినవి..	
జీశాట్-11	5,854
జీశాట్-24	4,180
జీశాట్-17	3,477

భారత్ నుంచి ఇదే తొలిసారి

ఇస్రో గతంలో కూడా ఇంతటి భారీ ఉపగ్రహాలను ప్రయోగించింది. కానీ.. అవన్నీ ఫ్రెంచ్ గయానా నుంచి ఫ్రాన్స్‌కు చెందిన ఏరియన్ స్పేస్ అందించిన రాకెట్ల ద్వారా ప్రయోగించినవే. 2018 డిసెంబరు 18న ఫ్రెంచ్ గయానా నుంచి 5,854 కిలోల బరువున్న కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-11ను ఇస్రో ప్రయోగించింది. భారత భూభాగం నుంచి జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లో ప్రవేశపెట్టిన తొలి భారీ ఉపగ్రహం సీఎంఎస్-03 కావడం విశేషం.

ప్రధాని, ఉపరాష్ట్రపతి అభినందనలు

భారత గడ్డపై నుంచి తొలిసారిగా అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రోను ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అభినందించారు. 'మన శాస్త్రవేత్తల కృషితో అంతరిక్ష రంగం అద్భుతమైన ఆవిష్కరణలకు పర్యాయపదంగా మారడం ప్రశంసనీయం. ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన విజయాలు జాతీయ పురోగతిని పెంచాయి' అని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఇస్రో, భారత నావికా దళానికి అభినందనలు. ఈ విజయం ఆత్మనిర్భర్ భారత్‌లో మరో గర్వించదగిన మైలురాయికి చిహ్నం' అని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు.

సీ25 క్రయోజనిక్ దశపై కొత్త ప్రయోగం

ఎల్వీఎం3-ఎం5 రాకెట్‌కు సంబంధించిన సీ25 క్రయోజనిక్ దశపై కొత్త ప్రయోగం నిర్వహించామని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు. "దేశీయంగా అభివృద్ధి చేసిన సీ25 క్రయోజనిక్ దశను.. రాకెట్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చిన తర్వాత మరోసారి మండించాం. అది విజయవంతమైంది. ఇదొక గొప్ప ప్రయోగం. భవిష్యత్తులో క్రయోజనిక్ దశను పునఃప్రారంభించడానికి అవసరమైన డేటాను అందిస్తుంది. ఎల్వీఎం3 రాకెట్‌ను ఉపయోగించి బహుళ ఉపగ్రహాలను వివిధ కక్ష్యల్లోకి ప్రవేశపెట్టేందుకు అవకాశం కల్పిస్తుంది' అని నారాయణన్ తెలిపారు.

జీశాట్-7 సిరీస్.. నిఘాకు, రక్షణకు..

భారత్ రక్షణపరంగా, నిఘా కోసం, సరిహద్దుల వెంట, సముద్రంలో పరిస్థితుల సమాచారం, కమ్యూనికేషన్ కోసం ప్రత్యేకంగా జీశాట్-7 సిరీస్ ఉపగ్రహాలు ప్రయోగిస్తోంది. అందులో మొదటిది జీశాట్-7. 2,625 కిలోల ఆ ఉపగ్రహాన్ని 2013లో ఫ్రెంచ్ గయానా నుంచి అంతరిక్షంలోకి పంపారు. నౌకాదళం కోసం ప్రత్యేకించిన ఉపగ్రహం. దాని కాలపరిమితి ముగింపునకు రావడంతో.. ఆ స్థానంలో ఆధునికమైన, సమర్థవంతమైన సీఎంఎస్03 (జీశాట్-7ఆర్) ఉపగ్రహాన్ని ఇప్పుడు ప్రయోగించారు. ఇక వైమానిక దళం, సైన్యం కోసం ప్రత్యేకించిన జీశాట్-7ఏను 2018లో ప్రయోగించారు. దాని స్థానంలో ఆర్మీ కోసం మరింత మెరుగైన ఉపగ్రహం జీశాట్-7బీని అభివృద్ధి చేస్తున్నారు.

10 టన్నులూ మోయగలదు!

సీఎంఎస్03 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన ఎల్వీఎం-3(లాంచ్ వెహికల్ మార్క్-3) రాకెట్‌ను భారత 'బాహుబలి'గా పిలుస్తారు. జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్‌కు పలు మార్పులు చేసి దీనిని అభివృద్ధి చేశారు. దీని బరువు 640 టన్నులు, ఎత్తు 43.5 మీటర్లు. మూడు దశల ఇంధనంతో అంతరిక్షంలోకి దూసుకెళుతుంది. చివరి దశలో భారత్ అభివృద్ధి చేసిన 'సీఈ-20' క్రయోజనిక్ ఇంజన్‌ను అమర్చారు. భూసమీప కక్ష్య (ఎల్ఈవో)లోకి పది వేల కిలోల పేలోడ్‌ను, జీటీవో కక్ష్యలోకి 4,500 కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. సమీప భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న చంద్రయాన్, గగన్‌యాన్ ప్రయోగాలన్నీ ఎల్వీఎం-3తోనే జరగనున్నాయి. ఇక ఎల్వీఎంను మరింత అభివృద్ధి చేసి 'నెక్ట్స్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జీఎల్వీ)'ని రూపొందించేందుకు ఇస్రో ప్రయత్నిస్తోంది. ఎనిమిది టన్నుల బరువైన పేలోడ్లను జీటీవో (జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్) కక్ష్యలోకి చేర్చేలా దానిని అభివృద్ధి చేయనున్నారు.

సీఎంఎస్03.. సురక్షిత తీరం

భారత సముద్ర తీరం నుంచి సుమారు 3,500 కిలోమీటర్ల దూరం వరకు మన నౌకా దళానికి అవసరమైన సేవలను సీఎంఎస్03 ఉపగ్రహం అందిస్తుంది. దీనిలో యూహెచ్ఎఫ్, ఎస్, సీ, కేయూ బ్యాండ్ రాడార్లను అమర్చారు. దీని సాయంతో తీర ప్రాంతమంతటా నిఘా పెట్టడంతోపాటు ఒకే సమయంలో అత్యంత వేగంగా వివిధ రకాల కమ్యూనికేషన్లకు వీలు కల్పిస్తుంది. సముద్రంలో ఉన్న యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, సముద్రంపై ఎగురుతున్న యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల నుంచి.. నౌకాదళ ప్రధాన కార్యాలయానికి ఎప్పటికప్పుడు డేటాను అందిస్తుంది. అది కూడా మధ్యలో గుర్తించలేని విధంగా, హ్యాక్ చేయలేని విధంగా డేటాను, కాల్స్‌ను ఎన్‌క్రిప్ట్ చేసి, సురక్షితమైన కమ్యూనికేషన్‌ను అందిస్తుంది. ఈ ఉపగ్రహం నుంచి నౌకాదళానికి చేరే సమాచారాన్ని, కాల్స్‌ను, సిగ్నల్స్‌ను మధ్యలో ఎవరూ జామ్ చేయకుండా ప్రత్యేకమైన సాంకేతికతను వినియోగించారు.

లోకం తీరు



రోడ్డు ప్రమాదాలకు కాంట్రాక్టర్‌పై జరిమానా!

- 'బీవోటీ' హైవేల నిర్దిష్ట పరిధిలో ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ జరిగితే 25 లక్షలు
- తర్వాతి ఏడాదీ పునరావృతమైతే 50 లక్షలు

న్యూఢిల్లీ, నవంబరు 2: రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బీవోటీ (నిర్మాణం-నిర్వహణ-బదిలీ) పద్ధతిలో నిర్మించిన జాతీయ రహదారుల నిర్దిష్ట పరిధిలో (500 మీటర్లు) ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టర్లపై రూ.25 లక్షల జరిమానా విధించనున్నట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ బీవోటీ డాక్యుమెంట్‌ను సవరించిందని రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్ తెలిపారు. కాంట్రాక్టర్లు రోడ్డు ప్రమాదాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక ఏడాదిలో హైవేలోని నిర్దిష్ట పరిధిలో ఒకటి కంటే ఎక్కువసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగితే సదరు కాంట్రాక్టర్ రూ.25 లక్షలు జరిమానాగా చెల్లించాలని, తర్వాతి ఏడాది కూడా ప్రమాదాలు పునరావృతమైతే ఫైన్ రూ.50 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. హైవేల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 3,500 రోడ్డు ప్రమాదాల స్ట్రెచ్‌లను గుర్తించిందన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఆస్పత్రుల్లో నగదు రహితంగా చికిత్స అందించే పథకాన్ని ప్రభుత్వం త్వరలోనే ప్రారంభించనుందని ఉమాశంకర్ చెప్పారు. కాగా, హైవేల నిర్మాణాలను ప్రధానంగా బీవోటీతో పాటు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం), ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) పద్ధతుల్లో చేపడుతారు. నిర్వహణతో సహా ప్రాజెక్టులకు రాయితీ కాలం బీవోటీ మోడల్‌లో 15-20 సంవత్సరాలు ఉండగా, హెచ్ఏఎంలో 15 ఏళ్లు ఉంటుంది.

మోదీని ఆడిస్తున్న పెద్ద వ్యాపారులు

- అంబానీ, అదానీల చేతిలో రిమోట్ కంట్రోల్
- చిన్న వ్యాపారులను నాశనం చేసి బడా వ్యాపారవేత్తలకు మేలు చేయడమే మోదీ లక్ష్యం: రాహుల్

బెగూసరాయ్/ఖగారియా/ఢిల్లీ, నవంబరు 2: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటే భయపడటమే కాకుండా పెద్ద వ్యాపారవేత్తలు ఆడించినట్లు ఆడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బిహార్‌లోని బెగూసరాయ్, ఖగారియా జిల్లాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ మాట్లాడుతూ 'మహాత్మాగాంధీ నాటి శక్తిమంతులైన బ్రిటీషువారిని ఎదిరించారు. మరోవైపు 56 అంగుళాల ఛాతీ ఉన్న మన మోదీ ఆపరేషన్ సిందూర్ సమయంలో ట్రంప్ ఫోన్ చేయగానే భయపడిపోయి పాకిస్థాన్‌పై యుద్ధాన్ని ఆపేశారు. అంబానీ, అదానీ రిమోట్ కంట్రోల్ ద్వారా మోదీని ఆడిస్తున్నారు. చిన్న వ్యాపారవేత్తలను నాశనం చేసి, పెద్ద వ్యాపారవేత్తలకు మేలు చేసే లక్ష్యంతోనే మోదీ ప్రభుత్వం జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు తదితర ప్రధాన నిర్ణయాలన్నీ తీసుకుంది' అని ఆరోపించారు. కాగా, గత 20 ఏళ్లుగా బిహార్ యువత అవకాశాలను, కలలనూ బీజేపీ, జేడీయూ దూరం చేశాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. బిహార్ ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించాల్సిన సమయం ఆసన్నమైందని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. పారిశ్రామిక రంగంలో ఉపాధి విషయంలో దేశంలోనే 23వ స్థానంలో బిహార్ ఉందని ఖర్గే తెలిపారు. బిహార్‌లోని 10 శాఖల్లో జరిగిన రూ.70 వేల కోట్ల కుంభకోణాలను కాగ్ వెలుగులోకి తెచ్చిందని, దీన్ని అచ్చేదిన్‌కు సంకేతంగా భావించాలా? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. కాగా, బెగూసరాయ్‌లో ఎన్నికల ప్రచారం అనంతరం రాహుల్‌గాంధీ మత్స్యకారులతో కలిసి పడవలో చెరువు మధ్యలోకి వెళ్లి చేపలు పట్టారు. అనంతరం నీటిలోకి దిగి కూడా భారీ వలతో చేపల వేట కొనసాగించారు. ఈత కూడా కొట్టారు.

తమిళనాట 'సర్' పనులు ఆపకుంటే ఈసీపై సుప్రీంకోర్టులో పిటిషన్!

చెన్నై, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ఆపకపోతే సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేయాలని డీఎంకే నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. ఈ నెల నాలుగు నుంచి కేంద్ర ఎన్నికల సంఘం తమిళనాడు సహా 12 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో స్థానిక టి.నగర్‌లో డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. డీఎంకే మిత్రపక్షాలతో సహా 46 తమిళ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, బీజేపీ ప్రతినిధులను ఆహ్వానించలేదు. విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగంను ఆహ్వానించినా ఆ పార్టీ తరఫున ప్రతినిధులెవరూ ఈ సమావేశానికి హాజరుకాలేదు. పీఎంకే, డీఎండీకే పార్టీలు ఈ సమావేశాన్ని బహిష్కరించాయి. సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలకులకు సానుకూలంగా ఈసీ సర్ పేరుతో ఓట్ల చోరీలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

'ఆపరేషన్ సిందూర్' నుంచి వారింకా తేరుకోలేదు

పాక్‌పై బాంబులు వేస్తే కాంగ్రెస్ రాచకుటుంబానికి నిద్ర లేదు

- బిహార్ మహాగఠ్‌బంధన్‌లో తీవ్ర విభేదాలు
- వారి మేనిఫెస్టో అబద్ధాల పుట్ట: ప్రధాని



పట్నాలోని రోడ్ షోలో మోదీ

అర్రా/పట్నా, నవంబరు 2: పాకిస్థాన్‌లో పేలుళ్లు సంభవిస్తే కాంగ్రెస్ 'రాచకుటుంబా'నికి నిద్ర దూరమైందని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. 'ఆపరేషన్ సిందూర్' నుంచి పాక్‌తోపాటు కాంగ్రెస్‌లోని పేరు గొప్ప నాయకులు ఇంకా తేరుకోలేదని ఎద్దేవా చేశారు. బిహార్లో ఇండీ కూటమి పార్టీలతో కూడిన మహాగఠ్‌బంధన్‌లో తీవ్ర విభేదాలు ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన అర్రాలో జరిగిన సభలో మాట్లాడారు. పట్నాలో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఆయా సందర్భాల్లో మాట్లాడుతూ.. వికసిత్ భారత్ కోసం ఎన్డీఏ పార్టీలన్నీ కలిసికట్టుగా పనిచేస్తుంటే.. కాంగ్రెస్, ఆర్జేడీ మాత్రం పరస్పరం కొట్లాడుకుంటున్నాయని అన్నారు. 'ఓ అంతర్గత సమాచారం చెబుతున్నాను. నామినేషన్ల దాఖలుకు ముందు రోజు ఈ పార్టీలు నాలుగ్గోడల మధ్య సమావేశమయ్యాయి. ఆర్జేడీ నుంచి సీఎం అభ్యర్థి ఉండడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. దీంతో ఆ పార్టీ కాంగ్రెస్ తలపై తుపాకీ పెట్టి.. తేజస్వి యాదవే సీఎం అభ్యర్థి అని బలవంతంగా ప్రకటించేలా చేసింది. ఎన్నికల ముందే తీవ్ర విభేదాలు తలెత్తాయంటే.. ఎన్నికల తర్వాత తలలు పగలగొట్టుకుంటారు' అని విరుచుకుపడ్డారు. ఆర్జేడీ హయాంలో బీజేపీలో 'కట్టా (తుపాకీ), క్రూరత, కటుతా (కాఠిన్యం), కుశాసన్ (దుష్పరిపాలన), కరప్షన్ (అవినీతి)'తో కూడిన ఆటవిక రాజ్యం నడిచేదన్నారు. ఇప్పుడు చొరబాటుదార్లకు మద్దతివ్వడం ద్వారా, వారి కోసం యాత్రలు చేయడం ద్వారా బిహార్ గుర్తింపును మటుమాయం చేయాలని, చొరబాటుదార్లను ఎలాగైనా కాపాడుకోవాలని కాంగ్రెస్ కూటమి చూస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ఇప్పుడున్న రూ.6 వేల నుంచి రూ.9 వేలకు పెంచుతున్నట్లు ప్రధాని ప్రకటించారు. మహాగఠ్‌బంధన్ మేనిఫెస్టోను అబద్ధాల పుట్టగా అభివర్ణించారు.

బిహార్‌లో హింసను సహించం: సీఈసీ

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి హింసాత్మక సంఘటనలనూ సహించబోమని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అన్నారు. శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఓటర్లందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. బిహార్‌లో 243 మంది ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అదే సంఖ్యలో పరిశీలకులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు పరిశీలకులు, ఎన్నికల ఖర్చు పరిశీలకులు అందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బిహార్ ఎన్నికలు పారదర్శకత, సామర్థ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఉదాహరణగానే గాక మొత్తం ప్రపంచానికి ఒక నమూనాగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

18న సీఎంగా ప్రమాణం చేస్తున్నా

- బిహార్‌లో గెలుపుపై తేజస్వి ధీమా
- నేరస్థులంతా జైల్లో ఉంటారని ప్రకటన

పట్నా, నవంబరు 2: బిహార్ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి గెలుపు ఖాయమని ఆ కూటమి సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు వెలుడిన నాలుగు రోజులకే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నానని చెప్పారు. మొకమా నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై ఆర్జేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ అరెస్టు నేపథ్యంలో తేజస్వి ఆదివారం పట్నాలో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఈనెల 14న ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు. 18న ప్రమాణ స్వీకారం ఉంటుంది. ఇది జరిగి తీరుతుంది. ఎందుకంటే అంత తీవ్రమైన ఘటన జరిగింది' అన్నారు. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్‌సురాజ్ పార్టీ మద్దతుదారుడైన దులార్ చంద్ యాదవ్ హత్యకు గురైన నేపథ్యంలో అనంత్ సింగ్‌ను అరెస్టు చేశారు. 'బిహార్‌లో ప్రతి రోజూ తీవ్రమైన నేరాలు జరుగుతున్నాయి. మహాగఠ్‌బంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగానే పరిస్థితి మారుతుంది' అన్నారు. కుల, మతాలకు అతీతంగా నేరస్థులందరూ జైళ్లలో ఉంటారని, వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అమెరికాలో ఆకలి కేకలు!

- షట్‌డౌన్‌తో అక్కడి పేదలకు నిలిచిపోయిన ప్రభుత్వ సాయం



మసాచుసెట్స్‌లోని చెల్సియాలో ఉచిత ఆహార కేంద్రంలో సహాయం పొందుతున్న అమెరికన్లు

వాషింగ్టన్, నవంబరు 2: అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్‌తో ఆకలి కేకలు మొదలయ్యాయి. ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాల నిధులు నిలిచిపోవడంతో అక్కడి పేద ప్రజలు అల్లాడుతున్నారు. కొన్ని రోజులుగా ఉచితంగా ఆహారం, సరుకులు పంచే కేంద్రాల వద్ద బారులు తీరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన బడ్జెట్‌ను అక్కడి చట్ట సభ సెనేట్ ఆమోదించకపోవడంతో.. ప్రభుత్వంలో ప్రతిష్టంభన (షట్‌డౌన్) పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. బడ్జెట్‌లో ప్రతిపాదించిన పలు కేటాయింపులను, అంశాలను మార్చాలని సెనేట్ కోరుతోంది. దానికి అధికార రిపబ్లికన్ల నుంచి సానుకూలత వ్యక్తం కావడం లేదు. షట్‌డౌన్ పరిస్థితి నెలకొన్నప్పుడు పలు అత్యవసర ఖర్చులకు మినహా ప్రభుత్వం ఎలాంటి వ్యయం చేయడానికి వీల్లేదు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు కూడా నిలిచిపోతాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం నుంచి పేద ప్రజలు/అవసరార్థులకు 'సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్ఏపీ)' కింద ఇచ్చే నిధులు నిలిచిపోయాయి. ఎస్ఎన్ఏపీ కింద అమెరికాలో సుమారు 4.2 కోట్ల మందికి.. వారి పరిస్థితిని బట్టి ప్రతినెలా 200 డాలర్ల నుంచి 900 డాలర్ల వరకు సాయం అందుతుంది. ఇప్పుడా సాయం అందక.. స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు, చారిటీ సంస్థలు ఆహారం, నిత్యావసరాలు పంచేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. చాలా చోట్ల ఈ కేంద్రాలు త్వరగా ఖాళీ అవుతున్నాయి. దీనితో తెల్లవారుజామునే క్యూ కడుతున్నారు.

ఎస్ఎన్ఏపీ సాయం ఆపకండి

పేదలకు ఇచ్చే ఎస్ఎన్ఏపీ సాయం ఆపవద్దని మసాచుసెట్స్ జిల్లా జడ్జి ఇందిరా తల్వానీ, రోడ్ ఐలాండ్ ఫెడరల్ జడ్జి జాన్ మెక్‌కానెల్ తాజాగా ట్రంప్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని వాదించడం సరికాదని, ఇతర మార్గాల్లో నిధులు సేకరించిన పేదలకు సాయం పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. నవంబర్ 5వ తేదీ నాటికి కొంత మొత్తమైనా ఎస్ఎన్ఏపీ సాయం పంపిణీ చేసి, వివరాలు తమకు అందజేయాలని ఆదేశించారు. కాగా, అమెరికాలో 31 రోజులుగా కొనసాగుతున్న షట్‌డౌన్‌తో ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.62 వేల కోట్ల (700 కోట్ల డాలర్లు) నష్టం జరిగినట్టు ఆ దేశ ప్రతినిధుల సభ బడ్జెట్ కార్యాలయం ప్రకటించింది.

రాయాలా.. వద్దా?

(మొదటి పేజీ తరువాయి)

టెట్‌కు దూరంగా ఉంటారు. కానీ, ఐదేళ్లు దాటి సర్వీసు ఉన్నవారు, ఐదేళ్లలోపు సర్వీసు ఉండి పదోన్నతి దక్కే అవకాశం ఉన్నవారు టెట్ ఉత్తీర్ణత సాధించాలి.

5,916 మంది దరఖాస్తు

టెట్ నుంచి మినహాయింపు లభిస్తుందని చాలా మంది టీచర్లు ఆశిస్తుంటే టెట్ రాయాలని కొందరు టీచర్లు ఇప్పటికే నిర్ణయించుకున్నారు. ఇప్పటివరకు 5,916 మంది టీచర్లు టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశముంది. డిసెంబరు 10 నుంచి ప్రారంభమయ్యే టెట్ పరీక్షలకు వీరు హాజరుకానున్నారు. కాగా, ఇప్పటివరకు మొత్తంగా 53,560 మంది టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 18,982 మంది పురుషులు, 34,578 మంది మహిళలు ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఈ ఏడాది సెప్టెంబరు 1న వచ్చింది. కోర్టు ఆదేశాల ప్రకారం అప్పటినుంచి రెండేళ్లలోపు టెట్ లేని వారు టెట్ అర్హత సాధించాలి. దీంతో మినహాయింపుపై ఆశలు పెట్టుకోకుండా చాలా మంది టీచర్లు టెట్ రాయాలనే యోచనలో ఉన్నారు. కాగా, ఉపాధ్యాయ సంఘాల నేతలు మాత్రం టెట్ నుంచి మినహాయింపు లభిస్తుందని, వేచిచూడాలని టీచర్లకు సలహా ఇస్తున్నారు.

మినహాయింపు దక్కకపోతే?

ఇన్ సర్వీసు టీచర్లకు సుప్రీంలో మినహాయింపు దక్కకపోతే ఉద్యోగానికే ప్రమాదం ఏర్పడుతుంది. ఐదేళ్లకు మించి సర్వీసు ఉన్న టీచర్లు రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణత సాధించాలి. లేనిపక్షంలో ఉద్యోగం కోల్పోతారు అని సుప్రీంకోర్టు తీర్పు చెబుతోంది. ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న వారికి మాత్రం మినహాయింపు ఉంది. ఇప్పటికే పలు రాష్ట్రాల ప్రభుత్వాలు, ఉపాధ్యాయ సంఘాలు సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్లు వేశాయి. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం కూడా వారితో పాటు రివ్యూ పిటిషన్ వేయనుంది. అయినా, సుప్రీంలో టెట్‌పై మినహాయింపు దక్కకపోతే పరిస్థితి ఏంటని టీచర్లలో ఆందోళన పెరుగుతోంది.

ఆ సబ్జెక్టుల టీచర్ల ఆందోళన

దాదాపు 20 ఏళ్ల సర్వీసు తర్వాత ఇప్పుడు పోటీ పరీక్ష రాయడం అంత సులభం కాదని టీచర్లు అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా టెట్‌కు సన్నద్ధమై ఉతీర్ణత సాధించడం కష్టమనేది వారి వాదన. అందులోనూ గణితం, సైన్స్ టీచర్లకు టెట్ మరింత కష్టంగా మారనుంది. భాషా సబ్జెక్టులు, సోషల్ స్టడీస్‌లో దాదాపు సగం ప్రశ్నలు సంబంధిత సబ్జెక్టు నుంచి వస్తాయి. కానీ గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్... మూడు సబ్జెక్టులకు కలిపి ఒకే పరీక్ష రాయాలి. ఆయా సబ్జెక్టుల్లో ఒక్కో దాని నుంచి 20 మార్కులకే ప్రశ్నలు వస్తాయి. దీంతో 150లో 20 మినహా మిగిలినవి ఇతర సబ్జెక్టులు, జనరల్ ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. దీంతో ఆ సబ్జెక్టుల టీచర్లు మరింత ఆందోళనలో ఉన్నారు. 150 మార్కులకు జరిగే టెట్‌లో ఓసీలు 90 మార్కులు, బీసీలు 75 మార్కులు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు 60 మార్కులు దక్కించుకుంటేనే ఉతీర్ణత సాధిస్తారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి: యూటీఎఫ్

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలో యూటీఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెట్ మినహాయింపు కోసం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు 12శాతం ఐఆర్ ప్రకటించాలని, ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎవీ రవీంద్రబాబు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు న్యాయమూర్తికి ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

చినవెంకన్న సేవలో సుప్రీం, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు



జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి, జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్ రాయ్‌కు స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ ట్రస్టీ నివృతరావు, ఈవో మూర్తి

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్ రాయ్ ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా వచ్చిన వారికి అర్చకులు, దేవస్థానం చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల దర్శనం, పూజల అనంతరం న్యాయమూర్తులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు.

20న తిరుమలకు రాష్ట్రపతి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజులపర్యటన నిమిత్తం తిరుపతి జిల్లాకు విచ్చేస్తున్నారు. ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకుని అనంతరం తిరుమలకు బయలుదేరి వెళ్లనున్నారు. తిరుమలలో బస చేసి మరుసటి రోజు శ్రీవారిని దర్శించుకుంటారు. అదేరోజు మధ్యాహ్నం ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. 20వ తేదీన విమానాశ్రయంలో రాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు స్వాగతం పలకనున్నారు.



కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడి తెప్పోత్సవ దృశ్యం

వైభవంగా సత్యదేవుడి తెప్పోత్సవం

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం పుణ్యక్షేత్రంలో సత్యదేవుడి తెప్పోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. సాయంత్రం 5గంటలకు స్వామి, అమ్మవార్లను కొండపై నుంచి పల్లకీలో తీసుకుని వచ్చి, ప్రత్యేక పూజలు అనంతరం పంపా సరోవరంలో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన హంస వాహనంపై ఆశీనులు గావించారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అధికసంఖ్యలో భక్తులు తెప్పోత్సవాన్ని తిలకించారు.

అరసవల్లిలో ఆదిత్యునికి..





అరసవల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో ఆదిత్యుడి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇంద్రపుష్కరిణి నలువైపులా వేలాది మంది భక్తులు చేరి ఈ ఉత్సవాన్ని తిలకించారు. ముందుగా ఆదిత్యుడి ఉత్సవ మూర్తులను ఆలయ అనివెట్టి మండపం నుంచి ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. శ్రీ ఉషా, ఛాయా, పద్మినీ దేవేరులతో ఆదిత్యుడి ఉత్సవ మూర్తులను హంసవాహనంపై ఇంద్రపుష్కరిణిలో విహరింపజేశారు.



విజయవాడ సైకిల్ ర్యాలీలో ఏసీబీ డీజీ అతుల్ సింగ్

అవినీతిని నిర్మూలిద్దాం

- అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెడదాం
- విజిలెన్స్ వారోత్సవ ర్యాలీలో ఏసీబీ డీజీ అతుల్ పిలుపు

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాజంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అడ్డుగోడగా మారిన అవినీతి నిర్మూలనకు అందరం కలిసి కృషి చేద్దామని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా విజిలెన్స్ వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. 'విజిలెన్స్.. మన భాగస్వామ్య బాధ్యత' అనే థీమ్‌తో వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవినీతి వల్ల కలిగే నష్టం వివరించే కార్యక్రమాలను ఏసీబీ నిర్వహించింది. చివరిరోజు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడలో అతుల్ సింగ్ మాట్లాడుతూ.. 'అందరం పోరాటం చేస్తేనే అవినీతిని అరికట్టేందుకు వీలవుతుంది. ఎవరికి వారే ఇదొక యజ్ఞంలా భావించి అవినీతి కట్టడికి నడుం బిగిస్తేనే రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఎక్కడ అవినీతి జరుగుతున్నట్టు తెలిసినా ఏసీబీ(1064)కి సమాచారం ఇవ్వండి. అవినీతిని పారదోలితేనే సమాజం బాగుంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం నెరవేరుతుంది. రాష్ట్ర ప్రగతితో ఆంధ్రుల భవిష్యత్తు బాగుంటుంది' అన్నారు. సైకిల్ ర్యాలీలో ఏసీబీ డైరెక్టర్ జయలక్ష్మి, అదనపు ఎస్పీలు సుధాకర్ లోసారి, దిలీప్ కిరణ్ పలువురు డీఎస్పీలు, సీఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

- ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు హెల్త్‌కార్డులపై మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేయడమే లక్ష్యమని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. విజయవాడలోని ఎన్జీజీవో హోమ్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో 26 జిల్లాల నాయకుల్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్యసేవలు అందించడానికి ఆస్పత్రులు నిరాకరిస్తున్నాయని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ కోసం ఉద్యోగులు పెట్టుకున్న బిల్లులు ఏళ్ల తరబడి స్క్రూటినీలోనే మగ్గుతున్నాయని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హెల్త్‌కార్డులపై దృష్టి సారించారని, ఒక కమిటీని ఏర్పాటుచేసి 60 రోజుల్లోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామనడం శుభపరిణామన్నారు. ఉద్యోగులకు వైద్యసేవల్లో సమస్యలు సరిచేస్తూ, వీలు కుదిరితే ఇన్సూరెన్స్ కింద హెల్త్ కార్డు సేవలను తేవాలనే లక్ష్యంతో ఏపీ ఎన్జీజీవో సంఘం పనిచేస్తుందని, దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కమిటీని నియమించి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగ సంఘాలను పిలిపించి, వారి సమస్యలు విని, డీఏ విడుదల, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవ్, ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం వంటి అంశాల్లో తీసుకున్న నిర్ణయాలు సంతోషకరమని విద్యాసాగర్ పేర్కొన్నారు. ఏపీఎన్జీవో 75 సంవత్సరాల వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ కోశాధికారిగా భారతీప్రసాద్‌ను కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా డూండీ రాకేశ్

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ నియామకం జరిగింది. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అడ్వయిజరీ బోర్డు సెంట్రల్ కమిటీ చైర్మన్ గంజి రాజ్యమౌళి గుప్తా, ఐవీఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస గుప్తా నియామక పత్రాన్ని అందజేశారు. మూడేళ్ల పాటు రాకేశ్ ఈ పదవిలో కొనసాగుతారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- డిగ్రీ కాలేజీల సంఘం డిమాండ్

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాల సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమణాజీ, జి.రాజ్‌కుమార్ చౌదరి ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో ఆరు విడతలు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో రెండు విడతలు, మొత్తంగా ఎనిమిది విడతల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే సమయానుకూలంగా ఫీజులు విడుదల చేయాలని, అప్పుడే విద్యా సంస్థలు నైపుణ్యంతో విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేస్తాయని పేర్కొన్నారు. ఫీజుల విడుదలకు క్యాలెండర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వానలోటు తీర్చిన మొంథా తుఫాను

- గణనీయంగా పుంజుకున్న వర్షపాతం

అమరావతి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఫలితంగా రాష్ట్రంలో వర్షపాతం గణనీయంగా పెరిగింది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు -7.5శాతం వర్షం లోటు ఉండగా, అక్టోబరులో తుఫాను ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసి, వర్షపాతం +10.96శాతానికి చేరింది. సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 14.3 సెంటీమీటర్లు కాగా, కేవలం 8.9సెంటీమీటర్ల వర్షమే కురిసింది. అలాగే అక్టోబరులో 16 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతానికి 13.6 సెంటీమీటర్ల నమోదైంది. అయితే శ్రీకాకుళం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, నెల్లూరు జిల్లాల్లో సాధారణం కన్నా అత్యధికంగా వర్షాలు కురవగా, విజయనగరం, మన్యం, కాకినాడ, కోనసీమ, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణ వర్షపాతానికి స్వల్పతేడాతో వానలు పడ్డాయి. ఈ జిల్లాల్లో సెప్టెంబరు-అక్టోబరు నెలల్లో చాలా వ్యత్యాసం వచ్చింది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో సాధారణ కన్నా చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. అలాగే కోస్తాంధ్రలో 18.1 సెంటీమీటర్లకు 15.8 సెంటీమీటర్లు, రాయలసీమలో 13.6 సెంటీమీటర్లకు 8.6 సెంటీమీటర్ల వర్షపాతమే నమోదైంది. అయితే గతనెల చివరి వారంలో తుఫాను కారణంగా దాదాపు అన్ని జిల్లాల్లో వర్షాలు పడ్డాయి. ఇక, జూన్ 1 నుంచి ఇప్పటి(నవంబరు2) వరకు 75.7 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతానికి 84 సెంటీమీటర్ల వాన పడింది. సగటున అల్లూరి, మన్యం జిల్లాల్లో 63 రోజులు వానలు కురవగా, నెల్లూరు జిల్లాలో 20రోజులే వర్షం పడింది. నైరుతీ రుతుపవన కాలంలో వర్షపాతం తక్కువగానే ఉండగా, గత నెల మూడో వారంలో వచ్చిన ఈశాన్య రుతుపవనాలు, మొంథా తుఫాను ప్రభావంతో వరుసగా భారీ వర్షాలు కురవడంతో వాన లోటు తీరింది. అయితే ఖరీఫ్ సీజన్‌లో అతి తక్కువ వర్షాలు కురిసిన ప్రకాశం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లోని 37 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటించింది.

జూన్ నుంచి నవంబరు 2 వరకు వర్షపాతం

జిల్లా	సాధారణం (సెం.మీ.)	వాస్తవం (సెం.మీ.)
శ్రీకాకుళం	90.2	103
విజయనగరం	86	111
మన్యం	90.8	100
అల్లూరి	105	116
విశాఖపట్నం	84	96
అనకాపల్లి	91	103
కాకినాడ	89	82
కోనసీమ	106	85
తూర్పుగోదావరి	95	78
పశ్చిమగోదావరి	101	89
ఏలూరు	90	105.9
కృష్ణా	85	86.38
ఎన్టీఆర్	88.7	109.18
గుంటూరు	72	106
బాపట్ల	70	82
పల్నాడు	62	77.16
ప్రకాశం	59	79.33
నెల్లూరు	60.31	79.68
కర్నూలు	51.40	65.76
నంద్యాల	62.82	82.66
అనంతపురం	42.39	44.23
శ్రీసత్యసాయి	47.97	48.33
కడప	54.33	62.5
అన్నమయ్య	52.84	67.62
చిత్తూరు	62.68	87.62
తిరుపతి	64.31	91.33
కోస్తాంధ్ర	85.03	93.83
రాయలసీమ	54.84	68.75

విద్యార్థులను క్షేమంగా ఉంచి.. తాను తనువు చాలించి..

- స్కూల్ బస్సు నడుపుతుండగా గుండెపోటు
- రోడ్డు పక్కన ఆపి సీట్లోనే కుప్పకూలిన డ్రైవర్
- 40 మంది విద్యార్థులు క్షేమం



నాగరాజు

ఇంకొల్లు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హఠాత్తుగా ముంచుకొచ్చిన గుండెనొప్పితో అప్రమత్తమైన ఆ డ్రైవర్ విద్యార్థులను క్షేమంగా ఉంచి, తాను ప్రాణాలు ఒదిలాడు. బాపట్ల జిల్లా ఇంకొల్లులోని శివబ్రహ్మకాలనీకి చెందిన శెట్టిపల్లి నాగరాజు (67) కొంతకాలంగా పూసపాడు అడ్డరోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం స్కూల్ ముగిసిన అనంతరం బస్సులో సుమారు 40 మంది విద్యార్థులను ఎక్కించుకొని బయల్దేరారు. దగ్గుబాడు-నాయుడువారిపాలెం మధ్యకు రాగానే ఛాతీనొప్పి రావడంతో బస్సును రోడ్డు పక్కన నిలిపారు. అనంతరం సీట్లోనే నాగరాజు కుప్పకూలారు. ఇంకొల్లులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

కొడుకై నిలిచిన కోడలు!

- చితికి నిప్పుపెట్టి అంతిమ సంస్కారాలు



అత్తకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కోడలు

ముమ్మిడివరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భర్త, కుమారుడు దూరమైన ఆమెకు ఇన్నాళ్లు కోడలే సర్వస్వం అయింది...బాగోగులు చూసింది. చివరకు ఆమె చనిపోగా...మగదిక్కులేకపోవడంతో ఆ కోడలే తలకొరివిపెట్టి అంతిమసంస్కారాలు నిర్వహించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లికి చెందిన పాపిరెడ్డి ఆదిలక్ష్మి భర్త మరణించాడు. ఆమె కుమారుడు మూడేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో కోడలు శ్రీదేవి, నాలుగేళ్ల మనవడు, ఏడేళ్ల మనవరాలితో కలిసి ఆదిలక్ష్మి ఉంటోంది. కాగా, ఆదిలక్ష్మి ఆదివారం అకస్మాత్తుగా మృతి చెందగా, ఎవరూ లేకపోవడంతో శ్రీదేవే అత్త చితికి నిప్పు పెట్టింది. ఈ సంఘటన స్థానికుల హృదయాలను కదిలించింది.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వాన

- నేడూరేపూ ఉరుములు, పిడుగులతో వర్షాలు

విశాఖపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక చోట్ల ఆదివారం ఎండ తీవ్రత పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నర్సాపురంలో 35.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం నుంచి పలుచోట్ల ఉరుములు, పిడుగులతో వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో ఉరుములు, పిడుగులతో వర్షాలు పెరగనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం తూర్పుమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న రెండు రోజుల్లో ఉత్తర వాయవ్యంగా పయనించి మయన్మార్, బంగ్లాదేశ్ తీరం వైపు వెళుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం ఏపీ, తమిళనాడు, ఒడిశాలపై ఉండదని పేర్కొంది.

90 % పంట నష్టం అంచనాలు: వ్యవసాయ శాఖ

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియ కొనసాగుతోంది. 1,38,391 హెక్టార్లలో ప్రాథమిక అంచనా వేయాల్సి ఉండగా ఆదివారం సాయంత్రానికి 1,24,416 హెక్టార్లలో (సుమారు 90శాతం) పంట నష్టాన్ని అంచనా వేశారు. కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాలు మినహా 24 జిల్లాల్లోని 393 మండలాలు, 3,697 గ్రామాల్లో ప్రక్రియ పూర్తైందని వ్యవసాయశాఖ తెలిపింది. పంట నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నారు.

బీసీ బిల్లు కోసం జాతీయ ఉద్యమం

- పార్లమెంట్‌లో బిల్లు ఆమోదానికి సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలి
- ఎంపీ ఆర్. కృష్ణయ్య



కర్నూలులో విలేకరులతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, చిత్రంలో ఎంపీ నాగరాజు

కర్నూలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాధికారం, జనాభాకు అనుగుణంగా చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదం ద్వారానే సాధ్యమని, దాని కోసం జాతీయస్థాయి ఉద్యమాన్ని నిర్మిస్తామని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆదివారం ఆయన కర్నూలులో స్థానిక ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలసి విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు చొరవ తీసుకొని ప్రతినిధుల బృందాన్ని ప్రధాని వద్దకు తీసుకువెళ్లి చర్చలు జరిపితే, పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదం పొందుతుందన్నారు. త్వరలోనే పార్టీలకు అతీతంగా తెలుగు రాష్ట్రాల ఎంపీలు, ఎమ్మెల్యేలను కలుపుకొని చంద్రబాబును కలుస్తామని, బీసీ బిల్లు అమోదం కోసం కృషి చేయాలని కోరుతామని తెలిపారు. 'ప్రధాని మోదీ స్వయానా బీసీ.. ఆయన హయాంలోనే బీసీలకు న్యాయం జరుగుతుంది' అని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఎన్ని పోరాటాలు చేసినా, పాలకులను అర్థించినా ఏ ఒక్కరూ స్పందించలేదని, ప్రధాని మోదీని అడగగానే కులగణన, రాజ్యాంగబద్ధమైన బీసీ కమిషన్, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు సమ్మతి తెలిపారని పేర్కొన్నారు. బీసీ బిల్లు కోసం తెలంగాణ రాష్ట్ర బంద్ చేశామని, అన్ని రాష్ట్రాల్లో అదే తరహా ఉద్యమాలు చేస్తే కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలన్నారు. బీసీ రక్షణ చట్టం కూడా పార్లమెంట్‌లో ఆమోదం పొందాలని, ఆ దిశగా చంద్రబాబు కృషి చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం కురుబ కులస్తుల కార్తీక వనభోజనం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆయుష్షు తీసిన అలలు!

సముద్రంలో ఆటలాడుతూ ముగ్గురు యువకులు గల్లంతు

మృతదేహాలను వెలికితీసిన పోలీసులు .. మైపాడు బీచ్‌లో ఘటన



విద్యార్థుల మృతదేహాలు

ఇందుకూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజు సరదాగా సముద్రం వద్ద గడిపేందుకు వెళ్లిన ముగ్గురు యువకులు అలల ధాటికి గల్లంతయ్యారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం మైపాడు బీచ్‌లో ఆదివారం మధ్యాహ్నం ఈ ఘోరం జరిగింది. నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేటకు చెందిన పఠాన్ మహమ్మద్ తాజీమ్ (17), నెల్లూరు నగరం కోటమిట్టకు చెందిన పఠాన్ హుమయూన్(17), సమీద్ (17) ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ముగ్గురూ మైపాడు బీచ్‌కు వెళ్లారు. అక్కడ నీటిలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా అలలు రావడంతో గల్లంతు అయ్యారు. అక్కడ ఉన్న వారు చూసి కేకలు వేయడంతో మెరైన్ పోలీసులు రంగంలోకి దిగి గాలించారు. కాసేపటికి ఆ ముగ్గురి మృతదేహాలను వెలికి తీశారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర,రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

ఎర్రన్నకు ఘన నివాళి

కోటబొమ్మాళి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత నేత ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో వాడవాడలా టీడీపీ శ్రేణులు, అభిమానులు నివాళి అర్పించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి నివాళి అర్పించారు. ఎర్రన్న ఆశయ సాధన కోసం కృషి చేస్తామని వారు తెలిపారు.

బీజేపీ శాసనమండలి నేతగా సోము వీర్రాజు

అమరావతి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనమండలిలో బీజేపీ పక్ష నేతగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు నియమితులయ్యారు. రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన సోము వీర్రాజును ఆ పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బీజేపీ జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ చర్చించి ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. కాగా వైసీపీ నుంచి శాసనమండలికి ఎన్నికైన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానమ్, పోతుల సునీత రాజీనామా సమర్పించి బీజేపీ గూటికి చేరారు.

అగ్రి డైరెక్టర్‌కు సీడ్స్ బాధ్యతలు

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్) ఎండీ/ వైస్ చైర్మన్‌గా వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఎండీగా పని చేసిన ఢిల్లీరావు బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు గల్లంతు

కావలి రూరల్ : సముద్రంలో వేటకు వెళ్లి ఓ మత్స్యకారుడు గల్లంతయ్యాడు. నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ పెదరాముడుపాలెంకు చెందిన కాటంగారి బ్రహ్మయ్య (34) శనివారం రాత్రి గ్రామస్థులతో కలిసి జువ్వలదిన్నె హార్బర్ నుంచి బోటులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. తుమ్మలపెంట సమీపంలో చేపలు పడుతూ ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు బోటులో నుంచి కిందపడి గల్లంతయ్యాడు. మృతదేహం పెదరాముడుపాలెం సముద్రతీరానికి కొట్టుకువచ్చింది.

నలిగిన పాదాలు



నాన్న చిటికెన వేలు పట్టుకొని
జాతరలు ఊరేగడం గుర్తేలేదు
కడపిక్కలు పట్టేసిన
నాగలి కాళ్ళంట
కణతలు దేరిపోయిన పాదాల కింద
గడ్డి పరకలు ఏరుకొని
బతుకు నూకలు పోగేసుకోవడమైతే
ఇప్పుడిప్పుడే మరిచిపోయినట్టు లేదు

'పగులు లోయ గుండా
ప్రవహిస్తున్న నది' అన్నప్పుడల్లా
తరగతి గదిలో, నాన్న అరికాళ్లే
కళ్ళ ముందు మెదులాడుతాయి
నాన్న పాదాలు–
నదీ వ్యవస్థను ఉదహరించడానికి
ఇంతకంటే నమూనా ఉండదేమో!
కాకపోతే, నీళ్ళ జాగాలో
చెమట, నెత్తురు కనిపిస్తుందంతే

ఏ సుక్కపొద్దు యాలకో
కుండా మండ చల్లారబెట్టి,
నాన్న పాదాల ప్రవాహాలలో
వేడి నూనొత్తులతో
అమ్మ కట్టిన ఆనకట్టలన్నీ
తెల్లారి మెరక పొలంలో
ఏ దుబ్బుగడ్డికో లోకువైపోతుండేవి

కవితల్లో అల్లినట్టుగా
కథల్లో చెప్పినట్టుగా
సుకుమారమైన నాన్న చేతులెప్పుడూ
మా తలలను నిమరలేదు
బండలు పగలేసిన చేతులు కదా!
రాళ్ళదేరిపోయి, రాయీ రప్పల్లోనూ
వెన్నపూసలాంటి మనసులే
నాన్న చేతులు చూపించాయి

నాన్నైతే ఇప్పుడు లేరు
అంతోటి నాగలి కొండెక్కింది
ఉన్నవన్నీ బతుకు పాఠాలే
నాన్న ఈదుకొచ్చిన సంసారమంతా
నాలుగు స్తంభాలై
అమ్మని నిలబెడుతున్నప్పుడు
అమ్మ పాదాల్లోనూ నాన్నే కనిపిస్తాడు
నాగలి లేని సంసారాన్ని
ఒడ్డుకు చేర్చిన అమ్మ పాదాలు
ఇప్పుడు ఏ వెన్నపూసకు
ఇసుమంతైనా లొంగడం లేదు!

■ వినోద్ కుత్తుం
© 96343 14502

ప్రమాణాల్లేని నేటి విమర్శ



కవి లేదా రచయిత తీసుకున్న వస్తువు అందరిచేత ఆమోదం పొందాలని భావించి రచనకు పూనుకుంటాడు. ఎక్కువమంది పాఠకులు దాన్ని ఆమోదించినప్పుడు ఆ రచన విలువ పెరుగుతుంది. ఆ విలువను ఖరారు చేయగలిగిన వాడు విమర్శకుడు. విమర్శకుడు ఒక రచనను అంచనా వేయడంలో సాహిత్య విలువలను, సామాజిక విలువలను దృష్టిలో ఉంచుకోవాలి.

ఒక రచనను విమర్శ చేసే సందర్భంలో విమర్శకుడు ఏ ప్రలోభాలకు లొంగని న్యాయమూర్తి పాత్ర పోషించాలి. రచనని ఆకాశానికి ఎత్తేస్తూ వ్యాసం రాయడం విమర్శ కాదు. రచనను పాతాళానికి తోసేస్తూ మాట్లాడటమూ విమర్శ కాదు. ప్రతి రచనా ప్రభావవంతంగా ఉండాలని రచయితలు ఆశిస్తారు. కొన్ని సందర్భాల్లో రచన ప్రభావంతంగా లేనప్పుడు, రచయిత ఉన్నతిని కోరుకునే విధంగా విమర్శకుడి భాష ఉండాలి.

గత పదిహేను సంవత్సరాలుగా తెలుగు విమర్శను పరిశీలించినప్పుడు సరికొత్త సిద్ధాంతాల ప్రకటనలు ఏమీ లేవని అర్థమవుతుంది. కేవలం మార్క్సిస్టు విమర్శ, ద్రవాధునికత, పోస్ట్ మోడర్నిజం ప్రాతిపదిక మీదగా మాత్రమే చాలామంది విమర్శకులు వ్యాసాలు రాస్తున్నారు. ఆ వస్తున్న వ్యాసాల్లోనూ సారం తక్కువ. ఈ కాలపు సాహిత్య విమర్శలో కేవలం విశ్లేషణ మాత్రమే మనం చూస్తున్నాం. మరి కొంతమంది కేవలం లోపాలు చెప్పడం మాత్రం విమర్శ అనే భ్రమలో ఉన్నారు. ఏదైనా ఒక విమర్శను చేసినప్పుడు అందులో విమర్శకుడు తన పరికరాలు ఏమిటో, నిరూపణలు ఏమిటో చెప్పాలి. సాహిత్య విమర్శలలో వివరణలు ఉండవచ్చు. విశ్లేషణ ఉండవచ్చు. వివేచన ఉంటుంది. సమన్వయం ఉంటుంది. మూల్యాంకనము ఉంటుంది. ఇట్లాంటి లక్షణాలు కలిగిన విమర్శకులు రావాలి.

సాహిత్య వికాసంలో విమర్శ ఒక భాగం. ఒక కవిత సంపుటిని లేదా కవిత్వాన్ని విలువ కట్టడానికి ఇవాళ విమర్శకులు కొత్త ప్రమాణాలను రూపొందించినట్లు కనబడదు. కేవలం వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం ఈ నాలుగు మాటలతో వ్యాసం రాస్తే అది విమర్శ అని సాహిత్య లోకంలో ఇప్పుడు చెలామణిలో ఉంది.

గతంలో విమర్శకులు ఒక రచనను అంచనా వేసే క్రమంలో కొన్ని ప్రమాణాలను, సిద్ధాంతాలను పాటించే వారు. కట్టమంచి రామలింగారెడ్డి దగ్గర నుంచి త్రిపురనేని మధుసూదన రావు వరకు విమర్శ పద్ధతిగా సాగింది. ఆ తర్వాత వచ్చిన అనేకమంది విమర్శకులు ఆ పునాదిగా మాట్లాడారు కానీ కొత్త సిద్ధాంతాలను ప్రకటించడం లేదా సరికొత్త పరికరాలను అన్వేషించడం చేయలేదు. ప్రాచీన సాహిత్యాన్ని అంచనా వేయడానికి అనేకమంది తెలుగు విమర్శకులు పూనుకుని ప్రణాళిక ఇచ్చారు. ఆ తర్వాత అభ్యుదయ సాహిత్య విమర్శ దళితవాద విమర్శ స్త్రీవాదవిమర్శ, ప్రాంతీయవాదం వీటిల్లో కూడా కొంతమేర కృషి జరిగింది. ప్రపంచీకరణ ప్రభావం కూడా విమర్శలో కనిపించింది. జి. లక్ష్మీనరసయ్య దళిత కళాతత్వ విమర్శ లోనూ దేశీయ మార్క్సిజం ఆలోచన చేశారు. మేడిపల్లి రవికుమార్ తనదైన కోణాల నుంచి విమర్శ చేశారు కానీ ఆయన ఎక్కడ దాన్ని సమగ్రంగా రాత రూపంలో తీసుకు రాలేదు. పాపినేని శివశంకర్ ద్రవాధునికత మీద మాట్లాడారు. రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మార్క్సిస్ట్ పునాదుల మీద మాట్లాడారు. తిరుపతి రావు ఆధునికోత్తరవాదం గురించి చర్చించారు. సీతారాం పర్యావరణ కోణంలో సాహిత్య విమర్శకు కృషి చేస్తున్నారు.

అయితే ఈ కాలంలో విమర్శ పరిస్థితి ఏంటి? విమర్శకుడు అనే భ్రమలో వ్యాసాలు రాస్తున్న వాళ్ళ పరికరాలు ఏమిటి? తమవైన సిద్ధాంతాల ప్రాతిపదిక ఏమైనా ఉందా? సాహిత్య విమర్శకి సిద్ధాంత భూమిక వుండి తీరాలి. అప్పుడే కళకి సంబంధించిన లోతులనీ ఎత్తులనీ విశ్లేషణ చేయగలం. ఇందుకు భిన్నంగా తక్షణ స్పందన కోసం విమర్శ పేరుతో సామాజిక మాధ్యమాలలో వ్యాసాలు రాయడం చూస్తున్నాం.

ఒక రచన మీద స్పందన విమర్శ రూపంలో తెలపడం తప్పు కాదు గానీ, మాట్లాడుతున్న వారి భూమిక ఏంటో స్పష్టంగా తెలియాలి. తీవ్రమైన అధ్యయనం తర్వాత మాత్రమే విమర్శ రంగంలోకి అడుగు పెట్టాలి. మారుతున్న సమాజంలో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శను కూడా మనం స్వీకరించాలి. ఐతే అది విమర్శ అయి ఉండాలి. కువిమర్శ కాకూడదు. సమీక్ష పాఠకుడిని రచన దగ్గరకు తీసుకెళ్లగలదు. కానీ విమర్శ రచనని పాఠకుల లోపలికి తీసుకెళ్లగలగాలి.

ఈ కాలంలో విమర్శ పరిస్థితి ఏంటి? విమర్శకుడు అనే భ్రమలో వ్యాసాలు రాస్తున్న వాళ్ళ పరికరాలు ఏమిటి? తమవైన సిద్ధాంతాల ప్రాతిపదిక ఏమైనా ఉందా? ఒక కవిత్వ సంపుటిని లేదా కవిత్వాన్ని విలువ కట్టడానికి ఇవాళ విమర్శకులు కొత్త ప్రమాణాలను రూపొందించినట్లు కనబడదు. కేవలం వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం ఈ నాలుగు మాటలతో వ్యాసం రాస్తే అది విమర్శ అని సాహిత్య లోకంలో ఇప్పుడు చెలామణిలో ఉంది.

మారుతున్న సామాజిక విలువలను, మానవ సంబంధాల్లోని అసమతుల్యతను మన సాహిత్యం కళాత్మకంగా చిత్రీకరించగలుగుతుందా లేదా వంటి పరిణామాల మీద విమర్శకుడు దృష్టి పెట్టాలి. విమర్శకుడు రచన కంటే ముందుండాలి. గత పదిహేను సంవత్సరాలుగా దేశంలో రాష్ట్రంలో జరిగిన అనేక పరిణామాలను సాహిత్యం చిత్రీకరించగలిగిందా? కేవలం సాహిత్య విలువలు కలిగిన రచనలు మాత్రమే వచ్చాయా? సాహిత్యంలో సమాజం ఎట్లా ప్రతిబింబించింది? సౌందర్యాత్మక రచనల ప్రతిఫలనాలు ఏమిటి? ఈ కాలపు విమర్శకులు ఎట్లాంటి సాధనాలతో అంచనా వేయగలిగారో, వేయగలరో చూడాలి. సృజన ఉంటేనే విమర్శ. ఒక కాలపు సృజన లేదా ఒక రచయిత సృజన ఆధారంగానే విమర్శ పరికరాలను సిద్ధం చేసుకోవాలి.

■ సుంకర గోపాలయ్య
© 94926 38547

సోమవారం 3 నవంబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'ప్రకాశకిరణాలు' ఆవిష్కరణ

పొత్తూరి సుబ్బారావు రాసిన సంపాదకీయాల సంపుటి 'ప్రకాశ కిరణాలు' ఆవిష్కరణ సభ నవంబర్ 6 సా.6 గం.లకు హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికపై జరుగుతుంది. ఆవిష్కర్త: కె.వి. రమణాచారి, అధ్యక్షత: పి. విజయబాబు. కళా వి.ఎస్. జనార్ధనమూర్తి, వంశీ రామరాజు, బైస దేవదాసు, మౌనశ్రీ మల్లిక్, పెద్దూరి వెంకటదాసు, పొత్తూరి జయలక్ష్మి పాల్గొంటారు.

జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

రెండుతరాల కవిసంగమం

రెండు తరాల కవిసంగమం సిరీస్– 45 నవంబర్ 8న సా.6గం.లకు నిజాం కాలేజి, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. పాల్గొంటున్న కవులు: చెమన్, గట్టు రాధికమోహన్, తలారి సతీష్ కుమార్, జాదవ్ అంబదాస్, నితిన్ చౌహాన్ (నిజాం కాలేజి బి.ఏ విద్యార్థి).

యాకూబ్

కొడాలి గోపాలరావు శతజయంతి

సాహిత్య అకాడమీ, వివేక సర్వీస్ సొసైటీ సంయుక్త నిర్వహణలో కొడాలి గోపాలరావు శతజయంతి సదస్సు నవంబర్ 9 ఉ.10గం.ల నుంచి వివేక సర్వీస్ సొసైటి ఆవరణ, బాపట్లలో జరుగుతుంది. స్వాగతోపన్యాసం సి. మృణాళిని, ప్రారంభోపన్యాసం వల్లూరు శివ ప్రసాద్, కీలకోపన్యాసం డి.యస్. యస్. మూర్తి, అధ్యక్షత అంబటి మురళీకృష్ణ.

సాహిత్య అకాడమీ

ఖమ్మం ఈస్తటిక్స్ అవార్డు ఫలితాలు

ఖమ్మం ఈస్తటిక్స్ పోటీలో కవిత్వ విభాగంలో పలమనేరు బాలాజీ కవితా సంపుటి 'లోపలేదో కదులుతున్నట్టు' రూ.40 వేల బహుమతికి, రేణుక అయోల కవితా సంపుటి 'రవిక', పాయల మురళీకృష్ణ 'గచ్చం చెట్టుకు అటూ ఇటూ' ప్రత్యేక ప్రశంసకు ఎంపికయ్యాయి. కథల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా వి.ఆర్.రాసాని 'తేనె కల్లు' (రూ.25వేలు), ఆలూరి అరుణ్ కుమార్ 'అంజమ్మ' (రూ.15వేలు), యాములపల్లి నర్సిరెడ్డి 'కావలి' (రూ.10 వేలు) గెలుచుకున్నాయి. సాధారణ బహుమతికి ఎంపికైన మరో తొమ్మిది కథలతో ఒక కథా సంపుటి వస్తుంది. నవంబర్ 9 న ఖమ్మంలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ అందిస్తారు.

రవి మారుత్

ఒద్దిరాజు పురస్కారం

సహృదయ సాంస్కృతిక సాహిత్య సంస్థ వరంగల్ వార్షికోత్సవ సందర్భంగా ప్రతి ఏటా కథ, నవల, పద్యకావ్యం, వచనకావ్యం, సాహితీ విమర్శలలో ఒకదానికి ఆవృతంగా ఇచ్చే ఒద్దిరాజు సోదర కవుల స్మారక సాహితీ పురస్కారం 2025ను అంబల్ల జనార్ధన్ 'ముంబయి చూపుతో' కథా సంపుటికి లభించింది. రూ.10వేల నగదుతో పురస్కార ప్రదానం నవంబరు 15న హనుమకొండలో జరుగుతుంది.

గిరిజామనోహర బాబు

నాడు అందరూ ఆకాంక్షించిన దిశలో నేను ప్రయాణించలేదు

'రేవు చూడని నావ' అన్న కవితా సంపుటి – ప్రచురించాలన్న ఆలోచన ఎలా వచ్చిందో గుర్తులేదు కానీ వచ్చాక మొదట ఆచార్య తిరుమలగారి అభిప్రాయం అడిగాను. ఆయన "చాలా బావున్నాయి, తప్పకుండా పుస్తకం వేయవచ్చు" అంటూ ముందుమాట కూడా రాసి ఇచ్చారు. మాధవి ప్రింటర్స్ గురించి కూడా ఆయనే చెప్పినట్లున్నారు.

తర్వాత చంద్రగారిని ముఖచిత్రం వేసి ఇవ్వమని అడిగాను. ఆయన మొత్తం కవితలన్నీ చదివి, ఒక్కొక్క కవితనీ అందులోని పదాలనీ చాలా మెచ్చుకుంటూ మాట్లాడారు. అందమైన ముఖచిత్రాన్నీ గీసి ఇచ్చారు. ఆ ముఖచిత్రాన్ని చూసి సింగిల్ కలర్లో అంత అందమైన ముఖచిత్రం రావడం అరుదని చాలామంది అన్నారు.



సినారెగారి అభిప్రాయం కూడా తీసుకోమని చంద్రగారే చెప్పారు. పరిచయం లేదని నేను సందేహిస్తుంటే "పరిచయం అక్కర్లేదు, అడగండి" అని మరీమరీ చెప్పడంతో నారాయణరెడ్డి గారికి ఫోన్ చేశాను. సారస్వత పరిషత్ దగ్గర పుస్తకం అందిస్తే ఆయన ఒక్క వారంలోనే ముందుమాట రాసి పోస్టులో పంపారు.

'నాస్నేహితుడు' కథకు రచయిత్రిగా వచ్చిన గుర్తింపు వలన మా కంపెనీ ఎమ్.డి. డాక్టర్ డి.ఎన్.రావుగారు "ఈ ప్రాజెక్టని డ్యూక్ ఆర్నిక్స్ సపోర్ట్ చేస్తుంది" అంటూ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. పుస్తకం ప్రింటుకి ఇచ్చాం.

నా మొదటి పుస్తకం

టి. శ్రీవల్లీ రాధిక



తీరా పుస్తకం తెచ్చుకుందామని వెళ్ళేసరికి షాపు మూసేసి ఉంది. ఆ ప్రింటింగ్ ప్రెస్ ఊట్ల కొండయ్యగారిది. మొదట మాట్లాడి పని తీసుకున్నది వారి అబ్బాయి. తర్వాత వారిద్దరి మధ్య ఏవో విభేదాలు రావడంతో కొండయ్యగారు షాపుకి తాళం వేసేశారు. "అమ్మాయి దిగులు పడుతుందేమో, మీరు ఓదార్చండి" అంటూ దుర్వార్త చెప్పే డాక్టరు ధోరణిలో మావారికి విషయం తెలియచేసి, షాపు తెరిచే ప్రసక్తి లేదని కచ్చితంగా చెప్పారు. అయితే నేనేమీ కంగారు పడినట్లూ, దిగులు పడినట్లూ గుర్తు లేదు. ఎలా సర్దుబాటు చేసుకున్నారో తెలియదు కానీ ఒక నెల తర్వాత మళ్ళీ షాపు తెరిచి పుస్తకాలు అందించారు.

ఆవిష్కరణసభ 1997 జనవరిలో నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. తిరుమల అధ్యక్షులు. సి. నారాయణరెడ్డి ఆవిష్కర్త. చిల్లర భవానీదేవి, తేళ్ళ అరుణ పుస్తకం గురించి మాట్లాడారు. ఎందరో ప్రముఖ రచయితలు, బంధువులు, స్నేహితులతో హాలు క్రిక్కిరిసి పోయింది. సభలో అందరూ చిన్న వయసులోనే మంచి పుస్తకం తెచ్చానన్న అబ్బురాన్నీ, రచయితగాను, జీవితంలోను కూడా చాలా ఉన్నత స్థితికి ఎదుగుతానన్న ఆకాంక్షనీ వ్యక్తం చేస్తూ మాట్లాడారు. ఆ తర్వాత ఆంధ్రప్రభలో విశ్వనాథ పావనిశాస్త్రి, వార్తలో నాగభైరవ కోటేశ్వరరావు చక్కని సమీక్షలు రాశారు. ఆంగ్లపత్రిక హిందూలో కూడా మంచి సమీక్ష వచ్చింది.

ముప్పై ఏళ్ళ తర్వాత అదంతా గుర్తు చేసుకుంటూ ఉంటే రెండు విషయాలు అర్థమవుతున్నాయి. ఒకటి ఆరోజున సాహితీవేత్తలూ బంధువులూ ఆశించిన విధంగా నేను ఎదగలేదు. వారు ఆకాంక్షించిన దిశలో నేను ప్రయాణించలేదు. అందరూ పెదవి విరిచే దారిలో ఒంటరిగా చాలా దూరం వచ్చేశాను. రెండు, అప్పటిది ఏ పరిస్థితినైనా అనుకూలంగా మార్చుకోగలనన్న దూకుడు. ఇప్పుడున్నది ఏ పరిస్థితి అయినా ఆనుకూల్యమే అనుకోగలిగిన నిలకడ.

తెలంగాణ పాట ట్రెండ్ మారింది!


పాటకు పర్యాయపదం తెలంగాణ. ఇక్కడ పాటే ప్రశ్న అయితది. చెమట చెలిమైతది. పాడి పంటైతది. మార్కెట్ మర్మం చెప్తది. ఏరులా నిరంతరం పారుతనే ఉంటది. పాల్కుర్కి ద్విపదగా వినబడి, అక్కమహాదేవి వచనమై, వీరబ్రహ్మంగారి పలుకై జాతి జనులకు వెలుగైతది. వేమన పద్యమై జీవన సారాన్ని కాచి వడబోస్తది. పండుగ సాయన్న చైతన్యపు భజన బృందగానమైతది. దున్న ఈద్దాసు అచలాన్ని అలుముకుంటది. ఈ పరంపర నుండి బండి యాదగిరి, వయ్యా రాజారాం, సుద్దాల హన్మంతు, ఉగ్రాతలూగించే నాజర్ బుర్రకథలో అందెల స్వరాల వెల్లువైతది. ఇట్లా తెలంగాణలో పాట ఒక్కో దశలో ఒక్కో పాత్రను పోషించింది.

పాటది తెలంగాణతో పేగుబంధం. తమ కష్టాలకు కారకులైన వారిపై మార్మిక సాహిత్యాన్ని బొడ్డెమ్మ, కోలాట పాట రూపంలో ప్రజలు అల్లుకున్నారు. ఆ తర్వాత 1940ల నాటికి దక్కన్ పీఠభూమిపై చాలా ఉద్యమాలు వచ్చాయి. ఆ సందర్భంలో పాట మరో రూపంలోకి మారింది. ఇందులో బుర్రకథలు, బాగోతాలు, సుద్దులు, భజన పాటలు, కోలాటం ఇట్లా చాలా రూపాల్లో తమ బాధలకు పరిష్కారం పాటల్లో చెప్పుకున్నారు. నేడు ఉన్నట్లుగా జ్ఞానపు సమాచారం నాటి వారికి అందుబాటులో లేదు. అయినా తమ జీవిత కోణం నుండే ప్రపంచాన్ని చూశారు. బతుకు కేంద్రంగానే పాటలు అల్లుకున్నారు. సరికొత్త బాణీలతో పాటలు అల్లుకున్నరు.

సామాజిక, రాజకీయార్థిక ప్రభావాలు పాటపై బలమైన ప్రభావాన్ని చూపించాయి. 1970ల నుండి కొత్త తరం కలాలు, గళాలు పుట్టుకొచ్చాయి. నాటి సమాజ క్లేశాన్ని నిలేసినవారే ఈ వరుసలో ఎక్కువున్నరు. బి. నర్సింగరావు, గూడ అంజన్న, ఆ తర్వాత గద్దర్, మాష్టార్జీ, గోరేటి వెంకన్న, మిత్ర, విమలక్క, సంధ్య, అందెశ్రీ, జయరాజు, సిద్దారెడ్డి, సుద్దాల అశోక్ తేజ, ఏపూరి సోమన్న, అరుణోదయ నాగన్న; రాసి, పాడి, ఆడిన వారిలో దేశపతి శ్రీనివాస్, రసమయి బాల్ కిషన్, అంతడ్పుల నాగరాజు, మధుప్రియ, నిసార్, అంబటి వెంకన్న, ఈ పరంరపరలోనే సాయిచంద్, మిట్టపల్లి సురేందర్, కోదారి శ్రీను, ఫైలం సంతోష్, వరంగల్ శ్రీనివాస్, దరువు ఎల్లన్న, దరువు అంజన్న, చింతల యాదగిరి, యశ్ పాల్... ఈ వరుస కొనసాగుతున్నది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాటనే కోట్లాది ప్రజల గుండెలను తట్టి లేపింది. రాజకీయ నాయకుల మైకులు మౌనం దాల్చినప్పుడు పాటే పోరాట రూపమైంది. విస్మరణకు గురైన కళారూపాల గురించి, కళాకారుల గురించి, సాహితీ ప్రముఖుల గురించి కె. శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సామిడి జగన్ రెడ్డి, జిలుకర శ్రీనివాస్ వంటి వారు కొంత రాశారు. పసునూరి రవీందర్ పాటపై ప్రామాణికమైన పరిశోధన చేసి, పాట లోతుపాతులపై ముందు తరాలకో అవగాహనను అందించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాట వాడి వేడిలో స్తబ్ధత నెలకొన్న మాట వాస్తవం. కానీ నాడైనా, నేడైనా జానపదుల పాటల్లో పుష్కలంగా జీవిత రమణీయత, కమనీయత సూర్యోదయమంత అద్భుతంగా కొనసాగుతూనే ఉన్నది. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత తెలంగాణ పాట ఖండాంతరాలు దాటింది. సుమారు దశాబ్ద కాలంగా తెలంగాణ జానపదం సోషల్ మీడియాను షేక్ చేస్తున్నది. దేశంలోని అన్ని భాషల ప్రజలను తన వైపు తిప్పుకున్నది. ప్రపంచ సెలబ్రిటీలు సైతం "రాను ముంబైకి రాను...." పాటకు రీల్స్‌లో స్టెప్పులు వేయాల్సిందే. అంతే కాదు "సిన్ని సిన్ని సింతల్ల బావయ్యో..." అంటూ తెలంగాణ యాస లొలికించే స్వరానికి కోటానుకోట్లమంది చెవులప్పగించాల్సిందే. "బుల్లెట్టు బండెక్కి వచ్చేస్త పా...." పాట సృష్టించిన సంచలనం గురించి తెలుగు వారికి చెప్పాల్సిన పనే లేదు. మునుపటి కంటే కాస్త మెరుగైన జీవితానుభవం వల్లనే ఈ పాటలకు జనం నుండి ఇంత ఆదరణ ఉందనే భావన చాలా మందిలో ఉంది.

తెలంగాణ పాట కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటున్నది. ఒకప్పుడు తిండికిలేని పేదల ఇంటి చుట్టూ తిరిగింది. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం సాధనను లక్ష్యంగా చేసుకున్నది. ఇప్పుడు ట్రెండ్ మార్చి సోషల్ మీడియా ఆసరాగా ప్రపంచ ఖ్యాతిని అందుకుంటున్నది. నేటి పాటకు దిశ సరిగ్గా ఉందా లేదా అనే దాని కంటే, పాట సజీవంగా ఉందా లేదా అన్నది ముఖ్యం. నేటి తెలంగాణ పాటలో తెలంగాణ యాస, జీవనమార్గం బలంగా ఉన్నాయి.



2000 సంవత్సరం నాటి కల్లా దక్షిణ తెలంగాణా నుండి జంగిరెడ్డి, ఉత్తర తెలంగాణ నుండి విజయ, రమాదేవి, నెర్నేల కిషోర్ వంటి వారు తెలంగాణ ఉద్యమ పాటలతో పాటు జానపదాలను అందుకున్నారు. అప్పుడప్పుడే ప్రజలకు పరిచయం అవుతున్న కమ్యూనికేషన్ టెక్నాలజీ ద్వారా పాటను ప్రజలకు అందించే ప్రయత్నం చేశారు. మాట్ల తిరుపతి, మానుకోట ప్రసాద్, రాము రాథోడ్ వంటి వారు రాసిన జానపదాలకు కోట్ల సంఖ్యలో వ్యూస్ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు 20కోట్లమంది వరకు ఉండొచ్చు. కానీ ఒక్కో పాటకు వీక్షణలు 50 కోట్లకు పైబడే ఉన్నాయి. అంటే పాట కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటున్నది. ఒకప్పుడు తిండికిలేని పేదల ఇంటి చుట్టూ తిరిగింది. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం సాధనను లక్ష్యంగా చేసుకున్నది. ఇప్పుడు ట్రెండ్ మార్చి సోషల్ మీడియా ఆసరాగా ప్రపంచ ఖ్యాతిని అందుకుంటున్నది.

కొత్తతరం గాయనీగాయకులు, రచయితలు వస్తున్నారు. కనకవ్వ లాంటి ఎందరో యూట్యూబ్‌లోకి వచ్చారు. కోటానుకోట్లమంది హృదయాల్లో స్థానం సంపాదించుకుంటున్నారు. "తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పాట మార్కెట్‌కు అనుగుణంగా రుపాంతరం చెందింది. పాట గతి తప్పింది," అంటున్నవారు ఉన్నారు. కానీ నేటి పాటకు దిశ సరిగ్గా ఉందా లేదా అనే దాని కంటే, పాట సజీవంగా ఉందా లేదా అన్నది ముఖ్యం. నేటి తెలంగాణ పాటలో తెలంగాణ యాస, జీవనమార్గం బలంగా ఉన్నాయి. జానపద బాణీ భక్తిపాటల రూపంలో, జీవిత ప్రేమానురాగాల రూపంలో ముందు తరాలకు చేరుతున్నది.

■ గోర్ల బుచ్చన్న
© 87909 99116

మళ్ళీ మెలుకువ...

ఏదోగా ఉంటుంది
అంతా ఏమిటోగా ఉంటుంది
అర్ధరాత్రి
సముద్రాన్ని కప్పుకున్న ఒంటరి పడవ
ఆకాశాన్ని మోస్తున్న విమానం
జీవన సంధ్యలో
భూమిపైన మెలుస్తున్న చుక్కలు
ఒక కల నడుస్తున్నట్లే ఉంటుంది
ఏళ్ల తరబడి మౌనీకరించబడ్డ శబ్దం
అకస్మాత్తుగా పేలిపోతుంది
ఏదోగా ఉంటుంది
అంతా ఏమిటోగా ఉంటుంది
నిశ్శబ్దంగా
ఒంటరిగా
కుటీరంలో నివసిస్తున్న
ఏకాంత వాసికి
అర్ధరాత్రి ఎవరో దర్శనమిస్తారు
జీవన పోరాటంలో
అలసిపోయానని చెబుతున్నా వినక
ఇంకా పోరాటం చేయాల్సి ఉందని
ప్రబోధిస్తారు
అనుకోని అతిథికి
రెండు పద్యాలని వడ్డించి
మౌనంగా కూర్చుంటాను
కొంతకాలం గడుస్తుంది
కొన్ని యుగాలు వెనక్కి వెళ్తాయి
ఎక్కడో ఎప్పుడో దాచుకున్న
కొన్ని స్వప్నాలు
నిశ్శబ్దాన్ని చీల్చుకుని
బయటకు వస్తాయి
బాటసారి ఇంకొంచెం కవిత్వం
మధురసం తాగి
బయలుదేరుతాడు
మళ్లీ కళ్ళు తెరుస్తాను
వర్తమానపుటెండ నెగడు
తలకు చుట్టుకుంటుంది
తెగిపోయిన చెట్టుకొమ్మ
ఒకటి ఎగురుతూ వచ్చి
రక్తదాహపు ప్రభుత్వాలు
పడిపోతాయని రహస్యం చెబుతుంది
భూగర్భ కుహరాల్లో
అప మృత్యువుకు బలైపోయిన
దుఃఖిత ప్రాణవాయువులు
కొత్త పద్యాలై జీవం పోసుకుంటాయి.
ఎంత వృద్ధాప్యం వచ్చినా
నడవక తప్పదని తెలుస్తుంది
జీవితానికి కొత్త అర్థం
పురుడు పోసుకుంటుంది.

■ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
© 96760 96614







అధికారులకు సూచనలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ఆక్రమణలో.. ఆనవాళ్లు

- ఘనకీర్తికి మారుపేరుగా మందడం, మల్కాపురం
- సజీవ శిలాజాలుగా శివాలయం, నందిశాసనం, కోనేరు
- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రజల వేడుకోలు


గణపతిదేవుని ఆధ్వర్యంలో విశ్వేశ్వర శంభు నిర్మించిన శివాలయం

శౌర్యానికి.. ధైర్యానికి ప్రతీకగా నిలిచే రాణి రుద్రమదేవి అంటే నేటికీ తెలుగునాట ఘనకీర్తి. రాజధాని అమరావతితో కాకతీయుల రాణికి ప్రత్యేక అనుబంధం ఉంది. అమరావతి భూభాగంలో ఆమె ఎన్నోసార్లు నడయాడారు. కాకతీయ సామ్రాజ్యం పాలనా పగ్గాలను చేపట్టడానికి ముందునుంచే రుద్రమదేవి తండ్రి గణపతి దేవునితో కలిసి తరచుగా మల్కాపురం వచ్చిపోతుం డేవారు. ఈ ప్రాంతంలోని ఓ కొలనంటే ఆమెకు ఎంతో మక్కువ. ఆ కొలను ఒడ్డున కూర్చొని సేదతీరేవారు. ఈ ప్రాంతంపై తనకున్న ప్రేమాభిమానాల కొద్దీ ఆమె తన జన్మదినోత్సవాన్ని ఇక్కడే ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఇక్కడి మహిళల గర్భకోశ వ్యాధుల చికి త్సల కోసం ఏకంగా ఓ ప్రసూతి వైద్యశాలనే ఆమె కట్టిం చారు. రాణీ రుద్రమదేవిని అంతగా ఆకట్టుకున్న ఆ ప్రదేశమే నేటి మల్కాపురం. రుద్రమదేవి తాలూకు ఆనవాళ్లు ఇప్పటికీ అక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఆ ఆనవాళ్లు నేడు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిని పట్టించుకునేవారు లేరు. ఘన చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న ఈ ప్రాంతాన్ని రాష్ట్రప్రభుత్వం గుర్తించి, రుద్రమదేవి తాలూకు ఆనవాళ్లను పరిరక్షించి దీనినో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


అమరావతిలో రుద్రమదేవి గుర్తులు శిథిలం

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

రుద్రమదేవి చరిత్ర తెలంగాణకే కాదు.. యావత్ తెలుగుప్రాంతానికంతా సుపరిచితమే. వరంగల్ కేంద్రంగా ఆమె పాలన కొనసాగినప్పటికీ నేటి రాజధాని అమరావతి ప్రాంతం కూడా అప్పట్లో ఆమె ఏలుబడిలోనిదే. రుద్రమదేవి తండ్రి గణపతిదేవుని కాలం నుంచే ఈ ప్రాంతంలో కాకతీయులకు అనుబంధం ఉండేది. తనకు రాజగురువుగా కొనసాగిన విశ్వేశ్వర శంభు అనే శివాచార్యునికి ఈ ప్రాంతాన్ని బహుమతిగా ఇచ్చారు గణపతిదేవుడు. రాయపూడి మొదలు పెనుమాక వరకు ఉన్న పదికిపైగా గ్రామాలను ఈ విశ్వేశ్వరశంభుకు అప్పగించారు. నాలుగు గొప్ప రాజవంశాలకు రాజగురువుగా వ్యవహరించారు. కృష్ణానది ఉత్తరవాహినిగా ఉన్న ఈ ప్రాంతాన్ని కాకతీయ చక్రవర్తి విశ్వేశ్వరశంభుకు అప్పగించారు. మల్కాపురంలో విశ్వేశ్వరశంభు గోళకీమఠాన్ని స్థాపించారు. గోళకీ మఠం అంటే శివాలయం. వేదవిద్యతో కూడిన మహా విద్యాలయ సముదాయం. అప్పట్లో ఈ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల సందర్భంగా పదిమంది నృత్యకళాకారిణులు నాట్యం చేస్తుండేవారు. 14 మంది మహిళా గాయకురాండ్రు, వివిధ రకాల వాయిద్యాలను వాయిస్తూ మరో 16 మంది సంగీత కళాకారులు ఉండేవారు.. అర్చనల నిమిత్తం ఆరుగురు, ఆలయ నైవేద్యాల కోసం మరో ఇద్దరు బ్రాహ్మణులు ప్రత్యేకంగా ఉండేవారు. వీరభద్రుల పేరిట పది గ్రామాల ను సంరక్షించడానికి 73 మందితో కూడిన ప్రత్యేక సైనికదళం (మిగతా 6లో)


మల్కాపురంలో రాయ గజకేసరి రాణీ రుద్రమదేవి వేయించిన శిలాశాసనం

ఘనంగా రుద్రమా జయంత్యుత్సవం

1261 మార్చి 25న రుద్రమదేవి తన జన్మదినోత్సవాన్ని మల్కాపురంలోని గోళకీమఠంలో ఎంతో వైభవంగా జరుపుకున్నారు. ఆ సందర్భంగా శివాలయానికి తూర్పు దిక్కుగా ఓ భారీ శిలాశాసనాన్ని వేయించారు. అది ఇప్పటికీ చెక్కుచెదర కుండా ఉంది. దీనిని నంది శాసనమమని, నాగశాసనమని వ్యవహరిస్తుంటారు. ఈ శాసనంపై ఆలయం వైపు నంది విగ్రహం.. మరోవైపు పడగవిప్పి సర్పం చెక్కబడి ఉండటమే ఇందుకు కారణం. దీనిపై నాటి జయంత్యుత్సవాల నిర్వహణ, చేసిన దానాల గురించి విపులంగా తెలుగు, సంస్కృత భాషల్లో లిఖించారు. ఈ సందర్భంలోనే రుద్రమదేవి ఆలయానికి తూర్పు ఈశాన్యంగా ఓ కోనేరును తవ్వించడంతోపాటు మండం పరిధిలో ఓ ప్రసూతి వైద్యశాలను ఏర్పాటు చేయించారు. అప్పట్లో గర్భిణులు సుఖప్రసవాలు లేక మృత్యువాత పడుతుండడాన్ని చూసి రుద్రమదేవి ఎంతగానో చలించిపోయి ఈ ప్రసూతి వైద్యశాలను అన్ని సదుపాయాలతో ఏర్పాటుచేయించారు. ఈ ప్రస్తావన కూడా ఆ శాసనంలో ఉంది. తాను సామ్రాజ్ఞిగా పట్టాభిషక్తురాలైన తర్వాత కూడా రుద్రమదేవి ఇక్కడికి ఎన్నోమార్లు వచ్చారు. తాను నిర్మించిన కోనేరు ఒడ్డున కూర్చొని సేదతీరుతుండడం ఆమెకు ఇష్టమైన అలవాటుగా ఉండేదంటారు. 1289లో జరిగిన ఓ మహాసంగ్రామంలో రుద్రమదేవి వీరమరణం పొందిన తర్వాత కూడా చాలాకాలం ఈ ప్రాంతం గొప్పగానే వెలుగొందుతూ వచ్చింది.

పర్యాటక కేంద్రాలుగా
చెరువులు

- అమృత్ సరోవర్ మోడల్ ప్రాజెక్టుగా వెంగళాయపాలెం
- చెరువు పరిశీలనకు 11న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి రాక
- పనులను పరిశీలించిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు(తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ ఆక్టివిటీ(డబ్ల్యూడీసీ) పథకంలో భాగంగా గ్రామాల్లోని చెరువులను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. అమృత్ సరోవర్ మోడల్ ప్రాజెక్టుకు ఎంపికైన గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం చెరువులో జరుగుతున్న పనులను ఆదివారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆయన పరిశీలించారు. చెరువు అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 9కి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ అమృత్ సరోవర్ ప్రాజెక్టు ద్వారా భూగర్భ జలాలు పెంచేలా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చెరువు చుట్టూ రూ.1.2 కోట్లతో ఓపెన్ జిమ్, ఆటస్థలం, బెంచీలు, లైట్లు, వాకింగ్ ట్రాక్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 300 కొబ్బరి చెట్లు, చేపల పెంపకంతో గ్రామానికి ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రజలు భాగస్వామ్యం అవసరమని, అప్పుడే ఈ ప్రాజెక్టు విజయవంతం అవుతుందని చెప్పారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎంకేఎస్‌వై)పై ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లాలో జాతీయ సదస్సు జరుగుతుందని, ఈ నేపథ్యంలో ఈ చెరువును పరిశీలించేందుకు 11న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ రానున్నట్లు తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లో పనులను 9వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శంకర్, పర్యవేక్షణ అధికారి శాంతరావు, పంచాయతీ కార్యదర్శి రవి, సర్పంచ్ లలితాకుమారి, టీడీపీ సీనియర్ నాయకులు రావి వెంకటరమణ, కల్లూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మో చికెనా

- స్టాల్స్‌లో కుళ్లిన కోడి మాంసం
- కుప్పలు తెప్పలుగా చచ్చిన కోళ్లు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చికెన్ అనగానే చాలామంది లొట్టలేసుకొంటూ ఆరగిస్తుంటారు. అయితే కోడి మాంసం విక్రయి స్తోన్న కోళ్ల ఫారంలు, చికెన్ స్టాల్స్‌లో ఉన్న వాతావరణం చూస్తే వాంతి చేసుకోవాల్సిందే. ముఖ్యంగా గుంటూరు నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న స్టాల్స్‌లో రోజుల తరబడి ఫ్రీజర్‌లో నిల్వ చేసిన కోడిమాంసం, నీళ్లల్లో నానబెట్టిన లివర్, కందనకాయ వంటివి పారవే యకుండా తాజా అంటూ వినియోగదారులకు విక్రయిస్తోన్నారు. చచ్చిన కోళ్లు కూడా పదుల సంఖ్యలో ఉంటున్నాయి. వాటిని కూడా కోసి చికెన్ విక్రయాలు జరుపుతోన్నారు. ఆదివారం ఏపీ మాంసం అభివృద్ధి సంస్థ చైర్మన్ చంద్ర దండు ప్రకాష్‌నాయుడు తనిఖీలలో విస్తుబోయే దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. విక్రయాలు పెరగడంతో వాడవాడలా చికెన్‌స్టాల్స్ వెలిశాయి. ఈ ప్రాంతాలకు కోళ్లను తీసుకొచ్చే వాహనం చూ స్తేనే ప్రతీ ఒక్కరికి కడుపులో దేవేస్తుంది. అలా తీసుకొచ్చిన కోళ్లను కటింగ్ చేసి ఒక మెషీన్‌లో పడేసి ఈకలు మొత్తం ఊడిపోయిన తర్వాత తలకాయ, కాళ్లు వేరు చేసి ముక్కలు కొట్టి విక్రయిస్తున్నారు. చికెన్ స్టాల్స్ వెనక ఏర్పాటు చేసుకొన్న ప్రాంగణంలో ఫ్రీజర్లు పెడుతున్నారు. అక్కడే టబ్‌లు, డ్రమ్ములు ఉంచి వాటిల్లో నీళ్లపోసి నిల్వవున్న చికెన్‌ని అందులో పెడుతున్నారు. చికెన్ స్టాల్ వెనక వాటిని సంహరించకూడదు. నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులు తరచుగా దాడులు నిర్వహించి ఆరోగ్యకరమైన వాతావరణం ప్రతిబిం బించే లా చూడాలి. మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోవడంలేదు.


కోళ్ల ఫారంలో చచ్చిన, కుళ్లిన కోళ్లు

బియ్యం లేవు..
డబ్బులిస్తాం

- మాఫియా అండతో డీలర్ల బరితెగింపు
- పర్యవేక్షణ కొరవడడంతో ధీమాగా అక్రమాలు

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'మా షాపునకు సంబంధించిన కార్డులు కావు.. బియ్యం ఇవ్వం.. కావాలంటే డబ్బులు ఇస్తాం.. ఇష్టమైతే వేలిముద్రలు వేయండి.. లేదంటే ఇంకో షాపునకు వెళ్లండి..' అంటూ నగర పరిధిలోని కొందరు రేషన్ షాపు డీలర్లు కార్డుదారులతో వ్యవహరిస్తున్న తీరిది. జేకేసీ కళాశాల రోడ్డు సమీపంలోని రేషన్ షాపునకు శనివారం బియ్యం కోసం వెళ్లిన కార్డుదారులకు ఎదురైన అనుభవమిది. అయితే ఇది ఆ ఒక్క షాపునకు మాత్రమే పరిమితమైన వ్యవహారం కాదు. ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు అనేకం వెల్లువెత్తుతున్నాయి. ఆ షాపు పరిసరాల్లోనే పలకలూరు రోడ్డు, స్వర్ణభారతినగర్ వంటి ప్రాంతాల్లో కూడా లబ్ధిదారులు ఇలాంటి అనుభవాలనే ఎదుర్కొంటున్నారు.



తారాస్థాయికి చేరిన బరితెగింపు..

జిల్లాలో ఎక్కడ రేషన్ బియ్యం అక్రమాలు వెలుగుచూసినా వాటి మూలాలు గుంటూరులోనే తేలుతున్నాయి. ఇంతలా రేషన్ మాఫియా జిల్లాలో విస్తరించింది. ఈ మాఫియా అండ రేషన్ డీలర్లు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. వారి ధీమా ఏ స్థాయికి చేరిందంటే ఏకంగా లబ్ధిదారు లకు బియ్యం ఇచ్చేది లేదు.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండన్నట్లుగా ఉంది. గుంటూరు కేంద్రంగా ఏర్పాటైన రేషన్ మాఫియా జిల్లా వ్యాప్తంగా ఉన్న షాపులను తన గుప్పెట్లో పెట్టుకుంది. ఎవరైనా ఎదురు తిరిగినా, ప్రశ్నించినా అధికారులకు సమాచారం ఇచ్చి, కేసులు పెట్టించి తమ మాట వినేలాగా చేసుకుంటున్నది. డీలర్లు.. రైస్‌మిల్లర్లతో సంబంధాలు పెట్టుకుని షాపుల నుంచి నేరుగా బియ్యాన్ని మిల్లులకు తరలించి, వాటిని రీసైక్లింగ్ చేసి సరిహద్దులు దాటిస్తున్నారు.

ప్రభుత్వాలే మారాయి.. దోపిడీ మారలేదు..

గత వైసీపీ ప్రభుత్వంలో మాఫియా సిండికేట్ ఏర్పాటైంది. ఎండీయూ వాహనాల ద్వారా కొద్దిమందికి బియ్యం ఇచ్చి, మిగిలినవాళ్లకు టోకరా ఇచ్చి ఆ బియ్యాన్ని ఆవే వాహనాలతో నేరుగా మిల్లులకు తరలించిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ తతంగాన్ని గమనించి ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. అయినా ఇప్పటికీ రేషన్ అక్రమాలు తగ్గలేదు. డీలర్లపై కేసులు రాకుండా చూసుకుంటూ, వారి ద్వారానే పేదల బియ్యం కొల్లగొట్టేలా చేస్తున్నారు. రేషన్ షాపునకు 4 టన్నుల బియ్యాన్ని ప్రతి నెలా ఇవ్వాల్సిందేనని మాఫియా హుకుం జారీ సేకరిస్తుంది. ఇలా ఇవ్వడానికి నిరాకరించిన డీలర్లను మాఫియా ముప్పతిప్పలు పెట్టిన ఘటనలు గుంటూరులో ఇటీవల వెలుగు చూశాయి. రేషన్ అక్రమాలకు మూలలపై ఆధారాలున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. నామమాత్రపు తనిఖీలతో సరిపుచ్చి చేతులు దులుపుకుంటున్నారు. పౌర సరఫరాలు, విజిలెన్స్ విభాగం అధికారులు స్పందించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

సమీక్షలు కాదు.. శ్రద్ధ కావాలి

- నిధులతో పాటు పనులు పరుగెత్తించాలి
- ప్రాజెక్టులతో మారనున్న జిల్లా రూపురేఖలు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా రూపురేఖలు మార్చేసే ప్రాజెక్టులపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సమీక్షలతో సరిపెట్టకుండా, పనులపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. ఆయా పనులు పూర్తి అయితే గుంటూరు అభివృద్ధి కళ్లకు కడు తుంది. అంతేకాకుండా ఇతర జిల్లాలను గుంటూరు వైపు తిప్పుకునేలా చేస్తాయి. దీనికి చేయాల్సిందల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రజాప్రతినిధులు నిధులు విడుదల చేయించాలి. వాటిని అధికారులు వేగవంతంగా సద్వినియోగం చేయాలి. అయితే ఇందుకోసం ముఖ్యంగా అధికారులు నిరంతరం శ్రద్ధ వహించాల్సిందే. ఒక అడుగు రెండు అడుగులు వెనక్కు అన్నట్లుగా కాకుండా బ్రేక్‌లు పడకుండా పనులను ముందుకు తీసుకెళ్లాలి.

సా..గుతున్న ఆర్‌వోబీ

గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీ నిర్మాణం ఐకానిక్ కట్టడంగా మారుతుంది. కేంద్రం నుంచి నిధులు విడుదలైనా ఆశించిన వేగవంతంగా పనులు జరగడం లేదు. కేవలం అటు మూడు, ఇటు పిల్లర్ల నిర్మాణమే పూర్తి అయింది. ఇప్పటివరకు రైల్వే భాగంలో ఉన్న వంతెన తొలగింపుపై ఎలాంటి స్పష్టత రాలేదు. ఇంకో వైపు ఆర్‌వోబీ నిర్మాణానికి సహకరించేందుకు ఇరువైపులా ఉన్న భవన యజమానులను అధికారులు ఒప్పించలేకపోయారు. కోర్టులో కేసులు పరిష్కారం కాలేదు. దీనిపై తరచుగా సంప్రదింపులు జరిపితే తప్ప కనీసం రెండేళ్లలో ఆర్‌వోబీ నిర్మాణం జరగదు.


జరుగుతున్న శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులు

పర్యాటకంగా..


తక్కెళ్లపాడు బైపాసు వద్ద ఎన్‌హెచ్-16 పక్క నే ఉన్న ఎన్‌టీఆర్ మానస సరోవరం పార్కు పర్యాటక ప్రాంతంగా విలసిల్లింది. అయితే వీజీటీఎం ఉడా నుంచి దాని నిర్వహణ నగరపాలక సంస్థకు మారినప్పటి నుంచి మసకబారిపో యింది. దీనిని మళ్లీ పర్యాటక ప్రదేశంగా అభి వృద్ధి చేసుకుంటే కోస్తా జిల్లాల నుంచి పర్యాట కులను ఆకర్షించవచ్చు. దీనికి సంబంధించి కా ర్పొరేషన్ డీపీఆర్ సిద్ధం చేయిస్తున్నది. నల్లపాడు చెరువును కూడా పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. ఇది కూడా ఇంకా డీపీఆర్ దశలోనే కొట్టుమిట్టాడుతున్నది.

సాంస్కృతిక వేదిక..

గుంటూరులోని బృందావన్‌గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయం వీధిలో దశాబ్దాల తరబడి నిర్మాణ దశలోనే నార్ల ఆడిటోరియం ఉంది. ఈ ఆడిటోరియంని సిద్ధం చేసుకుంటే హైదరాబాద్ రవీంద్ర భారతి వలే నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా తీర్చిదిద్దవచ్చు.

అసంపూర్ణంగా పనులు..

- గోరంట్ల తాగునీటి పథకం 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన 10 శాతం పనులు నిధుల కొరత వంటి కారణాలతో సంపూర్ణం కావడం లేదు.
- పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌ని నిర్మించారు. అప్పట్లో అంత పెద్ద మార్కెట్ విజయవాడలోనూ ఉండేది కాదు. నగరం నడిబొడ్డున మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎదురుగా విశాలమైన స్థలం ఈ మార్కెట్ సొంతం. అయితే దీని పునర్నిర్మాణాన్ని రెండు దశాబ్దాల క్రితమే ఆలోచన చేశారు తప్ప ఆచరణలో పెట్టలేదు. దీంతో పాటుగా జాలయ్య మార్కెట్‌ని కూడా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన ఉన్నది. అలానే కృష్ణనగర్ రైతుబజార్, గుంటూరు- నల్లపాడు రోడ్డులో మిర్చియార్డు వద్ద ఫ్లైవోవర్, పాతగుంటూరు నందివెలుగు రోడ్డు ఆర్‌వోబీ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా ఇన్నర్ రింగు రోడ్డు, పట్టాభిపురం, సంజీవయ్యనగర్ వద్ద ఆర్‌వోబీలు మంజూరయ్యాయి.


ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి
6

ఉపాధ్యాయులకూ.. ఆటలు

- 22 నుంచి డివిజన్ స్థాయిలో పోటీలు
- సన్నాహాలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ



గుంటూరు(విద్య), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించి వారిని ప్రోత్సహించి భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసేలా.. మరింత ఉత్సాహంగా బోధన చేసేలా.. శారీరక, మానసిక సామర్థ్యం పెరిగేలా.. ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ డైరె క్టర్ విజయరామరాజు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ పాఠశా లలో దాదాపు 18 వేల మందికిపైగా ఉపాధ్యా యులు పనిచేస్తున్నారు. విద్యారంగంలో విప్ల వాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటిం చిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కూడా అంత ర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేం దుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. క్రికెట్, త్రో బాల్, కబడ్డీ, క్యారమ్స్, షటిల్ తదితర పోటీలు తొలుత మండల స్థాయిలో నిర్వహించ నున్నారు. ఆ తర్వాత డివిజన్ స్థాయిలో నిర్వ హించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఈ బాధ్యతలను మండల స్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినే టర్స్‌కు అప్పగించారు. మండలస్థాయిలో ఎంఈ ఓ 1, 2 నిర్వహణ అధికారులుగా వ్యవహరి స్తారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈవో, జిల్లా స్థాయిలో డీఈవో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి సమన్వయకర్తలుగా ఉంటారు. రాష్ట్ర స్థాయిలో పోటీలకు స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, జేడీ స్థాయి అధికారి బాధ్యతలు తీసుకుంటారు. పోటీలకు తొలుత మండల స్థాయిలో జట్ల ఎంపికను చేస్తారు. ఉపాధ్యాయులకు సంబంధించి క్రికెట్ పోటీలకు సంబంధించి ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు, పాఠశాల సహాయకులు, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, పీఈటీలు, ఏడుగురు ఎస్జీటీల సహా మొత్తం 16 మందితో కమిటీ ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా త్రోబాల్ ఇతర క్రీడలకు ప్రత్యేకంగా జట్ల ఎంపిక నిర్వహిస్తారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డీఈఓ లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

షెడ్యూల్ ఇలా...

డివిజన్ స్థాయి : 22, 23 తేదీల్లో
జిల్లాస్థాయి :, 28, 29, 30 తేదీల్లో
రాష్ట్రస్థాయి : డిసెంబరు 6, 7, 13, 14

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు



కార్తీక దీపారాధనలు చేస్తున్న భక్తులు

పెదకాకాని, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆదివారం భక్తులతో పెదకాకాని మల్లన్న సన్నిధి కిటకిట లాడింది. తెల్లవారు జామున ఆలయ ప్రదక్షిణ నిర్వహించి, మల్లేశ్వర స్వామి, భ్రమరాంబకు ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేశారు. స్వామి వారి దర్శనం కోసం క్యూ లైన్లో భక్తులు బారులు తీరారు. ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పొంగలి తో ప్రదక్షిణ..

సత్క్రియల ద్వారానే మోక్షం

గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మానవాళి సత్క్రియల ద్వారానే దేవుడు మోక్షం కలుగు చేస్తాడని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని ఆర్‌సీఎం సమాధుల తోటలో సకల ఆత్మల పండుగ సమష్టి దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. ప్రార్థనలు, దివ్య పూజాబలులు ద్వారా ఆత్మలు మోక్షం చేసుకుంటాయన్నారు. జనుల జీవన విధానాలను బట్టి మోక్షమో, నరకమో నిర్ణయించ బడుతుందన్నారు. భక్తితో చేసే ప్రతి త్యాగం ఆత్మలకు ఉపయోగ పడుతుందన్నారు. ఆత్మలకు నిత్య విశ్రాంతి కలుగ చేయాలని, కుటుంబీకులంతా ప్రార్థించాలన్నారు. సమాధులను అలంకరించి పూలు, రంగు రంగుల విద్యుద్దీపాలు వెలిగించి సమాధులను తేజోవంతంగా తీర్చిదిద్దారు. తమ పెద్దల ఆత్మల విశ్రాంతి కోసం కుటుంబీకులు చేస్తున్న పూజలు ఏసు దేవుడు ఫలింప చేశారని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సమాధులను బిషప్ ఆశీర్వదించారు. పూజలో చర్చి ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి, మద్దు బాలస్వామి తదితర గురువులు, కన్యస్త్రీలు, గుడి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



సందేశమిస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ఆక్రమణలో.. ఆనవాళ్లు

(5వ పేజీ తరువాయి)

ఉండేది. ఆలయ నిర్వహణలో పాలుపంచుకునే వారిని కశ్మీర్, తమిళనాడు నుంచి విశ్వేశ్వరశంభు ప్రత్యేకంగా తీసుకొచ్చారు. ఇలా శివాలయం అప్పట్లో ఒక వెలుగు వెలిగింది. ఇది నేడు గర్భాలయం వరకే పరిమితమై కనిపిస్తున్నది.

ఆక్రమణల మధ్య ఆనవాళ్లు మాయం..

కాకతీయుల అనంతరం జరిగిన ముస్లీంల దాడుల నేపథ్యంలో గోళకీమఠం దెబ్బతింది. ఆలయ మండపాలతో పాటు గర్భగుడిలోని శివలింగాన్ని కూడా ధ్వంసం చేశారు. ఆ తర్వాత అగ్రహారంగా ఉన్న ఈ ప్రాంతమంతా కాలగతిలో ఆక్రమణల పాలైంది. ఆలయం, రుద్రమదేవి శిలాశాసనం కూడా కనిపించనంతగా గృహాలు పుట్టుకొచ్చాయి. ఆలయానికి దక్షిణంగా 20 సెంట్లు, పడమరగా 16 సెంట్లు మాత్రమే మిగిలి ఉంది. ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామస్థులు ప్రభుత్వానికి అర్జీల రూపంలో విన్నవించుకున్నారు. డాక్టర్ భవానీ అనే డాక్టర్ ఇటీవల ఈ ఆలయ చరిత్రను తెలుసుకుని తన బంధుమిత్రుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం చేస్తానని ముందుకొచ్చారు. అయితే ఆలయం చుట్టూ వున్న 33 గృహాలవారు అందుకు అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో ఆమె ఏమీ చేయలేక నిస్సహాయిరాలిగా ఉండిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2018లో ఈ ఆలయాన్ని సందర్శించారు. అయినా అభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మందడం-తుళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి ఉన్న రుద్రమదేవి నిర్మించిన చెరువు కూడా మూడువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి.

2011 నుంచే మళ్లీ పూజాదికాలు

గోళకీమఠం స్ఫూర్తితో విజయవాడకు చెందిన శివస్వామి మందడం శివారులోని కృష్ణానది వెంట తాళ్లాయపాలెంలో శైవక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. మల్కాపురంలో అరకొర గోడలతో సజీవశిలాజం మాదిరి మిగిలి ఉన్న గర్భగుడిలో 2011 చిన్న శివలింగాన్ని ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు జరిగేలా ఏర్పాటు చేశారు. ఇందుకు ఆలయం ఎదురుగా ఉన్న షేక్ అరుణ అనే మహిళ ఆర్థికసహకారాన్ని అందించారు. ములకల ఆదినారాయణ అనే పూజారి గత ఏడాదిగా స్వచ్ఛందంగా ఆలయంలో పూజాదికాలను నిర్వహిస్తున్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొని ఇద్దరి మృతి

వినుకొండటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీనీ ద్విచక్ర వాహనం వెనుక నుంచీ ఢీ కొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బిడ్జి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసు కుంది. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కురిచేడు సమీపంలోని మునెయ్య కాలనీకి చెందిన మన్నెయ్య (18), ఆనంద్ (14) ద్విచక్ర వాహనంపై వినుకొండ నుంచి కురిచేడు వైపు వస్తున్నారు. పసుపులేరు బ్రిడ్జి సమీపంలో జగ్గయ్య పేటకు చెందిన లారీ ఆపి డ్రైవర్ బహిర్భూమి వెళ్లాడు. ద్విక్రవాహనం వెనుక నుంచి లారీని ఢీ కొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని.. మృతదేహాలను వినుకొండ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలను గుండెల్లో నింపుకున్నారు

● కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

పెదకాకాని, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): డాకర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను దళితుల గుండెల్లో నింపుకున్నారని, వాటిని ప్రతి ఒక్కరు కొనసాగించాల్సిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం పెదకాకానిలోని లూథర్‌గిరి యువజన నగర్‌లో నందుమూరి టెక్ ఫౌండేషన్ అధినేత ఎర్రంరెడ్డి అనిల్‌రెడ్డి సహకారంతో నిర్మించబోతున్న కమ్యూనిటీ హాల్ భవనానికి స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. మమకారం తప్ప మోసం అంటే తెలియని అంబేడ్కర్ ఆశయాలను గుండెల్లో నింపుకున్న దళిత సోదర సోదరీమణులకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. ఎర్రంరెడ్డి అనిల్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు ఈ ప్రాంతంతో ఎలాంటి సంబంధం లేకపోయినా అమెరికాలో తనతో ఉన్న పరిచయంతో పేదలకు సహకారం అందించాలనే నిశ్చయంతో అనిల్‌రెడ్డి ముందుకు వచ్చారని తెలిపారు. సీఎస్ఆర్ నిధులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడ కమ్యూనిటీ హాల్ కావాలని ధూళిపాళ్లని అడిగితే ఆయన మొట్టమొదటిగా ఎంపిక చేసిన ప్రాంతం లూథర్‌గిరి, యువజన నగర్ ప్రాంతం అని తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ హాలు నిర్మాణంతో 15 ఏళ్ల నాటి కల నెరవేరిందన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో సహకారంతో ఈ నిర్మాణం చేపట్టడం గర్వకారణంగా ఉందన్నారు. ఎర్రం రెడ్డి అనిల్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, గ్రామ సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి, టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పొన్నూరు యార్డ్ వైస్ చైర్మన్ తాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెమ్మసాని, పక్కన ఎమ్మెల్యే నరేంద్ర తదితరులు

ముఖ్యమంత్రి హామీలు అమలు చేయాలి!

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'రాజధాని ప్రాంతంలో రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ఉన్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించగలగాలి.' అని గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కమిషనర్ కన్నబాబు, జాయింట్ కమిషనర్ భార్గవ తేజ సమావేశమయ్యారు. రాజధాని అంశాలపై, రాజధాని ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర మంత్రి వారితో చర్చించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్, వీధి పోటు, గ్రామకంఠం, అసైన్మెంట్ ల్యాండ్ భూసేకరణ, లేఅవుట్ డెవలప్మెంట్ సమస్యలపై జాబితాను సిద్ధం చేయాల్సి ఉందని మంత్రి సీఆర్డీఏ కమిషనర్‌కు చెప్పారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతుల సమస్యలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేయాలని తెలిపారు. అలాగే రాజధాని ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, ఉద్యోగుల క్వార్టర్స్, విదేశీ భవన్, హడ్కోకు సంబంధించిన పెండింగ్ అంశాలు ఏమైనా ఉంటే జాబితా ఇవ్వాలని, ఆయా అంశాలపై ఢిల్లీ నుంచి తాను ఫాలోఅప్ చేస్తానని ఈ సందర్భంగా పెమ్మసాని కమిషనర్‌తో చెప్పారు.

ప్రజల గుండెల్లో ఎర్రంనాయుడు చెరగని ముద్ర

తుళ్లూరు(మందడం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీమంత్రి, స్వర్గీయ కింజరాపు ఎర్రంనాయుడు ఒక విలక్షణ నేతగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని, ప్రజాభిమానం చూరగొన్నారని సీనియర్ జర్నలిస్టు, న్యాయవాది వి.ఆదినారాయణ, అమరావతి రాజధాని ఉద్యమ నేతలు పేర్కొన్నారు. ఆదివారం ఎర్రంనాయుడు 13వ వర్ధంతి సందర్భంగా తుళ్లూరు మండలం సచివాలయ సమీపం, మందడం అమరావతి ఉద్యమ శిబిరంలో ఆయనకు నివాళులర్పించారు. భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటవుట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ, రాజధాని ఉద్యమ నేతలు కట్టా రాజేంద్ర, వీరబాబు, బెజవాడ సాంబయ్య, పాతూరి రాంబాబు, బుల్లయ్య, గోవింద్‌రెడ్డి ప్రసంగిస్తూ తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీని ఎర్రంనాయుడు బలోపేతం చేశారన్నారు. అజాతశత్రువుగా, బడుగు, బలహీనవర్గాల నేతగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే, ఎంపీగా, కేంద్రమంత్రిగా, భారత రైల్వే బోర్డు చైర్మన్‌గా పని చేసి ఉత్తరాంధ్రతో పాటు ఉమ్మడి రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన బాటలో తనయుడు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, సోదరుడు అచ్చెన్నాయుడు పయనిస్తున్నారని పేర్కొన్నారు.



మందడంలో ఎర్రం నాయుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆదినారాయణ, రైతు ఉద్యమ నేతలు

మహాత్ముడిని విమర్శించిన సినీ నటులను కఠినంగా శిక్షించాలి

● ఉద్రిక్తంగా ఎన్ఎస్‌యూఐ ఆమరణ నిరాహార దీక్ష


గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీని విమర్శించిన సినీ నటులను శిక్షించాలంటూ గుంటూరులో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్రిక్తతకు దారి తీసింది. హిమనీ సెంటర్‌లో ఆదివారం ఆమరణ దీక్షకు కూర్చున్న నాయకులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో వారు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు నిలువరించారు. పోలీసుల, ఎన్ఎస్‌యూఐ నాయకుల మధ్య తోపులాటలతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనతో పోలీసులు కరీంతో పాటు ఎన్ఎస్‌యూఐ నాయకులను స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇటీవల కొరియో గ్రాఫర్ శ్రష్టివర్మ, సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగర్, నటుడు రాహుల్ రామకృష్ణ వంటి వారు మహాత్ముడితో పాటు స్వాతంత్య్ర సమర యోధులపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. మహాత్ములను అగౌరవ పరిచిన నీచులను చట్టప్రకారం కఠినంగా శిక్షించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఆందోళనకారులను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ రేపు రాక

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ మంగళవారం గుంటూరు జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటుందని చెప్పారు. అనంతరం రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలను సమీక్షిస్తుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలను సమీక్షిస్తుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 1,58,175 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా, డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ వెల్లడించారు.



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆదివారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.60 అడుగులు ఉంది. ఇది 310.84 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 , ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,232, మొత్తం ఔట్‌ఫ్లో 72,151 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 72,151 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.19 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 78,434 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, నాలుగు గేట్ల ద్వారా 94,6044, మొత్తం 1,11,604 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

0.667 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఒక యూనిట్ ద్వారా శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.667 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 4 గేట్లను 2 మీటర్లు,2 గేట్లను మీటర్ మేర ఎత్తి 48,244 క్యూసెక్కులు, టేల్ రేస్ చానల్ ద్వారా 4288 మొత్తంగా 52,532 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 65,600 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.09 మీటర్లమేర నీరుండగా 6.799 టీఎంసీలకు సమానమన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై మండలం లోని ఉప్పలపాడు వద్ద చోటుచేసుకుంది. ఉప్పలపాడు గ్రామానికి చెందిన కన్నెదార శ్రీనివాసరావు (55) మోటారుసైకిల్‌పై నరసరావుపేటకు వస్తుండగా.. వినుకొండ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతనిని ఢీకొంది. శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ ఫాతిమా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీ కొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తుమ్మలపాలెం పెప్సీ కంపెనీ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు వివరాల మేరకు.. మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన కుంభా కోటేశ్వరరావు (65) చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో ఉంటున్న తన కుమారుడి వద్ద ఉంటున్నాడు. శనివారం వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు కుమారుడు సింగుబాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్నాడు. జాతీయ రహదారిపై వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం వారిని వేగంగా ఢీ కొనడంతో.. వెనుక కూర్చున్న కోటేశ్వరరావు కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో.. 108 అంబులెన్సులో గుంటూరులోని ఓ హాస్పిటల్‌కు అతనిని తీసుకెళ్లారు. అనంతరం జీజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండవీడుకోట ఘాట్‌లో.. విరిగి పడిన కొండచరియలు

● ఘాట్ మార్గం మూసివేత



రాళ్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణప్రియ

యడ్లపాడు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ప్రముఖ పర్యాటక కేంద్రం కొండవీడు కోట ఘాట్ మార్గంలో కొండ చరియలు ఆదివారం విరిగి పడ్డాయి. దీంతో ఘాట్ మార్గాన్ని అధికారులు మూసివేశారు. రోడ్డుపై బండ రాళ్ల తొలగింపు పనులను అటవీశాఖ అధికారులు చేపట్టారు. జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణప్రియ ఈ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండలపై నుంచి ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీటితో పాటు బండరాళ్లు పెద్ద ఎత్తున ఘాట్ మార్గంపైకి జారిపడ్డాయన్నారు. బండరాళ్లను తొలగించే వరకు రాకపోకలను నిషేధించినట్లు వెల్లడించారు. ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా తీసుకున్న చర్యలను పర్యాటకులు అర్థం చేసుకోవాలని కోరారు. రాకపోకల పునరుద్ధరణను త్వరలో తెలియజేస్తామన్నారు. మరో రెండు రోజులు పర్యాటకులు కొండవీడుకోట సందర్శనకు రావద్దని డీఎఫ్‌వో తెలిపారు.

తెరుచుకున్న ఆలయ ద్వారాలు

ఎఫెక్ట్



అధికారుల సమక్షంలో తాళాలు తీస్తున్న పూజారి

చుండూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్నంగివారిపాలెంలోని తుంగభద్ర కాల్వ పక్కనే ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర పాపవినాశన స్వామి దేవాలయ పూజల విషయంలో వివాదం ఏర్పడింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో గుడివద్ద వివాదం - తెరుచుకోని ఆలయ ద్వారాలు అనే శీర్షికన ఆదివారం వెలువడిన కథనానికి జిల్లా దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. ఆ శాఖ కమిషనర్ కె.రామ చంద్రమోహన్, డీసీ కేబీ శ్రీనివాస్ ఆదేశాలతో బాపట్ల డీఈవో సూర్యప్రకాశ్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ నాగరాజు, ఆలయ ఈవో నాగలక్ష్మి ఇతర సిబ్బంది ఉదయాన్నే దేవాలయ ప్రాంగణానికి చేరుకుని భక్తులు, గ్రామస్థులు, స్థానిక నాయకులతో చర్చించారు. అనంతరం అధికారులు ట్రస్టీ పేరుతో వ్యవహరిస్తున్న గాదె బాలకోటిరెడ్డి నుంచి గుడి తాళాలు తీసుకుని.. భక్తులు యధావిధిగా పూజలు నిర్వహించడానికి అవకాశం కల్పించారు. దీనితో మహిళా భక్తులు కార్తీక మాసంలో దేవాలయంలో పూజలకు అవకాశం లభించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

అరకు, యల్హాంకకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా గుంటూరు మీదగా అరకు, యల్హాంకకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 08551 అరకు - యల్హాంక స్పెషల్ ఈ నెల 13, 23 తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. 08552 యల్హాంక - అరకు స్పెషల్ ఈ నెల 14, 24 తేదీల్లో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2 గంటలకు గుంటూరుకు వస్తుందని పేర్కొన్నారు. 08553 శ్రీకాకుళం రోడ్డు - బెంగళూరు కంటోన్మెంట్ ప్రత్యేక రైలు 21న, 08554 బెంగళూరు కంటోన్మెంట్ - శ్రీకాకుళం రోడ్డు స్పెషల్ 24న గుంటూరు మీదగా నడపనున్నారు. అయితే డివిజనల్ హెడ్‌క్వార్టర్స్ గుంటూరులో హాల్టింగ్ ఇవ్వకుండా నంద్యాలలో కల్పించడంపై ప్రయాణికులు, వినియోగదారుల సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వాల్తేరు డివిజన్ హెడ్‌క్వార్టర్స్ దృష్టికి తీసుకెళతామన్నారు.

కోడి పందేలు, పేకాట స్థావరాలపై దాడులు

నాదెండ్ల, క్రోసూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ఆదివారం జూదరుల ఆటకట్టించారు. కోడిపందేలు, పేకాట స్థావరాలపై దాడులు చేశారు. నాదెండ్ల మండలంలోని ఎండుగుంపాలెం - కోమటినేనివారిపాలెం వెళ్లే మార్గంలోని కోడి పందేల స్థావరంపై ఎస్ఐ పుల్లారావు సిబ్బందితో దాడి చేశారు. వారిని చూసి కొందరు పారిపోగా 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. 26 మోటారు బైక్‌లు, రూ.19,400 నగదు, సెల్‌ఫోన్లతో పాటు నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. క్రోసూరు మండలంలోని బయ్యవరం పొలాల్లో పేకాట స్థావరాలపై దాడి చేసినట్లు ఎస్ఐ రవిబాబు తెలిపారు. ఏడుగుర్ని అరెస్టు చేసి రూ.79,650 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

గుంటూరు సిటీ వార్తలు

● గుంటూరు తూర్పు ● పశ్చిమ



మోహనకృష్ణ, ప్రత్యూషలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

శ్రీ గీతా కంటి ఆసుపత్రి ప్రారంభం

గుంటూరు మెడికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెట్రో నగరాలకు దీటుగా గుంటూరులో నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వైద్య పరికరాలతో చక్కటి కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. లక్ష్మీపురంలో నల్లై ఏళ్లుగా ఉత్తమ కంటి వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ పి.నరసింహారావు ఆధ్వర్యంలో హరిహరమహల్ రోడ్డులో నూతనంగా ఐదంతస్తుల భవంతిలో అత్యాధునికంగా శ్రీ గీతా కంటి ఆసుపత్రిని ఆదివారం ప్రారంభించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు హాజరై ఆసుపత్రిలో పలు విభాగాలను ప్రారంభించారు. ఆసుపత్రి అధినేతలు డాక్టర్ నరసింహారావు, ఆయన కుమారుడు, కోడలు డాక్టర్ పి.మోహనకృష్ణ, డాక్టర్ బి.ప్రత్యూషను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహనకృష్ణ, డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ శుక్లాల ఆపరేషన్‌లతో పాటు కంటి నరాలు, రెటీనా సంబంధిత ఆపరేషన్లు, నీటి కాసులు వంటి జబ్బులకు ఉత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నట్టు తెలిపారు. నల్ల గుడ్డు, మెల్లకన్ను, కంటి గడ్డలు, కంటి కేన్సర్‌కు సంబంధించిన ఉత్తమ వైద్య సేవలు తమ గీతా ఆసుపత్రిలో లభిస్తాయని వెల్లడించారు.

ఆయుర్వేద వైద్య చికిత్సలతో అద్భుత ఫలితాలు

గుంటూరు(మెడికల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన భారతీయ వైద్య విధాన మైన ఆయుర్వేదంతో పలు రకాల దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలకు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ చైర్మన్, కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం జరిగిన ఎముకల పటుత్వ పరీక్షల ఉచిత వైద్యశిబిరంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లావాసులు పంచకర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేదని, గుంటూరులోని తమ వైద్యశాలలోనే ఆ వైద్య చికిత్సలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. అనంతరం జరిగిన వైద్య శిబిరంలో 130 మంది రోగులకు ఒక్కొక్కటి రూ.2 వేలు విలువైన ఎముకల పటుత్వ (బీఎండీ) పరీక్షలు జరిపారు. బీపీ, షుగర్, కీళ్లనొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటికా, పక్షవాతం, మోకీళ్ల అరుగుదల, ఆస్మా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మ సమస్యలు, ఫైల్స్ బాధితులకు వైద్య పరీక్షలు ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు డాక్టర్ రాహుల్ చంద్ర, డాక్టర్ మోనిక, డాక్టర్ లోకేష్, మేనేజర్ మల్లీశ్వరి, గుహిక్ హెల్త్ కేర్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



నాడీ పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

బీసీల రిజర్వేషన్లపై ప్రభుత్వ హామీ సముచితం

● మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్

గుంటూరు (తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ సముచితమైందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అభిప్రాయపడ్డారు. అరండల్‌పేటలో ఆదివారం అఖిలభారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అధ్యక్షతన బీసీల రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ, బీసీల రాజ్యాంగబద్ధమైన న్యాయబద్ధమైన డిమాండును ముఖ్యమంత్రి చంద్రబాబు సరైన మార్గంలో పరిష్కారం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, సామాజిక రక్షణ చట్టాన్ని అమలు చేసేందుకు అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ ఏపనగండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ, 63 వేల బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, కెనరా బ్యాంక్ ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సి.బాలకృష్ణ, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు ప్రేమ రాజు, రాజపుత్ర సత్యం సింగ్, కొనిదే గోపికృష్ణ, పెరుమాళ్ళ పద్మజ, సుజాన్ సింగ్, పేరయ్య, ఉన్నవ సుబ్బారావు, ఏడుకొండలు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాదు, వేదికపై అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ తదితరులు

కార్పొరేషన్‌లో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పలువురు అధికారులను అంతర్గతంగా బదిలీలు చేస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మేనేజర్‌గా ఉన్న బాలాజీ బాషను టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. కమిషనర్ చాంబర్‌లో ఉన్న ఎస్ ఎన్ ప్రసాద్‌ను అకౌంటెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అకౌంటెంట్‌గా ఉన్న నమ్రత్ కుమార్‌ను మేనేజర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు మృతి తీరని లోటు

● ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్



నివాళులర్పిస్తున్న డాక్టర్ నందకిషోర్, డాక్టర్ సేవకుమార్, కన్నా మాస్టారు తదితరులు

గుంటూరు మెడికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐఎంఏ గుంటూరు శాఖ సభ్యుడు, సీనియర్ వైద్యుడు డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు మృతి పేద, మధ్య తరగతి ప్రజలకు తీరని లోటని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ తెలిపారు. ఆదివారం డొంకరోడ్డులోని ఆయన నివాసంలో డాక్టర్ కోటేశ్వరరావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. డాక్టర్ కోటేశ్వరరావు ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా నగరంలో కల్యాణమండపం, బాలికల, బాలుర హాస్టల్ భవన నిర్మాణాలను ప్రారంభించినట్లు తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఐఎంఏ గుంటూ రు శాఖ కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ, ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ డి.అమరలింగేశ్వరరావు, ఎస్‌హెచ్‌వో వైద్యులు డాక్టర్ ఆర్ నాగేశ్వరరావు, కన్నా మాస్టారు ఉన్నారు.

ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి

● కేంద్ర మంత్రి పెమ్మసాని



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, సతీష్‌శర్మ తదితరులు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో డిసెంబరు 13న గుంటూరు హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జరగనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆదివారం గుంటూరు క్యాంపు కార్యాలయంలో పెమ్మసాని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బ్రాహ్మణ నిరుద్యోగులకు మంచి అవకాశాలు వస్తున్నాయని, ఈ జాబ్ మేళాను ప్రతి ఒక్కరూ వినియోగించుకొని ఉపాధి పొందాలని సూచించారు. ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కోనూరు సతీష్‌శర్మ మాట్లాడుతూ, జాబ్ మేళాలో పలు ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకరమంచి లలిత శాస్త్రీ జాబ్ మేళా కమిటీ సభ్యుడు కొప్పర్తి సీతారమేష్, మాటేటి నాగరాజు తదితరులున్నారు.



మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణను సత్కరిస్తున్న ఎయిడెడ్ ఉపాధ్యాయులు

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ

గుంటూరు (విద్య) నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నిషియస్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో డాక్టర్ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయుల, సిబ్బంది హెల్త్ కార్డుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఎయిడెడ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా వీఎల్ బాలశౌరి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాయం వరప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఏకా సాయికుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎస్‌కే యజధానీ బాష ఎన్నికయ్యారు.

కామన్ సర్వీస్ రూల్స్ ఉద్యమానికి సన్నద్ధం కావాలి

● హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు

గుంటూరు(విద్య), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్న కామన్ సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించుకునేందుకు ఉద్యమానికి సిద్ధం కావాలని ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఆవుల తిరుమలేష్ అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయపోరాటానికి అందరూ సమాయత్తం కావాలని కోరారు. పదో తరగతి నామినల్ రోల్స్ రూపకల్పన సంబంధిత విషయాలపై సాంకేతిక సమస్యలు, పరిష్కారాలు, అపార్ ఐడీ ఏర్పాటుపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర వజ్రోత్సవాలను రాజధాని పరిసర ప్రాంతాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లకు సన్నాహకాలు చేస్తున్నారు.



గుత్తా శ్రీనివాసరావును సన్మానిస్తున్న సంఘం నాయకులు తిరుమలేష్ తదితరులు

బ్రాహ్మణుల అభ్యున్నతికి సేవాసమితి కృషి చేయాలి

● కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

గుంటూరు(విద్య), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ అభ్యున్నతికి బ్రాహ్మణ ఉద్యో గ ఉపాధ్యాయ సంక్షేమ సేవాసమితి కృషి చేయాలని బ్రాహ్మణ ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బుచ్చిరాం ప్రసాద్ అన్నారు. ఆదివారం ఏటీ అగ్రహారంలోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్లో బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక సమారాధనలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు పార్థసారథి జంగాలపల్లి అధ్యక్షత వహించారు. బుచ్చి రాంప్రసాద్ మాట్లా డుతూ సమితి ఉద్యోగుల ఉపాధ్యాయుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ సమితి సభ్యులు టి.శివన్నారాయణ, మల్లికార్జునశర్మ, ఈవీ శ్రీనివాస్, జి.వేణుగోపాలరావు. అరుణ్‌కుమార్, గౌరీనాథ్, కమల్ మోహన్, హరగోపాల్, ఏపీ ఎన్జీవో నాయకులు నరసింహమూర్తి, సీతారమేష్ కె.రాధాకృష్ణమూర్తి, శ్రీధర్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

మధుమేహ నిరోధం మన చేతుల్లోనే

● ఎండోక్రైనాలజిస్ట్ వీబీ కాశ్యప జన్నాభట్ల

గుంటూరు (మెడి కల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మధు మేహ వ్యాధి నిరోధం చాలా వరకు మన చేతుల్లోనే, చేతుల్లోనే ఉందని ఎండోక్రైనాల జిస్ట్ డాక్టర్ వీబీ కాశ్యప జన్నాభట్ల తెలిపారు. మధుమేహ నిరోధక మాసం సందర్భంగా బ్రాడీపేట 2/1లోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన మధుమేహ శాస్త్రీయ అవగాహన సభ, ఉచిత వైద్య సలహా శిబిరంలో ఆయన ప్రసంగించారు. మధుమేహ రోగుల్లో తొలినాళ్లల్లో వ్యాధి లక్షణాలు బయటపడవని, ఆ తర్వాత కూడా రోగులు దీనిని నిర్లక్ష్యం చేస్తుంటారని డాక్టర్ కాశ్యప తెలిపారు. 40 ఏళ్ల దాటిన వారు ఏటా ఒకసారి మధుమేహ పరీక్షలు చేయిం చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ టీ సేవకుమార్, మేనేజర్ పి.నిర్మల రాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి, చైర్మన్ పావులూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష రుద్రాక్షల అభిషేకం పూజ

గుంటూరు (తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్‌లోని మారుతీ దేవాలయ ప్రాంగణంలో లక్ష రుద్రాక్షల పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాస మహోత్సవంలో భాగంగా గౌరీ శంకర స్వామికి 11 మంది రుత్వికులు మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు జరిపారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

బిలియర్డ్స్‌లో సెమీ ఫైనల్స్‌కు ఎల్వీఆర్ క్రీడాకారులు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ఆవరణలో జరుగుతున్న ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పోటీల్లో ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ క్రీడాకారులు ఎస్.శంకర్రావు, ఎం.శ్రీనివాసరావు బిలియర్డ్స్ విభాగంలో సెమీఫైనల్‌కు చేరారు. శ్రీనివాసరావు, వి.సుశీల్‌పై 3-1 స్కోర్‌తో, శంకర్రావు, సాగర్ జాన్‌పై 3-0 స్కోర్‌తో గెలుపొందారని పోటీల నిర్వాహక కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్) తెలిపారు. అలాగే స్నూకర్‌లో అఖిల్, సోమేశ్వరావుపై 3-0 తేడాతో, ఎస్.శంకర్రావు, చంద్రశేఖర్‌పై 3-0 తేడాతో శివశర్మ, డి.శ్రీనివాస్‌పై 3-1 తేడాతో, కల్యాణ్ వర్మ, నాగరాజుపై 3-1 తేడాతో, సుశీల్, అనంత్‌పై 3-0 తేడాతో, స్వామి, ముస్తఫాపై 3-2 తేడాతో, యోగి, షకూర్‌పై 3-1 తేడాతో, చంద్రకాంత్, శరత్‌పై 3-2 తేడాతో, సాగర్, జాఫర్‌పై 3-1 తేడాతో, సాగర్ జైన్, శరత్ చంద్రపై 3-1 స్కోర్ తేడాతో గెలుపొందారని అజార్ తెలియజేశారు.



బిలియర్డ్స్‌లో తలపడుతున్న ఎల్వీఆర్ క్రీడాకారులు

మహిళా క్రికెట్ జట్టు విజయం కోసం ప్రత్యేక పూజలు

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముంబైలో భారత్- దక్షిణాఫ్రికా మధ్య జరుగు తున్న మహిళల వన్‌డే క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ విజయం సాధించాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు. ఆమె భారత్ గెలుపు కోసం ప్రత్యేక పూజలు చేయాలని టీడీపీ మహిళా నేతలకు పిలుపునిచ్చారు. ఆమె పిలుపునందుకున్న తెలుగు మహిళలు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎన్డీయే కూటమి మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గుంటూరు (తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ కళాశాల ప్రాంగణం ఏకాదండయ్య పంతులు హాల్లో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శన, మ్యాజిక్ షో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రాధా మాధవ రసరంజని 322వ నెల నెలా వెన్నెల కార్యక్రమం సందర్భంగా ఈ ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత డాక్టర్ మనోజ్.. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాధా మాధవ నాట్యక్షేత్రం, పంచమ వేద స్కూల్ ఆఫ్ డాన్స్ విద్యార్థులు పలు కీర్తనలకు కూచిపూడి, జానపద నృత్యాల్ని ప్రదర్శించి అలరించారు. ఈ నృత్యానికి వేణుగోపాలరావు నృత్య దర్శకత్వం వహించారు. అనంతరం అద్దంకి నాగరాజు మాయాజాల ప్రదర్శన ప్రేక్షకులను కట్టిపడేసింది. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య షేక్ ఖలీల్ పర్యవేక్షించారు.

రైతుల జాబితాలో అవకతవకలు

గుంటూరు (తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ ఆరోపించారు. స్థానిక బ్రాడీపేట, పీఎల్ రావు భవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితా తయారు చేసేందుకు కనీసం పది రోజుల వ్యవధి ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హుల జాబితాను తయారు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బిక్కి శ్రీనివాసరావు, తలసీల సుధాకర్ పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు : ఎస్పీ

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మద్యపానం చేసినా, రాత్రివేళల్లో అనవసరంగా రోడ్లపై తిరిగినా చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. శనివారం ఒక్కరోజే 477 కేసులు నమోదు చేశామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం రాత్రి జిల్లావ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న, ప్రజా శాంతికి భంగం కలిగించే వారిని పట్టుకొని కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. తమ ప్రాంతాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

యువకుడి ఆత్మహత్య

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నగరాలులోని హిమనీనగర్ నాలుగో లైన్‌కు చెందిన వెలుగొండ శంకర్రావు, లక్ష్మిల దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు మహేష్‌బాబు ఉన్నారు. కూతురుకు వివాహం జరగ్గా, కుమారుడు కూలి పనులకు వెళుతున్నాడు. తండ్రి శంకర్రావు కొరిటిపాడు పరిధిలోని నాయుడుపేటలో సున్నం పనికి వెళుతున్నాడు. ఇదిలా ఉంటే శనివారం మధ్యాహ్నం కుమారుడు మహేష్ బాబు తండ్రి పనిచేసే కొరిటెపాడు వెళ్లి తనకు లక్షన్నర అప్పులు ఉన్నాయని ఇంటి స్థలంపై లోన్ తీసుకుని అప్పులు తీరుద్దామని తండ్రిని అడిగాడు. అయితే ఆలోచించి నిర్ణయం తీసుకుందామని తండ్రి చెప్పడంతో అక్కడి నుంచి నేరుగా ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత తన అక్కకు పిల్లలు జాగ్రత్త అంటూ మెసేజ్ పెట్టడంతో కంగారు పడిన తల్లి భర్తకు ఫోన్ చేయడంతో శంకర్రావు ఇంటికి వెళ్లి చూడగా ఇంటి లోపల గడి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే మహేష్‌బాబును జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందిన ట్లు వైద్యులు తెలిపారు. తండ్రి శంకర్రావు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తుల మృతి

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందగా కొత్తపేట పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరిచారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్‌స్టేషన్ 08632221815కు గానీ లేదా సీఐ వీరయ్య చౌదరి 8688831320 నెంబరుకు గానీ సంప్రదించాలన్నారు.

● జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని 55 ఏళ్ల మరో వ్యక్తి మృతి చెందాడు. గత నెల 28న ప్రభుత్వ మహిళా కళాశాల ఎదుట డివైడర్ మీద అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికుల సమాచారంతో పోలీసులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్‌స్టేషన్‌కు సంప్రదించాలన్నారు.



టీడీపీ 9వ డివిజన్ కమిటీతో ఎమ్మెల్యే నసీర్

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయండి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం టీడీపీ 9వ డివిజన్ కమిటీని ప్రకటించారు. చిన్నంశెట్టి నరసింహానాయుడిని 9వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడిగా నసీర్ ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ, కూటమి నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే నసీర్ సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లవుల అశోక్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

జోగి రమేశ్ అరెస్టును స్వాగతిస్తున్నాం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం మాఫియాలతో చేతులు కలిపి అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టును స్వాగతిస్తున్నామని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు హాని కలిగించే ఇటువంటి అరాచక శక్తులకు శిక్ష పడినప్పుడే న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. రాజకీయం పేరుతో చెలరేగిన వైసీపీ అరాచక శక్తులపై ఇది తొలి దెబ్బ అని వ్యాఖ్యానించారు. తప్పులు చేసి దొరికిపోయిన దొంగలు తప్పించుకునేందుకు కులాన్ని అడ్డం పెట్టుకుంటున్నారని, బడుగు బలహీన వర్గాలు కూడా జోగి రమేశ్ అరెస్టును సమర్థిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రత విషయంలో కూటమి ప్రభుత్వానిది రాజీలేని వైఖరని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తేల్చిచెప్పారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

● జన చైతన్య గ్రూప్ అధినేత మాదల చైతన్య



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైతన్య

గుంటూరు (క్రీడలు) నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, తద్వారా యువత ఆరోగ్యంగా ఉంటారని జన చైతన్య గ్రూపు అధినేత మాదల చైతన్య అన్నారు. తన తల్లి మాదల జయశ్రీ పేరుతో నిర్వహిస్తున్న మాదల జయశ్రీ మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సీనియర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం పోలీస్ పరేడ్ మైదానంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఓటమి గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీలలో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. టోర్నమెంట్‌లో గుంటూరు, కృష్ణ జిల్లాల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, పోలీస్ డిపార్ట్మెంట్, ప్రైవేట్ ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొంటున్నారని తెలిపారు. టోర్నమెంట్‌లో 12 క్రికెట్ జట్లు తలపడుతున్నాయని, మ్యాచ్‌లు విరామం రోజులైనా శని, ఆదివారాలలో రెండు నెలలపాటు జరుగుతాయని చెప్పారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని, టాస్ వేసి లాంఛనంగా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కృష్ణ, గుంటూరు జట్ల క్రీడాకారులతోపాటు అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పరుచూరి రాజేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న పరుచూరి రాజేంద్ర

గుంటూరు(తూర్పు), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుపర చాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరచూరి రాజేంద్ర డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి, ఇతర హామీలను అమలు చేయాలని కోరుతూ ఆదివారం కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నారా లోకేశ్ హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ గా ఉన్న రెండు లక్షల 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ప్రకటించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు వలీ, జంగాల చైతన్యలు ప్రసంగించారు. ఈ సమావేశంలో కృష్ణకాంత్, బుజ్జి, శివాజీ, జగన్నాధం, శ్రీను, మరియ దాసు, నవీన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి

● విశాఖ కోఆపరేటివ్ డైరెక్టర్ మల్లికార్జునరావు



మాట్లాడుతున్న పీవీ మల్లికార్జునరావు, వేదికపై కో-ఆపరేటివ్ బ్యాంకు డైరక్టర్లు

గుంటూరు (తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థను పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలని, అప్పుడే మధ్యతరగతి ప్రజలు, రైతులు మనుగడ సాధ్యమవుతుందని విశాఖపట్నం కోఆపరేటివ్ డైరెక్టర్ పీవీ మల్లికార్జునరావు అన్నారు. స్థానిక కొరిటెపాడులో ఆదివారం సహకార సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి ఈ ఏడాదిని అంతర్జాతీయ సహకార ఏడాదిగా ప్రకటించిందని తెలిపారు. డైరెక్టర్లు సీహెచ్ రామారావు, చిన్నం కోటేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 46 సహకార బ్యాంకులు ఉన్నాయని, వాటి ద్వారా ప్రజలకు సేవలు అందుతున్నాయని చెప్పారు. ఒక్కరి కోసం అందరూ, అందరి కోసం ఒక్కరూ అనే ప్రాథమిక సూత్రంతో సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఎర్రయ్య, బుల్లికుమార్, కమిటీ సభ్యులు కోటా మాల్యాద్రి, వెంకట్రామయ్య, సుజాత, అనిల్, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సిబ్బందికి వైద్య సేవలు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికు లకు సంచార వైద్య సేవలను ఆదివారం అందించారు. గుం టూరు నుంచి గిద్దలూరు వరకు వివిధ రైల్వేస్టేషన్లలో హెల్త్ రైలుని ఆపి కార్మికు లకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి, ఔషధాలు అంద జేశారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేశారు. మొత్తం 103 మంది ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించుకొన్నట్లు రైల్వే ప్రజా సంబంధాల అధికారి వినయ్‌కాంత్ తెలిపారు. డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఆదేశాలతో ప్రతి నెల గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని వివిధ మార్గాల్లో కార్మికులకు ఈ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.ప్రకాష్, పారామెడికల్ సిబ్బంది లలిత పాల్గొన్నారు.

దిక్సూచి

క్యాట్ ఫైనల్ ప్రిపరేషన్

వేగం, కచ్చితత్వం ప్రధానం



ఐఐఎం సహా పేరొందిన మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్ష క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్). ఈ టెస్ట్‌లో సాధించిన పర్సంటైల్‌తో నేరుగా ప్రవేశం లభించదు. అయితే ఆ కాలేజీలు అడ్మిషన్‌కు సంబంధించి పరిగణనలోకి తీసుకునే ప్రాతిపదికల్లో మొదటిది మాత్రం క్యాట్ పర్సంటైల్. తొలిసారి ఈ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒకవైపు ఫైనలియర్‌లో చివరి అంకమైన ప్రాజెక్ట్ వర్క్ పనిలో ఉంటారు. మరోపక్క గేట్, క్యాట్ వంటి ప్రవేశ పరీక్షలు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టెస్టుల బిజీలోనూ ఉంటారు. వీటిలో క్యాట్‌కు పట్టుమని నెల రోజుల గడువు కూడా లేదు. ఈ నేపథ్యంలో క్యాట్ తొలిసారి రాస్తున్నవారికి తోడు ఒకింత అవగాహనతో ముందుకు సాగుతున్న వారి వరకు అభ్యర్థులంతా టెస్ట్‌కు సమర్థంగా సన్నద్ధం కావచ్చు. అందుకు ప్రధానంగా... క్యాట్‌లో అడిగిన అన్ని ప్రశ్నలూ సాల్వ్ చేయాల్సిన అవసరం లేదు. 40 నుంచి 50 శాతం ప్రశ్నలను సాల్వ్ చేయగలిగితే చాలు, మంచి స్కోర్ సాధించవచ్చన్నది నిపుణుల సూచన. క్యాట్‌లో ప్రధానంగా మూడు విభాగాలు - వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ), డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(క్యుఎ) ఉంటాయి. ఒక్కో విభాగానికి సంబంధించి ప్రిపరేషన్ ఇలా ఉండేలా చూసుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (క్యుఎ)

- ఈ విభాగంలో వేగం అంతకు మించి కచ్చితత్వం ప్రధానం. ఆ రెంటికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మంచి స్కోర్ సాధించాలి.
- అర్థమెటిక్, ఆల్జీబ్రా, జామెట్రీ, మోడ్రన్ మేథ్స్‌లోని కాన్సెప్ట్‌లను రివైజ్ చేసుకోవాలి. కాన్సెప్ట్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.
- ఈ విభాగం సెక్షనల్ మాక్ టెస్టులను వారానికి రెండు లేదా మూడు చొప్పున చేయాలి.
- అన్ని టాపిక్స్‌లో కలిపి ప్రతి రోజూ 30 నుంచి 40 ప్రశ్నలను సాల్వ్ చేయాలి.
- త్వరితగతిని గుర్తుకు తెచ్చుకునేందుకు వీలుగా ఫార్ములా నోట్ బుక్‌ను మెయింటైన్ చేయాలి.
- గతం నిర్వహించిన ప్రశ్నపత్రాల్లో తరచూ అడుగుతున్న ప్రశ్నలను పదేపదే సాల్వ్ చేస్తుండాలి.

డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్)

- రోజుకు కనీసం రెండు, మూడు సెక్షనల్ మాక్ టెస్టులను చేయాలి. ప్రతి సారి సాల్వ్ చేయడంలో కష్ట స్థాయిని పెంచుకుంటూ వెళ్లాలి.
- డేటా టేబుల్స్, లాజికల్ పజిల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి సెట్‌కు టైమ్ సెట్ చేసుకోవాలి. అలా సాల్వింగ్ కోసం పట్టే సమాయాన్ని తగ్గించుకోవాలి.
- ప్రతి మాక్ టెస్టులో దొర్లే తప్పులను విశ్లేషించుకోవాలి. సాల్వింగ్ నుంచి ఆలోచన, తుది నిర్ణయం వరకు ప్రతి చోట సాధారణంగా ఎదురవుతున్న తప్పులను ఒక దగ్గర నోట్ చేసుకోవాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- చివరి వారానికల్లా పది, పదిహేను నిమిషాల్లో ప్రతి సెట్‌ను పూర్తి చేయగలగడం అన్నది లక్ష్యంగా పెట్టుకోవాలి. అదే సమయం 80 నుంచి 90 శాతం మేర కచ్చితత్వాన్నీ సాధించాలి.

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ)

- రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడంలో సరైన పాటవానికి తోడు నిలకడ సాధించాలి.
- రోజుకు కనీసం మూడు రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడాన్ని అలవాటు చేసుకోవాలి.
- పారా జంబుల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- మాక్ టెస్టుల్లో అటు ఆ పరీక్ష, ఇటు వ్యక్తిగత ప్రతిభను సునిశితంగా విశ్లేషించుకోవాలి.

రైల్వేలో మెగా రిక్రూట్‌మెంట్

భారతీయ రైల్వే వివిధ పోస్టులకు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలు ఉన్నాయి. వివిధ అర్హతలకు తోడు నిర్దేశిత ఎంపిక ప్రకియ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. సంక్షిప్తంగా ఆ వివరాలు దిగువ ఇస్తున్నాం.



నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (అండర్ గ్రాడ్యుయేట్)

ఖాళీలు 3058

- కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్: **2424**
- అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **394**
- జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **163**
- ట్రైనీ క్లర్క్: **77**

అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 27

నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్)

ఖాళీలు 5810

- కమర్షియల్ కమ్ టికెట్ సూపర్వైజర్: **161**
- స్టేషన్ మాస్టర్: **615**
- గూడ్స్ రైలు మేనేజర్: **3416**
- జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: **921**
- సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **638**
- ట్రాఫిక్ అసిస్టెంట్: **59**

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు ఇంగ్లీష్/హిందీ టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్(టైర్ 1, టైర్ 2)కు తోడు టైపింగ్ స్కిల్‌టెస్ట్/కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

ఇంకొన్ని

ఖాళీలు 2569

జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకూ నోటిఫికేషన్ విడుదలైంది.
అర్హత: పోస్టును బట్టి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా/ బీఎస్సీ డిగ్రీ పాసై ఉండాలి.
ఎంపిక: రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, రైల్వే మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

డిజైనింగ్ @ ఎన్ఐడి



దుస్తులు, పాదరక్షలు, వాచీ, హ్యాండ్‌బ్యాగ్ సహా ఏదైనా సరే, ఒక వస్తువుకు ఉండాల్సిన సాధారణ లక్షణాలు దెబ్బతినకుండా అందంగా, ఆధునికంగా మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దడాన్నే డిజైనింగ్ అంటాం. ఈ అంశానికి సంబంధించి మన దేశంలో అత్యున్నత శిక్షణ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి) అహ్మదాబాద్. దానికితోడు గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్ ఏర్పాటు చేశారు. తరవాతి రోజుల్లో విజయవాడ (ఆంధ్రప్రదేశ్), కురుక్షేత్ర(హర్యానా), భోపాల్(మధ్యప్రదేశ్), జోర్హాట్(రాజస్థాన్)లలో కూడా ఎన్ఐడి దేనికదిగా ఏర్పాటై గ్రాడ్యుయేట్ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. వీటన్నింటికి కలిపి అడ్మిషన్లకు ప్రకటన విడుదలైంది.

కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి). డిజైన్ ఎడ్యుకేషన్, సంబంధిత పరిశోధనలో గ్లోబల్ లీడర్‌గా అవతరించాలన్నది ఎన్ఐడి లక్ష్యం. విభిన్న డొమైన్లు ఇక్కడ ఉన్నాయి. కోర్సు పూర్తయ్యేనాటికి సంబంధిత పరిశ్రమలో ఇమిడిపోయే వ్యక్తిగా విద్యార్థిని తీర్చిదిద్దుతారు.

బీ డిజైన్ సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 128 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కో దానిలో 75 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2005 జూలై 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్ - పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో అడుగుతారు. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు.

ఎం డిజైన్
ఎన్ఐడి, అహ్మదాబాద్ క్యాంపస్ గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్‌లో మాత్రమే ఎం డిజైన్ కోర్సును అందిస్తున్నారు. మొత్తం 14 డిసిప్లిన్లలో దీనిని అందిస్తున్నారు. వివరాలకు సంబంధిత బ్రోచర్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.3,000; మహిళలు రూ.2000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500, దివ్యాంగులు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 1
- **డీఏటీ ప్రిలిమ్స్ తేదీ:** డిసెంబర్ 21
- **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

SCHOLARSHIP ALERT

Colgate Keep India Smiling Scholarship 2025-26

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.
Eligibility: Indian students who are currently enrolled in Bachelor of Dental Surgery (BDS) (any year) or Master of Dental Surgery (MDS) courses in a recognised government or private institute. Applicants must have scored at least 65% marks in Class 12. Students must have an overall score of above 60% in their BDS to apply for the MDS scholarship. The annual family income of the applicants from all sources must not exceed INR 8 lakh.
Prizes & Rewards: Scholarship of INR 75,000
Last Date to Apply: 09-11-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CKISSP7
buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★




దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను

సుధీర్‌బాబు


"జటాధర' చిత్రంలో నేను పోషించిన పాత్రను తెలుగులో ఇప్పటివరకూ ఎవ్వరూ చేయలేదు. నా సినిమా హిట్ అయితే అది నా కష్టంగా భావిస్తా. ఫ్లాప్ అయితే నా ఓటమిగా స్వీకరిస్తా' అని హీరో సుధీర్ బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రం 'జటాధర'. సోనాక్షి సిన్హా హీరోయిన్. ఉమేశ్‌కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఇందులో దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను. సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. శివుడి నేపథ్యంలో వచ్చే సీక్వెన్స్‌కు గూస్‌బంప్స్ పక్కా' అని తెలిపారు. 'జటాధర' సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది' అని శివిన్ నారంగ్ చెప్పారు. 'నాకు తెలుగు చిత్ర పరిశ్రమ అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం విషయంలో సహకారం అందించిన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు' అని ప్రేరణ అరోరా పేర్కొన్నారు.

స్టైలిష్ క్లైమాక్స్‌కు సిద్ధం



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్‌పై సాహుగారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి కీలక షెడ్యూల్ గురించి అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఆదివారం నుంచి చిరంజీవి, ఫైటర్స్ బృందంపై స్టైలిష్ క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని, విజువల్‌గా అద్భుత అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో కథానాయకుడు వెంకటేశ్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

60వ వసంతంలోకి షారుక్


పరాఖాన్

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ తన 60వ పుట్టినరోజును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముంబైలోని ఆయన నివాసం మన్నత్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, ఇతర సెలెబ్రిటీలతో కిక్కిరిసిపోయింది. ఫరాఖాన్, కరణ్ జోహార్, రాణి ముఖర్జీ తదితరులు షారుక్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పటి లాగే ఈసారి కూడా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది అభిమానులు షారుక్ నివాసానికి తరలి వచ్చారు.

భయం కాదు.. విధ్వంసం

షారుక్ ఖాన్ కథానాయకుడిగా సిద్ధార్థ్ ఆనంద్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం షారుక్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఓ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ముందునుంచి ప్రచారంలో ఉన్న 'కింగ్' అనే టైటిల్‌నే అధికారికంగా నిర్ణయించారు. 'నేనెంత మందిని చంపానో గుర్తులేదు. వారు మంచివాళ్లా, చెడ్డవాళ్లా అన్నది నేనెప్పుడూ అడగలేదు. వారి కళ్లల్లో భయం మాత్రమే నాకు గుర్తుంది', 'వెయ్యికి పైగా హత్యలు చేసి, వందలాది దేశాల్లో మోస్ట్ వాంటెడ్ అయిన నాకు ఈ ప్రపంచం ఇచ్చిన పేరు.. కింగ్, 'నేను భయం కాదు.. విధ్వంసం' అనే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్‌మెంట్స్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ సినిమాలో సరికొత్త షారుక్‌ను చూస్తారని మేకర్స్ హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌లో భారీ ఈవెంట్



మహేశ్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రబృందం నుంచి అప్డేట్ వచ్చింది. ఈనెల 15న హైదరాబాద్‌లో గ్లోబ్ ట్రోటర్ పేరుతో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. అందులో సినిమా టైటిల్, గ్లింప్స్ వీడియోను ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఓ ఓటీటీ సంస్థ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. కాగా, సినిమా ప్రారంభమై రెండేళ్లు అవుతున్నా మేకర్స్ నుంచి అధికారికంగా ఒక్క అప్డేట్ కూడా రాలేదు. అయితే నవంబరులో అప్డేట్ ఇస్తామని గతంలో రాజమౌళి ఓ పోస్టు చేశారు. సినిమా టైటిల్‌తో పాటు మహేశ్‌బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేస్తామని చెప్పడంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే నవంబరు మొదలైనా ఎలాంటి అప్డేట్ రాలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు 'నవంబరులో మీరు మాకు ఒక హామీ ఇచ్చారు. దయచేసి ఆ మాట నిలబెట్టుకోండి' అని ట్వీట్ చేశారు. దీంతో జక్కన్న కూడా 'సరే మహేశ్.. నవంబరు మొదలైంది ఇప్పుడే కదా.. మేము తప్పకుండా ఒక్కొక్కటిగా వెల్లడిస్తాం' అని సమాధానం ఇచ్చారు.

పెళ్లి తర్వాత ప్రేమంటే?



ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'ప్రేమంటే'. సుమ కనకాల కీలకపాత్ర పోషిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. స్పిరిట్ మీడియా పతాకంపై రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. టైటిల్‌కు తగ్గట్లుగానే ప్రేమలో ఉన్నప్పుడు పెళ్లి తర్వాత జీవితం గురించి కనే కలలు, వాస్తవ జీవితంలోని చిన్న చిన్న సమస్యలతో ఎలా మారుతుందో చూపిస్తూ ఆద్యంతం వినోదంగా సాగిన టీజర్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్‌రెడ్డి.

మనం గర్వపడే సినిమా



రామ్ పోతినేని

రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ప్రచార చిత్రాలు, టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ 'ఆంధ్రా కింగ్ తాలూకా' నేను గర్వపడే సినిమా. మనమందరం గర్వపడే సినిమా. నా కెరీర్‌లో ఇంత అందమైన సినిమా ఇచ్చిన మహేశ్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కన్నడ నటుడు ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 28న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్, మెర్విన్.

గెలుపు పాటతో మొదలు



కన్నడ హీరోలు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి నటిస్తున్న మల్టీస్టారర్ '45 ది మూవీ'. అర్జున్ జన్య దర్శకత్వంలో ఉమా రమేశ్‌రెడ్డి, ఎం. రమేశ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'గెలుపు తలుపు దొరికేవరకూ దిగులు పడకురా' అంటూ సాగే గీతాన్ని యూనిట్ ఆదివారం విడుదల చేసింది. దర్శకుడు అర్జున్ జన్య ఈ గీతాన్ని స్వరపరిచారు. రోల్ రైడా, వినాయక్ ఆలపించారు. సినిమాటోగ్రఫీ: సత్య హెగ్డే.

వసుదేవ సుతం



మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెక్కిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. ధన లక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'వసుదేవ సుతం' అంటూ సాగే గీతాన్ని హీరో ఆకాశ్ జగన్నాథ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పల్లెటూరి వాతావరణంలో అందర్నీ కట్టిపడేసేలా చిత్రీకరించిన ఈ పాట నాకు బాగా నచ్చింది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకం ఉంది. చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరుకున్నారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ గీతానికి మణిశర్మ సంగీతం అందించారు.

చాందినీ చిత్రం షురూ



చాందినీ చౌదరి ప్రధాన పాత్ర పోషిస్తున్న కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు తరుణ్ భాస్కర్ క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రానికి వికాస్ దర్శకుడు. సహచారి ప్రొడక్షన్ పతాకంపై సృజన్ గోపాల్ నిర్మిస్తున్నారు. సుశాంత్ యాష్కీ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా సృజన్ గోపాల్ మాట్లాడుతూ 'సైన్స్ ఫిక్షన్ డార్క్ కామెడీ జానర్లో ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ఎవరూ ఊహించని ఒక సూపర్ హీరోను పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు. వికాస్ మాట్లాడుతూ 'అతీంద్రియ శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం కథ సాగుతుంది. కాన్సెప్ట్ వీడియోను త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.

రైతుల వెతలే కథగా...



పులివెందుల మహేశ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రి షన్ను కథానాయిక. గంగా భవాని నిర్మించారు. హీరో సుమన్, ఆమని, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న సినిమా విడుదల కానుంది. ఇటీవలె నిర్వహించిన వేడుకలో చిత్ర దర్శకుడి తల్లిదండ్రులు ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సుమన్ మాట్లాడుతూ 'ఒక రైతు పాత్రలో రైతులకు అండగా నిలబడేలా నా క్యారెక్టర్ ఉండబోతుంది' అని తెలిపారు.

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం 3 నవంబరు 2025

సెలబ్ టాక్

ఒకప్పుడు హిందీలో వరుస చిత్రాలతో అలరించిన నటుడు చంకీ పాండే. ఆయన వారసురాలు... భారతీయ సినీ ప్రేక్షకులకు సుపరిచితురాలు... అనన్యా పాండే. ఆరేళ్ల కిందట టైగర్ షరాఫ్ 'స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ 2'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ... సరైన హిట్స్ లేక ఇంకా తడబడుతూనే ఉంది. కానీ సామాజిక మాధ్యమాల్లో కోట్ల మంది అభిమానులను సంపాదించుకుంది. బడా బ్రాండ్లకు ప్రచారకర్తగా కోట్లు సంపాదిస్తోంది. గత నెల ముప్పైన 27వ పుట్టిన రోజు జరుపుకున్న అనన్యా... 'నేను అన్నీ తెలిసిన అమ్మాయిని' అంటూ తన గురించి ఎన్నో విషయాలు పంచుకుంది.

నేను అన్నీ తెలిసిన అమ్మాయిని!



తండ్రి చంకీ పాండే ఒకప్పుడు బిజీ నటుడు. అమ్మ భావన కాస్ట్యూమ్ డిజైనర్. సినీ వాతావరణంలో పెరిగిన అనన్యా... వెండితెరపై వెలిగిపోవాలని చిన్నప్పటి నుంచీ కలలు కన్నది. ముంబయి 'ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె... ఆ తరువాత చదువుకు స్వస్తి చెప్పింది. "ఉన్నత విద్య అభ్యసించనందుకు మీకు బాధగా లేదా?" అని ఒక సందర్భంలో విలేకరులు అడిగితే... "షూటింగ్ సెట్స్ నాకు సినిమా స్కూల్" అంటూ బదులిచ్చింది. దీన్నిబట్టి ఆమె సినిమాను ఎంతగా ప్రేమిస్తుందో అర్థమవుతుంది. అనుకున్నట్టుగానే 2019లో 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. కానీ ఆ తరువాత చెప్పుకోతగ్గ హిట్స్ లేక అవస్థలు పడుతోంది. అయితే ఆమె బాధపడుతూ కూర్చోలేదు. వచ్చిన అవకాశాలు వచ్చినట్టు చేసుకొంటూ పోతోంది. ప్రయత్న లోపం లేకుండా వంద శాతం కష్టపడుతోంది. "జయాపజయాలు మన చేతుల్లో ఉండవు. ఎంతటి స్టార్ అయినా ప్రేక్షకుల ఆదరణ ఉన్నంతవరకే నిలబడగలరు. ఆ విషయం నాకు ఆరంభంలోనే అర్థమైంది. అందుకే అభిమానులు మెచ్చేలా పాత్రలు ఎన్నుకోవడానికి, వారిని మెప్పించడానికి కృషి చేస్తున్నాను. అమ్మా, నాన్న, చెల్లి రైసా... వీరే నా విమర్శకులు. చుట్టూ చప్పట్లు కొట్టేవారు ఉంటే వాస్తవాలు ఏమిటో తెలుసుకోలేం. కానీ నా సినిమా బాగోకపోయినా, నా నటన నచ్చకపోయినా చెల్లి ముఖం మీదే చెప్పేస్తుంది. అమ్మా నాన్నా కూడా అంతే' అంటూ చెప్పుకొచ్చిన అనన్య... అక్టోబరు 30న తన పుట్టినరోజును ఘనంగా జరుపుకొంది.



ప్రేమానురాగాలు కురిసే రోజు...

"నా పుట్టినరోజును కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య చేసుకోవడం నాకు బాగా నచ్చుతుంది.. అందంగా ముస్తాబైన కేక్‌లు, రకరకాల బెలూన్లు, ఆహూతులు అందించే బహుమతులు... వారు కురిపించే ప్రేమానురాగాలు... పుట్టినరోజు వేడుకలో ప్రతిదీ నాకు ఎంతో ఇష్టం. ఊహ తెలిసినప్పటి నుంచీ ఇలాగే కొనసాగుతోంది. బెలూన్లు, కేక్‌లు ఇష్టపడుతున్నంత మాత్రాన నాలో పరిణతి లేదనుకోవద్దు. నేను అన్నీ తెలిసిన అమ్మాయిని" అంటూ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది అనన్య. ఈసారి తన జన్మదినం మరింత ప్రత్యేకమని, తన ప్రాణ స్నేహితురాలి పెళ్లి కూడా అదే రోజు జరగడమే అందుకు కారణమని పేర్కొంది.

గత రెండేళ్లలో...

ఆశించిన స్థాయిలో హిట్స్ లేకపోయినా... అవకాశాలు మాత్రం అనన్యను వెతుక్కొంటూ వస్తున్నాయి. ఆరేళ్ల కెరీర్‌లో దాదాపు పదిహేను చిత్రాలు చేసిన ఆమెకు... టెలివిజన్ సిరీస్ 'కాల్ మి బే'తో మంచి గుర్తింపు లభించింది. గత ఏడాది వచ్చిన ఈ షోలో ఆమె బెల్లా చౌదరి (బే)గా నటించింది. ఆ పాత్రకు అన్ని వర్గాల ప్రేక్షకులు, పరిశ్రమ పెద్దల నుంచి ప్రశంసలు అందుకుంది. "కార్తిక్ ఆర్యన్‌తో నటించిన 'తు మేరీ మై తేరా...' చిత్రం డిసెంబరు 31న విడుదలవుతుంది. ఇది పూర్తిస్థాయిలో అలరిస్తుందని, ఆ విజయంతో కొత్త సంవత్సరం ఉత్సాహంగా మొదలవుతుందని ఆశిస్తున్నా. దాంతోపాటు 'కాల్ మి బే' రెండో సీజన్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. తొలి సీజన్ లానే ఇది కూడా తప్పకుండా ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఈ రెండు ప్రాజెక్టులు నా కెరీర్‌కు ఊపునిచ్చాయి. అందుకే గడిచిన రెండేళ్లూ నాకు ఎంతో ముఖ్యమైనవి. నటిగా నన్ను నిలబెట్టినవి" అంటూ సంతోషం వ్యక్తం చేసింది అనన్య.

> **అదే విలువైన బహుమతి...**
>
> పుట్టినరోజుకు సంబంధించి అనన్యకు ఎన్నో మధురానుభూతులు ఉన్నాయి. "పార్టీల్లో మునిగి తేలడం, స్విమ్మింగ్ చేయడం, రకరకాల ఆటలు ఆడడం, స్నేహితులతో కలిసి హిందీ పాటలకు ఒళ్లు అలిసిపోయేలా డ్యాన్స్ చేయడం... రోజంతా ఉరిమే ఉత్సాహమే. చిన్నప్పుడు స్కూల్లో అయితే జన్మదినం నాడు యూనిఫామ్‌కు బదులు మనకు నచ్చిన రంగురంగుల దుస్తులు వేసుకువెళ్లే వెసులుబాటు ఉండేది. అలా స్కూల్ యూనిఫామ్ వేసుకున్న తోటి విద్యార్థుల మధ్యలోకి ఫార్మల్స్‌లో వెళ్లడం... తరగతి గదిలో స్నేహితులకు, టీచర్లకు చాక్లెట్లు పంచిపెట్టడం... వేరే తరగతివారు వచ్చి శుభాకాంక్షలు చెప్పి వెళ్లడం... ఇవన్నీ 'నేనో ప్రత్యేకమైన వ్యక్తిని' అనే అనుభూతి కలిగించేవి" అంటూ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న అనన్యకు ఇప్పటివరకు అందిన పుట్టినరోజు బహుమతుల్లో అత్యుత్తమమైనది ఏదో తెలుసా..? 'కుక్కపిల్లలు' అంటుంది తను.

నేర్చుకొంటూ ఎదుగుతున్నా...

"నాకు ప్రతి ప్రాజెక్ట్ ఒక అనుభవ పాఠం. పరిశ్రమలో నా ప్రయాణం చిన్నదే. అయినా ఎన్నో ఒడుదొడుకులు, సవాళ్లు ఎదుర్కొన్నా. వాటి నుంచి ఎంతో నేర్చుకున్నా. నేర్చుకొంటూనే ఉంటా. అనుభవాలను మెట్లుగా చేసుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని తపిస్తున్నా" అంటున్న అనన్యకు ఇన్‌స్టాగ్రామ్‌లో 2.6 కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ప్రతి పోస్ట్‌కు లక్షల్లో లైక్‌లు, అంతకు మించి వ్యూస్. "కొత్తగా ఉండటం, కొత్త విషయాలు తెలుసుకోవడం ఇష్టం. ఫ్యాషన్ అంటే అమితమైన మక్కువ. ఇటలీలో ఒకసారి ఫ్యాషన్ షూట్‌కు వెళ్లాను. అదే సమయంలో ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ నుంచి పిలుపు వచ్చింది. అలా 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2'తో నటిని అయ్యాను" అని తన అనుభవాలను పంచుకున్న అనన్య... వారసత్వంతో తెరంగేట్రానికి అవకాశాలు వచ్చినా... ప్రతిభ లేకపోతే ఎవరూ ఇక్కడ నిలబడలేరని చెబుతోంది.

'లైగర్' తదితర భారీ బడ్జెట్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో 'ఐరన్ లెగ్'గా ఆమెపై కొందరు ముద్ర వేశారు. "అసలు నటించడమే రాదు" అంటూ విమర్శలు ఎక్కుపెట్టారు. ఆ సమయంలో కొన్నాళ్లు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆస్వాదించిన రోజులు గుర్తు చేసుకొంటూ తనకు తాను మనోధైర్యం నింపుకొంది. ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా... ప్రేక్షకుల అభిమానమే ఇంధనంగా ముందుకు సాగుతోంది.

జీవనశైలి

సుఖ నిద్రకు మార్గం

రోజంతా కష్టపడినా రాత్రిళ్లు మంచి నిద్ర పట్టక అవస్థలు పడేవారు ఎందరో. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి... మన ఆహారపు అలవాట్లు. ముఖ్యంగా తీపి పదార్థాలు, పిజ్జాలు, బర్గర్ల లాంటి జంక్ ఫుడ్స్ ఎక్కువగా తినడంవల్ల సరైన నిద్ర కరువవుతుంది. సుఖ నిద్ర కావాలంటే మరి ఆహారంలో ఏముండాలి? న్యూట్రిషనిస్టుల సూచనలివే...

ఎలాంటి ఆహారం..?

పిండి పదార్థాలు, 'ట్రిప్టోఫాన్' అమినో యాసిడ్ ఉన్న పోషకాహారం తీసుకొంటే కంటి నిండా నిద్ర పడుతుంది. ట్రిప్టోఫాన్‌ను మెదడుకు చేరవేయడంలో కార్బోహైడ్రేట్స్ కీలకం. అందుకే కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉన్న ఆహారం తిన్న తరువాత కాస్త మత్తుగా ఉంటుంది. పాలు, పాల పదార్థాలు, నట్స్ లాంటివి ట్రిప్టోఫాన్‌కు బిల్డింగ్ బ్లాక్స్‌లా పనిచేస్తాయి. కనుక రాత్రి భోజనంలో తప్పనిసరిగా పోషకాలు, పిండి పదార్థాలు... అంటే పాలతో ఓట్స్, పీనట్ బటర్‌తో వీట్ బ్రెడ్ టోస్ట్ లేదంటే ఛీజ్, వెజిటబుల్ స్నాక్స్ ఉండేలా చూసుకొంటే మంచి నిద్ర పడుతుంది.

ఒమేగా-3 తక్కువైతే..!

శరీరంలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ తక్కువ స్థాయిలో ఉంటే పిల్లల్లో నిద్ర లేమి సమస్యలు వస్తాయి. సాలమన్ తదితర చేపల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. రాత్రి భోజనంలో ఇవి ఉండేలా చూసుకోండి. ఇంకా కోడి గుడ్లు, పౌల్ట్రీ ఉత్పత్తులు, వాల్‌నట్స్, సబ్జా గింజలు, బీన్స్, కాలీఫ్లవర్, బ్రసెల్ స్ప్రౌట్స్, బ్రకోలీ, బెర్రీస్, ఫ్లాక్స్, సోయాబీన్‌తోపాటు యోగర్ట్, పాలు, సోయా పాలల్లోనూ ఒమేగా-3 సమృద్ధిగా లభ్యమవుతుంది.

> **జంక్' వద్దు...**
>
> జంక్ ఫుడ్‌లో అధిక మొత్తంలో శుద్ధి చేసిన, సాధారణ పిండి పదార్థాలుంటాయి. దీనివల్ల కావల్సినన్ని పిండి పదార్థాలు శరీరానికి చేరవు. అంతేకాదు... శీతలమైన, శక్తినిచ్చే పానీయాలు ఎక్కువ మోతాదులో సేవించడం, ఉదయం అల్పాహారం తీసుకోకపోవడం, వేళాపాళా లేకుండా తినడం లాంటివి నిద్రపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

అరటి పండు: ఇందులో ట్రిప్టోఫాన్, మెగ్నీషియం పాళ్లు ఎక్కువ. ఈ రెండూ రాత్రి సుఖ నిద్రనివ్వడంలో దోహదపడతాయి.

ఓట్‌మీల్: వరి అన్నంలానే ఓట్‌మీల్‌లో కూడా అధికమొత్తంలో పిండి పదార్థాలుంటాయి. పడుకొనే ముందు దీన్ని తీసుకొంటే త్వరగా నిద్ర పడుతుంది. ఓట్స్‌లో మెలటోనిన్ శాతం ఎక్కువ.

ఛీజ్: కాటేజ్ ఛీజ్‌లో కేసియిన్ సమృద్ధిగా ఉంటుంది. పాలల్లోని ఈ ప్రొటీన్ కండరాల మరమ్మతుకు, ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.

డార్క్ చాకొలెట్: ఇందులోని సెరోటోనిన్ మెదడు, నరాలను చల్లబరుస్తుంది. ఫలితంగా మంచి నిద్ర పడుతుంది. డార్క్ చాకొలెట్‌లో షుగర్ తక్కువగా ఉండడంతో పిల్లలు పెద్దగా ఇష్టపడరు. అయితే సాధారణ చాకొలెట్‌కు బదులు రాత్రి భోజనం తరువాత ఓ బైట్ ఇది తినగలిగితే చక్కని ఫలితాన్నిస్తుంది.

చెర్రీ పండ్లు: రాత్రి నిద్ర... ఉదయం లేవడం... ఈ సైకిల్‌ను సరైన రీతిలో నడిపించడంలో చెర్రీస్‌లోని మెలాటోనిన్ పని చేస్తుంది.



ఔషధాల గని

బొప్పాయి పండు రోగనిరోధకశక్తిని పెంచడంలో ఔషధంలా పని చేస్తుంది. మన రోజువారీ ఆహారంలో దీన్ని చేర్చుకొంటే పలు వైరస్‌ల నుంచి కాపాడుతుందని నిపుణులు చెబుతున్నారు.

పోషకాలు, ఫైబర్

బొప్పాయిలో అనేక పోషకాలు, ఫైబర్‌లతో పాటు... ఫోలేట్, బీ6, క్యాల్షియం, మెగ్నీషియం, విటమిన్ ఏ, సీ, బీ1, బీ3, ఇ, కె, పొటాషియం ఉన్నాయి. బొప్పాయిలోని యాంటీఆక్సిడెంట్లు, యాంటీఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు క్యాన్సర్ కారకాలను అడ్డుకొంటాయి. బొప్పాయి ఆకుల్లో కూడా చాలా ఔషధ గుణాలున్నాయి. డెంగ్యూ పేషెంట్లలో ప్లేట్‌లెట్ల కౌంట్ పెంచడంలో ఇవి బాగా పని చేస్తాయంటారు. బొప్పాయిని చాలా ఔషధాల్లో ఉపయోగిస్తారు.

ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ

బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు విరివిగా ఉండడం వల్ల రోగనిరోధకశక్తి పెరిగి, వైరస్‌లు, ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. ఇందులోని సీ, ఇ విటమిన్లు, బీటాకారోటిన్ లాంటి యాంటీఆక్సిడెంట్లు ఊపిరితిత్తులు, ముక్కు రంధ్రాలల్లో శ్వాససంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. జ్వరం, గొంతు మంట, నొప్పి, జలుబువల్ల కలిగే ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

మధుమేహం తగ్గించడంలో...

పొటాషియం సమృద్ధిగా ఉండటంవల్ల హైబీపీని నియంత్రణలో ఉంచుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు మధుమేహాన్ని తగ్గించడంలో దోహదపడతాయి. బొప్పాయిలో కేలరీలు తక్కువ. కనుక తింటే బరువు పెరుగుతామనే భయం అక్కర్లేదు.

గుండెను ఆరోగ్యంగా...


ఈ పండులోని సీ, ఇ విటమిన్లతో పాటు బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు శరీరంలో కొవ్వు తగ్గించి, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో దోహదపడతాయి. రక్తనాళాలను శుభ్రం చేసి, రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి.



బాల్యం నుంచి హస్తకళలపై ఉన్న ఆసక్తిని ఎన్ని అవరోధాలు ఎదురైనా మాధురి నేమా విడిచిపెట్టలేదు. బ్యాంకు ఉద్యోగాన్ని కూడా వదిలేసి తన కళాభిరుచిని కొనసాగిస్తున్నారు. ఎన్నో బహుమతులు, అవార్డులు గెలుచుకున్న ఆమె... మహిళలకు, విద్యార్థులకు శిక్షణ కోసం సొంత సంస్థను స్థాపించారు. ఆమె తన కళా ప్రయాణం గురించి 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి...









కళామాధురి

'చిన్నప్పటి నుండి నాకు హస్తకళలంటే చాలా ఇష్టం. మా నాన్నగారు వ్యవసాయ శాఖలో సైంటిస్ట్. ఆయన రచయితగా, వ్యాఖ్యాతగా కూడా పేరు పొందారు. మా తల్లిదండ్రులు కళల పట్ల మక్కువ కలిగేలా నన్ను, నా తోబుట్టువులను ఎంతగానో ప్రోత్సహించేవారు. పేపర్లతో బొమ్మలు చేయడం, చిత్రలేఖనం, రంగోలి, పెయింటింగ్స్‌లలో ఎక్కడ పోటీలు జరిగినా పంపించేవారు. అలా నాకు కళలపై ఆసక్తి పెరిగింది.

మాది మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సెహోర్. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పట్టా పొందాను. పెళ్లయిన తరువాత... 2013లో ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వచ్చాను. నా భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. నేను బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అధికారిణిగా పని చేశాను. ఆ సమయంలో పిల్లల పెంపకం, ఉద్యోగ బాధ్యతల కారణంగా నా కళాభిరుచిని కొనసాగించడానికి సమయం దొరికేది కాదు. ఈ నేపథ్యంలో... నా భర్త అనుమతితో ఉద్యోగాన్ని వదిలేశాను. నా కళకు మరింత పదును పెట్టాను.

పర్యావరణ హితంగా...

కార్డుబోర్డుతో రకరకాల బొమ్మల తయారీ, వాడిన పేపర్‌తో చూడచక్కని ఆకృతుల రూపకల్పన, డాట్ పెయింటింగ్, లిప్పన్ ఆర్ట్, రంగోలీ డిజైనింగ్, వాల్ పెయింటింగ్స్, స్కెచ్ ఆర్ట్, మెహందీ డిజైన్లు, ఎంబ్రాయిడరీ. స్ట్రింగ్ ఆర్ట్, రెడీమేడ్ రంగోలీ, ఉడెన్ మ్యాట్ రంగోలీ, క్లే ఆర్ట్... ఇలా అనేక అంశాల్లో నాకు నైపుణ్యం ఉంది. ఉద్యోగాన్ని విడిచిపెట్టిన తరువాత.. ఇంట్లోనే కాగితం, కార్డు బోర్డులో బొమ్మలు తయారుచేసి, వాటితో ప్రదర్శనలు నిర్వహించాను. వాటిని కొనుగోలు చేయడానికి చాలామంది పోటీ పడేవారు. మరోవైపు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అనేక బహుమతులను గెలుచుకున్నాను, అవార్డులు కూడా అందుకున్నాను. చాలామంది తమ కోసం గిఫ్టులను, రకరకాల బొమ్మలను తయారు చేసి ఇవ్వాలని, మెహందీ పెట్టాలని కోరుతూ నా దగ్గరకు వస్తూ ఉంటారు. నేను తయారు చేసే బొమ్మల్లో ప్లాస్టిక్ ఉపయోగించను. తద్వారా పర్యావరణానికి హాని కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటాను. నాకు తెలిసిన కళను నాలోనే దాచిపెట్టుకోకూడదని నా ఉద్దేశం అందుకే... వేసవి సెలవుల్లో, ఇతర సెలవు దినాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను. వారితో పాటు మహిళలకు కూడా శిక్షణ ఇవ్వడానికి ఇటీవలే 'మాధురీస్ ఆర్ట్ స్పేస్' పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేశాను. తద్వారా శిక్షకురాలిగా కూడా గుర్తింపు పొందుతున్నాను. కళాకారులను తయారు చేసి, వారికి గుర్తింపు లభించేలా చేయడం, తద్వారా కళలను పరిరక్షించడం నా లక్ష్యం."

● వెనగంటి లక్ష్మణ్ యాదవ్

శ్మశాన వాటికలకు మహిళలు వెళ్ళడమే అరుదు. కానీ పదేళ్ళుగా మృతదేహాల్ని దహనం చేసే వృత్తిలో కొనసాగుతున్నారు పశ్చిమబెంగాల్‌కు చెందిన తంపాదాస్. ఇప్పటివరకూ 8 వేలకు పైగా అంత్యక్రియలను ఆమె నిర్వహించారు. ఈ క్రమంలో ఎన్నో ఆక్షేపణలు ఎదుర్కొన్నారు. "ఇది నాకు జీవనోపాధి మాత్రమే కాదు... వారసత్వం కూడా" అంటున్న తంపాదాస్ అంతరంగమిది.

సత్కార్ కర్మిగా ఆమె...

"సత్కార్ కర్మి... మా రాష్ట్రంలో శ్మశానంలో పని చేసే వారిని అలాగే పిలుస్తారు. మరణించినవారికి అంత్యక్రియలను శ్రద్ధగా నిర్వహించి, వారిని హుందాగా ఈ లోకం నుంచి సాగనంపడం మా విధి. ఇది నేను ఇష్టపడి ఎంచుకున్న వృత్తి కాదు. అవసరం నన్ను ఇటువైపు తీసుకువచ్చింది. అంతకుముందు నా జీవితం వేరు, నేను కన్న కలలు వేరు.

ఊరంతా అభ్యంతరం చెప్పింది...

మాది పశ్చిమబెంగాల్‌లోని పురంధర్‌పూర్. అమ్మ, నాన్న, నా చెల్లెలు, తమ్ముడు, నేను... ఇదీ మా కుటుంబం. మా నాన్న బాపిదాస్ ఊరు శ్మశాన వాటికలో సత్కార్ కర్మిగా పని చేసేవారు. నేను పదో తరగతి చదివాను. నర్సు శిక్షణ తీసుకొని... మా ఊర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగిగా చేరాను. ఎప్పటికైనా స్థిరమైన ఉద్యోగం సంపాదించాలి, జీవితంలో స్థిరపడాలి... ఇదీ నా లక్ష్యం. అయితే... బొటాబొటి ఆదాయంతో సాగుతున్న మా కుటుంబం... మా నాన్న హఠాత్తుగా మరణించారు. నాకు నర్సుగా వచ్చే జీతం అంతంతమాత్రం. అది కూడా కొన్ని నెలలపాటు అందేది కాదు. నలుగురు సభ్యులున్న కుటుంబాన్ని పోషించవలసిన బాధ్యత నా మీద పడింది. ఏం చేయాలో తోచలేదు. చివరకు... మా నాన్న వృత్తినే చేపట్టాలని నిర్ణయించుకున్నాను. సంప్రదాయికంగా శ్మశానంలోకి మహిళలు రారు. ఇక దహన కార్యక్రమాలు నిర్వహించేది కూడా పూర్తిగా పురుషులే. అలాంటిది... నేను ఆ పని చేస్తానంటే... మా కుటుంబ సభ్యులే కాదు, ఊరంతా అభ్యంతరం తెలిపింది. కానీ నాకు మరొక మార్గం కనిపించలేదు. నాన్న వారసత్వాన్ని స్వీకరించాను. గ్రామ పెద్దలను ఒప్పించి... 2014లో సత్కార్ కర్మిగా బాధ్యతలు చేపట్టాను.

నిద్రపట్టేది కాదు...

మొదట్లో రకరకాల సమస్యలు ఎదుర్కొన్నాను. గ్రామంలో మహిళలు ఈసడించుకొనేవారు. బంధువులు మా ఇంటికి రావడం మానేశారు. అప్పుడు మరణించినవారికన్నా జీవించి ఉన్నవారే భయంకరంగా అనిపించేవారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటలవరకూ శ్మశానంలోనే ఉండాలి. వేడి, పొగ... అన్నిటినీ మించి మృతుల ఆత్మీయుల రోదనలు... వాటన్నిటినీ తట్టుకోవడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది. భయం కూడా వేసేది. రాత్రిపూట నిద్ర పట్టేది కాదు. కొన్ని రోజులు నా వెంట మా అమ్మ వచ్చేది. జనం విమర్శలకు క్రమంగా అలవాటు పడ్డాను. ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా... నా పని నేను చేసుకుంటూ పోయాను. శ్మశానవాటికను శుభ్రంగా ఉంచడం, కట్టెలను పేర్చి చితులు తయారు చేయడం, చితాభస్మాన్ని సేకరించి మృతుల కుటుంబాలకు అప్పగించడం, మరణించినవారి వివరాలు నమోదు చేయడం, వాటిని పంచాయతీ కార్యాలయానికి తెలియజేయడం... ఇలా రకరకాల విధులను నేను నెరవేర్చాల్సి ఉంటుంది. దీనికోసం అదనపు షిఫ్టులతో కలిపి... పంచాయతీ నాకు ఇచ్చేది అయిదు వేల రూపాయలు. అయితే అప్పుడప్పుడు... మృతుల బంధువులు కొద్ది మొత్తాలు ఇస్తూ ఉంటారు. 2019లో కట్టెల చితులకు బదులుగా... విద్యుత్ దహన వాటికను ఏర్పాటు చేశారు. దీనితో కొంత భారం తగ్గింది. గతంలో కొన్ని గంటలు పట్టేది... ఇప్పుడు 45 నిమిషాలలోనే పూర్తవుతోంది. ఇప్పటివరకూ ఎనిమిది వేలకు పైగా మృతదేహాలకు దహన కార్యక్రమాలు నిర్వహించాను. డబ్బున్నవారు కావచ్చు, పేదలు కావచ్చు... ప్రతి మనిషి జీవితం ముగిసేది ఇక్కడే. సంపద, గర్వం, అహంకారం, కులాధిపత్యాలు.... అవన్నీ శ్మశానం బయటే ఆగిపోతాయి. మరణించినవారికి గౌరవప్రదంగా ఈ లోకం నుంచి సాగనంపుతున్నాననే భావన... ఆదాయం కన్నా ఎక్కువ సంతృప్తిని ఇస్తోంది.



> **పెళ్లి కుదరడం లేదు...**
>
> ఈ వృత్తి కారణంగా వ్యక్తిగత జీవితంలో ఎలాంటి సమస్యలు లేవా? అంటే ఉన్నాయనే చెబుతాను. ఇప్పుడు నాకు ఇరవై తొమ్మిదేళ్ళు. పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి. కానీ నా వృత్తి గురించి తెలియగానే... అన్నీ వెనక్కు పోతున్నాయి. అయినా నేను బాధ పడడం లేదు. మా తాత, నాన్న... ఇలా మా కుటుంబం ఈ వృత్తికి అంకితం అయింది. దాన్ని నేను వారసత్వంగా స్వీకరించాను. నేను నా తల్లితండ్రులకు మొదటి సంతానాన్ని. నేనే పురుషుడినైతే ఇన్ని ఆక్షేపణలు ఉండేవి కాదు. అలాగని సంప్రదాయాల్ని ఎదిరించడం లాంటి మాటలు నేను చెప్పను. మా నాన్న స్థానంలో ఆ పని ఎవరో ఒకరు చెయ్యాల్సిందే. నాకు స్థిరమైన ఉపాధి అవసరమైనప్పుడు... ఈ వృత్తి నన్ను ఆదుకుంది. లేకపోతే మా కుటుంబం చాలా ఇబ్బందులు పడేది. "ఈ పని తప్ప మరేం దొరకలేదా?" అని ప్రశ్నించే వారికి నేను చెప్పే సమాధానం ఒక్కటే... నేను దొంగతనం చేయడం లేదు. బిచ్చమెత్తుకోవడం లేదు. నా పని నిజాయితీగా చేస్తున్నాను. మరి నేనెందుకు సిగ్గుపడాలి? నాపట్ల గ్రామస్తుల ధోరణి కూడా మారింది. ముఖ్యంగా... కొవిడ్ కాలంలో నా నిబద్ధతను అందరూ గమనించారు. ఇప్పుడు నన్ను గౌరవంగా చూస్తున్నారు."



ప్రపంచం అందింది మనమ్మాయి నవ్వింది

భారత్‌దే వన్డే ప్రపంచ కప్

ఫైనల్లో దక్షిణాఫ్రికా చిత్తు

● దీప్తి, షఫాలీ ఆల్‌రౌండ్ షో ● కెప్టెన్ వోల్వార్ట్ సెంచరీ వృధా

డబ్బే డబ్బు.. భారత్‌కు - రూ. 39.50 కోట్లు
దక్షిణాఫ్రికాకు - రూ. 19.78 కోట్లు

మహిళల వన్డే వరల్డ్‌కప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఎక్కువ పరుగులు (4 ఇన్నింగ్స్‌లో 331) చేసిన బ్యాటర్‌గా హర్మన్‌ప్రీత్. బెలిండా క్లార్క్ (6 ఇన్నింగ్స్‌లో 330)ను అధిగమించింది.

పురుషుల, మహిళల క్రికెటర్లలో వరల్డ్ కప్ ఫైనల్లో ఫిఫ్టీ సాధించిన యంగెస్ట్ ప్లేయర్ (21 ఏళ్లు) గా షఫాలీ వర్మ.

1

మహిళల వరల్డ్‌కప్ ఎడిషన్‌లో భారత్ తరఫున ఎక్కువ పరుగులు (434) సాధించిన బ్యాటర్‌గా స్మృతి మంధాన. 2017 వరల్డ్‌కప్‌లో మిథాలీ 409 పరుగులు సాధించింది. అలాగే ఒకే ఎడిషన్‌లో 200+ రన్స్, 20+ వికెట్లు తీసిన ఏకైక ప్లేయర్‌గా దీప్తి శర్మ నిలిచింది.

మహిళల వరల్డ్‌కప్ ఫైనల్లో 50+ రన్స్, 5 వికెట్లు తీసిన ప్లేయర్‌గా దీప్తి.

మహిళల వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో అత్యధిక స్కోరు (314/9) సాధించిన రెండో జట్టుగా భారత్. 2022 ఫైనల్లో ఇంగ్లండ్‌పై ఆసీస్ 356/5 స్కోరుతో టాప్‌లో ఉంది.

2

ఒకే వరల్డ్‌కప్ (పురుషుల, మహిళల) సెమీస్, ఫైనల్లో శతకాలు బాదిన రెండో ప్లేయర్‌గా వోల్వార్ట్. 2022లో అలీసా హీలీ మొదట ఈ ఫీట్ సాధించింది. అలాగే మహిళల వన్డేల్లో ఎక్కువ శతకాలు (8) బాదిన రెండో కెప్టెన్‌గా నిలిచింది. మెగ్ లానింగ్ (11) టాప్‌లో ఉంది.

ఆహా.. ఎంత మధురమో కదా ఈ విజయం. దాదాపు ఐదు దశాబ్దాల కల నెరవేరిన వేళ.. భారతావని యావత్తూ పులకరించిపోతోంది. గతంలో రెండు పర్యాయాలు ఫైనల్‌కు వచ్చి ఉసూరుమనిపించినా.. ఈసారి వన్డే విశ్వకప్‌లో ఆఖరి పంచ్ మనమ్మాయిలదే! టోర్నీ నాకౌట్ ముందు వరకు పెద్దగా ఆకట్టుకోలేకపోయిన మనమ్మాయిలు అసలు సిసలైన మ్యాచ్‌ల్లో మాత్రం సివంగుల్లా విజృంభించారు.

సెమీస్‌లో ప్రపంచ రికార్డు ఛేదనను తిరగరాసి సమరోత్సాహంతో ఫైనల్లోకి అడుగుపెట్టగా.. టైటిల్ ఫైట్‌లోనూ పట్టు చేజారనీయలేదు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బ్యాట్‌తో.. బంతితో సఫారీలపై పిడుగల్లే పడింది. ఇక అనూహ్య రీతిలో జట్టులోకి వచ్చిన యువ సంచలనం షఫాలీ వర్మ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లోనూ అదరగొట్టింది.

ఫలితంగా భారత మహిళల క్రికెట్ చరిత్రలోనే చిరస్మరణీయ ఘట్టం ఆవిష్కృతమైంది. మన మహిళల క్రికెట్‌లో ఎవ్వరికీ సాధ్యం కాని రీతిలో వన్డే విశ్వకప్‌ను హర్మన్ బృందం సగర్వంగా ముద్దాడి.. కోట్లాది అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. ఎన్నో అవమానాలను తట్టుకుంటూ భారత మహిళల క్రికెట్ జట్టు సాధించిన పురోగతికి నిదర్శనం ఈ అద్భుతం.
ఇక అమ్మాయిలూ.. ఈ విజయస్ఫూర్తితో ఆకాశమే హద్దుగా దూసుకువెళ్లండి.. విజయోస్తు.



దీప్తి శర్మ (58; 5/39)

నవీ ముంబై: భారత మహిళల క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కోట్లాది క్రీడాభిమానుల కోరిక ఫలించిన వేళ.. వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టు నయా చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ సేన మొట్టమొదటిసారిగా విశ్వకప్‌ను అందుకుంది. ఓపెనర్ షఫాలీ వర్మ (78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87; 2/36), దీప్తి శర్మ (58 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 58; 5/39) ఆల్‌రౌండ్‌షోతో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్నందించారు. అటు దక్షిణాఫ్రికా కెప్టెన్ వోల్వార్ట్ (98 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 101) శతక పోరాటానికి సహకారం కరువైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 298 పరుగులు చేసింది. మంధాన (58 బంతుల్లో 8 ఫోర్లతో 45) రాణించింది. ఖాకాకు మూడు వికెట్లు దక్కాయి. ఛేదనలో దక్షిణాఫ్రికా 45.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటైంది. డెర్క్‌సెన్ (35) ఫర్వాలేదనిపించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా షఫాలీ, ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా దీప్తి శర్మ నిలిచారు. అంతకుముందు మ్యాచ్ సమయానికి భారీ వర్షం కురవడంతో టాస్ కూడా వీలు పడలేదు. అనంతరం రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5 గంటలకు మ్యాచ్‌ను ఆరంభించారు.

వోల్వార్ట్ సెంచరీ బాదినా..: భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా ఓపెనర్ వోల్వార్ట్ ఒంటరి పోరాటం సాగించింది. కానీ కీలక సమయంలో వికెట్లు తీసిన స్పిన్నర్లు షఫాలీ, దీప్తి శర్మ ప్రత్యర్థికి చెక్ పెట్టారు. తొలి 5 ఓవర్లలో 18 పరుగులే చేయగా.. ఆ తర్వాత వోల్వార్ట్ బౌండరీల జోరుకు పవర్‌ప్లేలో 52 పరుగులు సాధించగలిగింది. అయితే లేని పరుగు కోసం వెళ్లి ఓపెనర్ బ్రిట్స్ (23) అమన్‌త్రోతో రనౌటైంది. ఇక శ్రీచరణి తన తొలి ఓవర్‌లోనే బాష్ (0) వికెట్ తీసి మరింత జోష్ నింపింది. ఈ దశలో లూస్‌తో కలిసి మూడో వికెట్‌కు వోల్వార్ట్ 52 పరుగులు జోడించింది. మరోవైపు పార్ట్‌టైమ్ స్పిన్నర్ షఫాలీకి బంతినిచ్చిన కెప్టెన్ హర్మన్ ఫలితం సాధించింది. చక్కగా కుదురుకున్న లూస్ (25)తో పాటు కీలక కాప్ (4)ను వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో భారత శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. ఆ తర్వాత జాఫ్టా (16) స్పిన్నర్ దీప్తికి చిక్కింది. ఇక వోల్వార్ట్‌ను 42వ ఓవర్‌లో దీప్తి అవుట్ చేయడంతో స్టేడియం హోరెత్తింది. అమన్ ఈ క్యాచ్‌ను రెండో ప్రయత్నంలో అద్భుతంగా పట్టేసింది. అదే ఓవర్‌లో ట్రియాన్ (9) ఎల్బీగా వెనుదిరిగింది. దీంతో 221 రన్స్‌కే 8 వికెట్లు పడగా.. మ్యాచ్ భారత్ వైపు మొగ్గు చూపింది. చివరి రెండు వికెట్లు సైతం నాలుగు పరుగుల వ్యవధిలోనే నేలకూలడంతో భారత్‌కు అద్భుత విజయం దక్కింది.

శతక భాగస్వామ్యంతో ఆరంభం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆరంభంలో ఓపెనర్ షఫాలీ మెరుపులు.. మధ్య ఓవర్లలో దీప్తి శర్మ సంయమన ఆటతీరు.. చివర్లో రిచా ఘోష్ ఎదురుదాడితో 300 స్కోరు దరిదాపుల్లోకి రాగలిగింది. మంధాన దూకుడుగా ఆడకుండా షఫాలీకి సహకరించింది. ఇద్దరి ఆటతీరుతో తొలి వికెట్‌కు 104 పరుగుల శతక భాగస్వామ్యం జత చేరింది. ప్రతీకా గాయంతో ఏకంగా జట్టులో చోటు దక్కించుకున్న షఫాలీ కీలక ఫైనల్లో దుమ్ము రేపింది. దీంతో పవర్‌ప్లేలోనే భారత్ 64 పరుగులతో జోరు మీద కనిపించగా, ఈ స్థితిలో 320+ స్కోరు ఖాయమనిపించింది. కానీ ఆ తర్వాత పిచ్ నెమ్మదించడంతో స్పిన్నర్లు ప్రభావం చూపి పరుగులకు ముకుతాడు వేశారు. అటు 18వ ఓవర్‌లో మంధాన వెనుదిరిగింది. 56 పరుగుల వద్ద షఫాలీ క్యాచ్‌ను బాష్ వదిలేసింది. కానీ రెండో వికెట్‌కు 62 పరుగులు జత చేరాక షఫాలీ, జెమీమా (24)లను పేసర్ ఖాకా వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన దీప్తి జట్టును ఆదుకునే ప్రయత్నం చేసింది. దీప్తితో కలిసి నాలుగో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం అందించిన హర్మన్ (20)ను స్పిన్నర్ ఎంలబా దెబ్బతీసింది. అనంతరం అమన్‌జోత్ (12) అవుటయ్యాక క్రీజులోకి వచ్చిన రిచా సిక్సర్‌తో ఖాతా తెరిచింది. ఖాకా ఓవర్‌లో సిక్సర్ బాదాక తన క్యాచ్‌ను డీప్ స్క్వేర్‌లో బాష్ వదిలేసింది. అయితే ఎక్కువ సేపు క్రీజులో నిలువకుండా తను 49వ ఓవర్‌లో ఖాకాకే చిక్కడంతో భారత్ ఆశించిన స్కోరుపై ప్రభావం పడింది. ఆరో వికెట్‌కు రిచా-దీప్తి 47 పరుగులు సమకూర్చారు. ఇక అర్ధసెంచరీ పూర్తి చేసిన దీప్తి ఇన్నింగ్స్ చివరి బంతికి రనౌటైంది.


షఫాలీ వర్మ (87; 2/36)



ఏమని వర్ణించగలం?

అద్భుతం..అమోఘం..అపూర్వం..అనన్య సామాన్యం..వన్డే ప్రపంచ కప్ నాకౌట్ నుంచి భారత జట్టు కనబరచిన ప్రదర్శనకు ఈ ఉపమానాలన్నీ సరిపోవేమో! ఆతిథ్య జట్టే అయినా మెగా టోర్నమెంట్ ప్రారంభంలో హర్మన్ సేనపై పెద్దగా అంచనాల్లేవు. పైగా ప్రపంచ కప్‌కు ముందు స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌నూ టీమిండియా కోల్పోయింది. దాంతో సొంతగడ్డపై జరుగుతున్నా..వరల్డ్ కప్‌లో మన అమ్మాయిలను టైటిల్ ఫేవరెట్లలో ఒకరిగా క్రికెట్ పండితులు అంచనా వేయలేదు. అంతేకాదు మెగా టోర్నమెంట్‌లో భారత్ ప్రస్థానమూ సాఫీగా సాగలేదు. శ్రీలంక, పాకిస్థాన్‌లాంటి జట్లపై గెలుపొందినా..బలమైన టీమ్‌లకు ఎదురొడ్డలేకపోయింది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లపై పరాజయాలు చవి చూసింది. ఈనేపథ్యంలో అసలు సెమీఫైనల్‌కు చేరగలమా అనే అనుమానాలు ఉదయించాయి. కానీ తరువాతి మ్యాచ్‌ల్లో పుంజుకుని సెమీస్‌పైనల్లోకి అడుగుపెట్టి.. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో అమీతుమీకి సిద్ధమైంది. టోర్నమెంట్‌లో సెమీస్ ముందుకు వరకు టీమిండియా ఆట ఒక ఎత్తయితే నాకౌట్ నుంచి సాగిన భారత ఆట నిస్సందేహంగా మరో ఎత్తు ! కప్పు కల నెరవేరేందుకు కేవలం రెండడుగుల దూరంలో నిలిచిన మనోళ్లు ఆస్ట్రేలియాపై ఆకాశమే హద్దుగా విజృంభించారు. మహిళల క్రికెట్ చరిత్రలో నభూతో..అనే మ్యాచ్‌ను ఆవిష్కరించారు. ఆల్‌రౌండ్ షోతో ఏడుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియాను పడగొట్టిన ఉత్సాహంతో ఫైనల్లోనూ ఉమెన్ ఇన్ బ్లూ అదరగొట్టారు. దక్షిణాఫ్రికా ఎదుట దాదాపు 300 పరుగుల లక్ష్యాన్ని ఉంచి మానసికంగా దెబ్బ కొట్టారు. కీలక బ్యాటర్లను త్వరగా పెవిలియన్ చేర్చి బౌలర్లు తమ కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వర్తించారు. అయితే కెప్టెన్ వోల్వార్ట్ సెంచరీ ఇన్నింగ్స్‌తో గుబులు రేపినా అమన్‌జోత్ సూపర్ క్యాచ్‌తో ఆమె అవుట్ కావడంతో భారత్ విజయం ఖాయమైంది. మొత్తంగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలలో తిరుగులేని ప్రదర్శన కనబరచి విశ్వ విజేతలుగా నిలిచిన మన అమ్మాయిలకు హ్యాట్సాఫ్..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

భళా..శ్రీచరణి



ఆడిన తొలి ప్రపంచ కప్‌లోనే తెలుగమ్మాయి శ్రీచరణి సత్తా చాటింది. 21 ఏళ్ల ఈ లెఫ్టామ్ స్పిన్నర్ టోర్నీలో అన్ని మ్యాచ్‌ల్లో ఆడడం ఆమె ప్రతిభపై జట్టు యాజమాన్యం పెట్టుకున్న నమ్మకాన్ని సూచించింది. వారి నమ్మకాన్ని వమ్ము చేయని శ్రీచరణి మొత్తం 12 వికెట్లు తీసి భళా అనిపించింది. ముఖ్యంగా బలమైన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లతో మ్యాచ్‌ల్లో ఆమె విశేషంగా రాణించింది.

స్కోరు బోర్డు

భారత్: స్మృతి మంధాన (సి) జాఫ్టా (బి) ట్రియన్ 45, షఫాలీ (సి) లూస్ (బి) ఖాక 87, జెమీమా (సి) వోల్వార్డ్ (బి) ఖాక 24, హర్మన్‌ప్రీత్ (బి) ఎంలబా 20, దీప్తి శర్మ (రనౌట్) 58, అమన్‌జోత్ (సి అండ్ బి) డిక్లెర్క్ 12, రిచా ఘోష్ (సి) డెర్క్‌సెన్ (బి) ఖాక 34, రాధా యాదవ్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 50 ఓవర్లలో 298/7; వికెట్ల పతనం:** 1-104, 2-166, 3-171, 4-223, 5-245, 6-292, 7-298; **బౌలింగ్:** కాప్ 10-1-59-0, ఖాక 9-0-58-3, ఎంలబా 10-0-47-1, డిక్లెర్క్ 9-0-52-1, లూస్ 5-0-34-0, ట్రియాన్ 7-0-46-1.

దక్షిణాఫ్రికా: లారా వోల్వార్ట్ (సి) అమన్‌జోత్ (బి) దీప్తి 101, బ్రిట్స్ (రనౌట్) 23, బాష్ (ఎల్బీ) శ్రీచరణి 0, లూస్ (సి అండ్ బి) షఫాలీ 25, కాప్ (సి) రిచా (బి) షఫాలీ 4, జాఫ్టా (సి) రాధ (బి) దీప్తి 16, డెర్క్‌సెన్ (బి) దీప్తి 35, ట్రియాన్ (ఎల్బీ) దీప్తి 9, డిక్లెర్క్ (సి) హర్మన్ (బి) దీప్తి 18, ఖాక (రనౌట్) 1, ఎంలబా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 45.3 ఓవర్లలో 246 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-51, 2-62, 3-114, 4-123, 5-148, 6-209, 7-220, 8-221, 9-246, 10-246; **బౌలింగ్:** రేణుక 8-0-28-0, క్రాంతి గౌడ్ 3-0-16-0, అమన్‌జోత్ 4-0-34-0, దీప్తి శర్మ 9.3-0-39-5, శ్రీచరణి 9-0-48-1, రాధా యాదవ్ 5-0-45-0, షఫాలీ 7-0-36-2.

గవాస్కర్, టెండూల్కర్, ధోనీ, కోహ్లీ, రోహిత్ తదితరులను క్రికెట్ దేవుళ్లుగా ఆరాధించే మన దేశంలో ఒకప్పుడు మహిళల క్రికెట్‌పై అంతులేని వివక్ష ఉండేది. ప్రభుత్వ ప్రోత్సాహం గానీ, ప్రైవేట్ స్పాన్సర్‌షిప్‌లుగానీ లేని ఆ కాలంలో అమ్మాయిలు క్రికెట్ ఆడడమే విడ్డూరంగా ఉండేది. అలాంటి పరిస్థితుల నుంచి యువతులు క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే స్థాయికి ఎదిగింది. ఇవాళ దేశంలో పురుషులతో సమానంగా మహిళల మ్యాచ్‌లకూ క్రికెట్ స్టేడియాలు నిండుతున్నాయి.. మెగా టోర్నీల్లో మనమ్మాయిలు ట్రోఫీలు గెలుస్తున్నారు.. తాజాగా హర్మన్‌ప్రీత్ సారథ్యంలో భారత సీనియర్ జట్టు వన్డే ప్రపంచ చాంపియన్‌గా నిలవడం. ఇలా.. రోజురోజుకూ మహిళా క్రికెట్ అత్యున్నత స్థాయికి ఎదగడం వెనక ఉన్న వ్యక్తి, శక్తి మిథాలీ రాజ్. తన కెరీర్‌నే సోపానంగా మలచి దేశ క్రికెట్ భవిష్యత్తును

మహిళల క్రికెట్ ముఖచిత్రం.. మిథాలీ



నిర్మించే అవకాశం దక్కించుకున్న నిఖార్సయిన క్రీడాకారిణి మిథాలీ. సుదీర్ఘంగా 23 ఏళ్ల పాటు కొనసాగిన తన దిగ్విజయ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు, రికార్డులు అందుకుంది మిథాలీ. ప్రపంచకప్‌లో రెండుసార్లు (2005, 2017) జట్టును ఫైనల్స్ దాకా తీసుకెళ్లి భారత మహిళా క్రికెట్‌కు గౌరవాన్ని, స్వర్ణయుగాన్ని తీసుకొచ్చింది. ధోనీతో సమానంగా మహిళల కెప్టెన్‌గా ఖ్యాతి గడించింది. అంచలంచెలుగా ఎదిగి మహిళల క్రికెట్‌కు ముఖచిత్రంగా మారింది. ఇవాళ.. వన్డే ప్రపంచ కప్ చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిన భారత జట్టులోని సభ్యుల్లో దాదాపు అందరికీ మిథాలీనే ఆదర్శం. గతంలో మిథాలీ వేసిన పునాదికి ఇప్పుడు ప్రపంచ కప్ విజేత రూపంలో ప్రతిఫలం దక్కిందనుకోవచ్చు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టీ20లకు కేన్ వీడ్కోలు


వన్డే, టెస్టులకు పరిమితం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ వెటరన్, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అయితే వన్డే, టెస్టుల్లో కొనసాగుతానని ప్రకటించాడు. వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌కు ముందు అతనీ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పొట్టి ఫార్మాట్ నుంచి వైదొలిగేందుకు ఇదే సరైన సమయమని, జట్టు ఎంపికపై సెలెక్టర్లకు కూడా తగిన స్పష్టత వస్తుందని 35 ఏళ్ల కేన్ తెలిపాడు. అయితే ఫ్రాంచైజీ క్రికెట్‌పై మాత్రం నిర్ణయం తీసుకోలేదు. 2011లో టీ20ల్లో అరంగేట్రం చేసిన కేన్ 93 మ్యాచ్‌ల్లో 2575 రన్స్ సాధించాడు. అలాగే 75 టీ20ల్లో కెప్టెన్‌గా వ్యవహరించగా.. అతడి ఆధ్వర్యంలోనే కివీస్ టీ20 వరల్డ్‌కప్ 2016, 2022 సెమీస్‌లో.. 2021 ఫైనల్లో తలపడింది. మరోవైపు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా జట్టును ఫైనల్‌కు చేర్చాడు. గతేడాది గుజరాత్‌కు ఆడగా.. 2025 సీజన్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలాడు.

అదరగొట్టిన సుందర్

అర్ష్‌దీప్‌కు 3 వికెట్లు

● 5 వికెట్లతో భారత్ గెలుపు
● ఆసీస్‌తో మూడో టీ20



వాషింగ్టన్ సుందర్
అర్ష్‌దీప్

హోబర్ట్: వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులతో 49 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్‌తోపాటు అర్ష్‌దీప్ (3/35) విజృంభించడంతో.. ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది. ఆదివారం జరిగిన మూడో టీ20లో టీమిండియా 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత ఆసీస్ 20 ఓవర్లలో 186/6 స్కోరు చేసింది. టిమ్ డేవిడ్ (74), స్టొయినిస్ (64) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. వరుణ్ చక్రవర్తి2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో భారత్ 18.3 ఓవర్లలో 188/5 చేసి గెలిచింది. తిలక్ వర్మ (29), అభిషేక్ శర్మ (25), సూర్యకుమార్ (24) రాణించారు. నాథన్ ఎల్లీస్ మూడు వికెట్లు దక్కించుకొన్నాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అర్ష్‌దీప్ నిలిచాడు.

టాప్ తడబడినా..: ఛేదనలో సుందర్ ఆటే హైలైట్‌గా నిలిచింది. తిలక్‌తో కలిసి ఐదో వికెట్‌కు 34 పరుగులు జోడించిన సుందర్.. ఆరో వికెట్‌కు జితేష్ (22 నాటౌట్)తో కలిసి 25 బంతుల్లో 45 పరుగుల అజేయ భాగస్వామ్యంతో జట్టును గెలిపించాడు. ఓపెనర్లు అభిషేక్ శర్మ, గిల్ (15) పవర్‌ప్లేలోనే పెవిలియన్ చేరారు. వీరిద్దరినీ ఎల్లీస్ అవుట్ చేశాడు. సూర్యకుమార్ దూకుడుగా ఆడే క్రమంలో వికెట్ పారేసుకొన్నాడు. అయితే, తిలక్, అక్షర్ పటేల్ (17) నాలుగో వికెట్‌కు 35 పరుగులతో ఆదుకోవడంతో టీమ్ స్కోరు సెంచరీ మార్క్ దాటింది. కానీ, అక్షర్‌ను కూడా ఎల్లీస్ వెనక్కిపంపాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సుందర్.. తిలక్‌తో కలిసి ఎదురుదాడి చేయడంతో టీమిండియా గెలుపు సునాయాసమైంది. 14వ ఓవర్‌లో సీన్ అబాట్ బౌలింగ్‌లో సుందర్ 19 పరుగులు రాబట్టడంతో భారత్ 145/4తో గెలుపు బాటలో నిలిచింది. తిలక్‌ను బ్రాట్‌లెట్ అవుట్ చేసినా.. జితేశ్‌తో కలిసి సుందర్ మరో 9 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు బోర్డు

ఆస్ట్రేలియా: హెడ్ (సి) సూర్య (బి) అర్ష్‌దీప్ 6, మార్ష్ (సి) తిలక్ (బి) వరుణ్ 11, ఇంగ్లిస్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 1, డేవిడ్ (సి) తిలక్ (బి) దూబే 74, ఓవెన్ (బి) వరుణ్ 0, స్టొయినిస్ (సి/సబ్) రింకూ (బి) అర్ష్‌దీప్ 64, షార్ట్ (నాటౌట్) 26, బ్రాట్‌లెట్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 20 ఓవర్లలో 186/6; వికెట్ల పతనం:** 1-6, 2-14, 3-73, 4-73, 5-118, 6-182; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-3, బుమ్రా 4-0-26-0, వరుణ్ 4-0-33-2, అక్షర్ 4-0-35-0, శివం దూబే 3-0-43-1, అభిషేక్ 1-0-13-0.

భారత్: అభిషేక్ (సి) ఇంగ్లిస్ (బి) ఎల్లీస్ 25, గిల్ (ఎల్బీ) ఎల్లీస్ 15, సూర్య (సి) ఎల్లీస్ (బి) స్టొయినిస్ 24, తిలక్ (సి) ఇంగ్లిస్ (బి) బ్రాట్‌లెట్ 29, అక్షర్ (సి) బ్రాట్‌లెట్ (బి) ఎల్లీస్ 17, సుందర్ (నాటౌట్) 49, జితేశ్ (నాటౌట్) 22; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 18.3 ఓవర్లలో 188/5; వికెట్ల పతనం:** 1-33, 2-61, 3-76, 4-111, 5-145; **బౌలింగ్:** బ్రాట్‌లెట్ 4-0-30-1, అబాట్ 3.3-0-56-0, ఎల్లీస్ 4-0-36-3, కునేమన్ 4-0-31-0, స్టొయినిస్ 2-0-22-1, షార్ట్ 1-0-13-0.

సచిన్‌తో లోకేశ్ ఫ్యాన్‌బాయ్ మూమెంట్!



అమరావతి (ఆంధ్రజ్యోతి): అమ్మాయిల వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ని వీక్షించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ కుటుంబ సమేతంగా ముంబై వెళ్లారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను కలిశారు. తన జీవితంలో ఇది 'ఫ్యాన్ బాయ్ మూమెంట్' అని లోకేశ్ పేర్కొన్నారు. ఐసీసీ ఛైర్మన్ జైషా, అతని తల్లి సొనాల్ షాతో దిగిన ఫొటోను లోకేశ్ ఎక్స్‌లో పంచుకున్నారు.

రషీద్ శతకం



ఆంధ్ర 475/7 డిక్లేర్డ్
ఒడిశా 80/4

కటక్: రషీద్ (140 నాటౌట్) సెంచరీ చేయడంతో.. ఒడిశాతో రంజీలో ఆంధ్ర భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజు 222/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 475/7 వద్ద డిక్లేర్ చేసింది. సౌరభ్ కుమార్ (69), శశికాంత్ (46) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఒడిశా 80/4 స్కోరు చేసింది. ఆదివారం ఆట ఆఖరుకు సందీప్ (24), గోవింద పటీదార్ (1) క్రీజులో ఉన్నారు. సాయితేజ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

కార్తీక్ శుభారంభం

పనాజీ (గోవా): ఫిడే వరల్డ్‌కప్‌లో కార్తీక్ వెంకట్రామన్ శుభారంభం చేశాడు. ఆదివారం ముగిసిన తొలి రౌండ్‌లో కార్తీక్ తొలి రౌండ్‌లోని ఒక గేమ్‌ను డ్రా చేసుకుని, మరో గేమ్‌లో నెగ్గాడు. రాబర్టో (క్యూబా) పై నెగ్గిన కార్తీక్ 1.5-0.5తో ముందంజ వేశా డు. లలిత్ బాబు ఒక గేమ్‌లో గెలిచి, మరో గేమ్‌లో ఓడి 1-1తో వామర్‌డామ్ (నెదర్లాండ్స్)తో సమం చేసుకున్నాడు. రాజా రిత్విక్ 1-1తో నోజర్‌బెక్(కజకిస్థాన్)తోడ్రాగాముగించాడు.

'ఆదరణ 3.0' అమలుపై కసరత్తు

»» నేటి నుంచి బీసీ సంక్షేమ మంత్రి సవిత సమావేశాలు

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆదరణ 3.0 పథకం అమలుపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఆయా కుల, చేతివృత్తిదారులకు ఎలాంటి పరికరాలు అందించాలన్న విషయంపైచర్చించేందుకు బీసీ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, కుల సంఘాల ప్రతినిధులతో సోమవారం నుంచి మూడ్రోజుల పాటు విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో సమావేశాలు నిర్వహించనున్నారు. వీటికి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశాల్లో ఆదరణ పథకం కింద అందించే పనిముట్ల వివరాలపై సమగ్రంగా చర్చిస్తారు. మొదటి రోజు శెట్టిబలిజ, కళింగ, కురుబ/కురుమ, పద్మశాలి, నగరాలు, గవర, వన్యకులక్షత్రియ, కుమ్మరి శాలివాహన, గౌడ, రజక కార్పొరేషన్ల పాలక మండళ్లతో మంత్రి భేటీ కానున్నారు. రెండోరోజు నాయీబ్రాహ్మణ, అగ్నికులక్షత్రియ, వడ్డెర, కొప్పుల వెలమ, వాల్మీకి/బోయ, తూర్పు కాపు/గాజుల కాపు, యాదవ కార్పొరేషన్ పాలక మండళ్లతో, మూడోరోజు 17 పాలక మండళ్లతో సవిత భేటీ అవుతారు.

తుఫాన్ బాధితులను పరామర్శించే తీరక లేదా జగన్?

»» నకిలీ మద్యంతో జోగికి సంబంధాలు: కొల్లు



చోడవరం(అనకాపల్లి), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): "మొంథా తుఫాన్ బాధితులను పరామర్శించే ఓపిక, సమయం లేదా.. జగన్?." అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. ఇటువంటి ప్రతిపక్ష నేత ఉండడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని వ్యాఖ్యానించారు. అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలోని తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి ఆయన పర్యటించారు. కొల్లు మాట్లాడుతూ, "బెంగళూరు నుంచి విమానంలో తాడేపల్లికి వచ్చిన జగన్.. తుఫాన్ బాధిత రైతులను పరామర్శించలేదు. ఒక ప్రెస్‌మీట్ పెట్టి ప్రభుత్వం మంచి చేస్తున్నా విమర్శించారు. మళ్లీ బెంగళూరు వెళ్లిపోయారు. తుఫాన్ సంభవించిన మరుసటి రోజే క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల కష్టాలు తెలుసుకున్న సీఎం చంద్రబాబును విమర్శించడం విడ్డూరం. పైగా తుఫాన్ రావడానికి చంద్రబాబే కారణమని ఆరోపించడం ఆయన అవివేకానికి నిదర్శనం." అని మంత్రి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వాన్ని ఏదో విధంగా అప్రతిష్ఠపాలు చేయాలన్న వైసీపీ నేతల ప్రయత్నాలకు నకిలీ మద్యం ఘటన నిదర్శనమని రవీంద్ర ఆరోపించారు. మాజీ మంత్రి జోగి రమేశ్‌కు నకిలీమద్యం తయారీదారులతో ఉన్న సంబంధాలు సిట్ విచారణలో బయటపడడంతోనే ఆయనను అరెస్టు చేశారని మంత్రి తెలిపారు.

పాపికొండల బోట్ షికారు ప్రారంభం

»» తొలి రోజు రెండు బోట్లలో 103 మంది షికారు



గండిపోచమ్మ గుడి నుంచి మొదలైన బోటు షికారు

రాజమహేంద్రవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గతనెల 26న నిలిపివేసిన పాపికొండల బోట్ షికారు ఆదివారం తిరిగి మొదలైంది. గోదావరి వరదల వల్ల తొలుత ఈ ఏడాది జూన్‌లో ఆపేసిన బోటు షికారు గత నెలలో దీపావళికి ముందే ప్రారంభించారు. అయితే ఆ తర్వాత భారీ వర్షాలు, మొంథా తుఫాన్ ప్రభావంతో మళ్లీ ఆపేశారు. ప్రస్తుతం వర్షాలు, వరదల ప్రభావం అంతగా లేకపోవడంతో అధికారులు తిరిగి అనుమతిచ్చారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పోలవరం ప్రాజెక్టు సమీపంలోని గండిపోచమ్మ గుడి వద్ద నుంచి రెండు బోట్లలో 103 మంది పర్యాటకులు బోటు షికారు చేశారు. సాధారణంగా గండి పోచమ్మ గుడి వద్ద నుంచి 15 బోట్లు, పోచవరం నుంచి 17 బోట్లు యాత్రికులను తీసుకెళ్తుంటాయి. అయితే ప్రస్తుతం పర్యాటకులు ఎక్కువగా లేకపోవడంతో రెండు బోట్లు మాత్రమే కదిలాయి. కార్తీక మాసం కావడంతో ఇక ప్రతిరోజూ టూరిస్టుల సందడి పెరగనుంది.



ఒమన్‌లో ప్రవాసుల సహస్ర లింగార్చన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఎడారి దేశం ఒమన్‌లోని తెలుగు ప్రవాసులు సహస్ర లింగార్చన చేశారు. రాజధాని మస్కట్‌లో అక్టోబరు 31న వేద మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం కనులపండువగా సాగింది. వేద పండితులు ధర్మపురి విజయకుమార్ ఆధ్వర్యంలో తయారు చేసిన 1,115 మట్టి లింగాలకు పురోహితులు రుద్రాభిషేకం నిర్వహించారు. ముఖ్య నిర్వాహకులు, చిరు మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షుడు చందక రాందాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి, ఒమన్‌లోని భారత రాయబారి జి.వి. శ్రీనివాస్, సికింద్రాబాద్ మహంకాళీ డివిజన్ ఏసీపీ ఎస్. సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



అండగా ఉంటాం!

'కాశీబుగ్గ' తొక్కిసలాట బాధితులకు మంత్రుల భరోసా

మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత.. ఒక్కొక్కరికి 15లక్షలు, క్షతగాత్రులకు 3లక్షలు



మందసలో బృందావతి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే గౌతు శిరీష

శ్రీకాకుళం/అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో దేవాలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన తొమ్మిది మంది కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందజేసింది. కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం బాధితుల ఇళ్లకు వెళ్లారు. మృతుల కుటుంబాలకు రూ.15లక్షలు చొప్పున, క్షతగాత్రులకు రూ.3లక్షలు చొప్పున చెక్కులను అందజేశారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

ప్రభుత్వం బాధ్యతగా స్పందించింది: ఆనం

కాశీబుగ్గలో పర్యటించిన మంత్రి ఆనం తొక్కిసలాట ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. "ఇది దురదృష్టకర ఘటన. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. సొంత నిధులతో భక్తులు నిర్మించిన ఈ ఆలయం అత్యంత విశిష్టమైనది. తిరుమల తరహాలో ఇంత పెద్ద ఆలయం నిర్మించిన వ్యక్తి భక్తి ప్రశంసనీయం. స్థపతులు, అధికారుల సలహాలు తీసుకుని ఉండి ఉంటే ఈ ప్రమాదం తప్పేది. ప్రైవేటు ఆలయం అయినా ప్రభుత్వం బాధ్యతగా స్పందించింది. 95ఏళ్ల హరి ముకుంద పండా ఇంత పెద్ద ఆలయం నిర్మించడం గొప్ప సేవ. కానీ ఇలాంటి ఘటన జరగకుండా ఉండాల్సింది. దీనిపై పూర్తిస్థాయి విచారణ కమిటీ ఏర్పాటు చేశాం. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దేవాదాయ శాఖ పరిధిలో లేని ఆలయాల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాం. అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేసి ప్రైవేటు ఆలయాల అభివృద్ధికి శ్రీకారం చుడతాం. భక్తుల భద్రత, ఏర్పాట్లు, ప్రవేశ మార్గాలు, అత్యవసర సేవలపై తక్షణ చర్యలు తీసుకుంటాం. భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తాం. ప్రతి ఉత్సవానికి ముందే భద్రతా సమీక్ష తప్పనిసరి" అని ఆనం స్పష్టం చేశారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రులు

తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలచివేసిందని, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. "ఈ దుర్ఘటనను రాజకీయాలకు అన్వయించడం సరికాదు. బాధితుల్లో ఎక్కువ మంది మహిళలు ఉండటం బాధాకరం. కష్ట సమయంలో ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అండగా నిలబడుతుంది" అని మంత్రులు పేర్కొన్నారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ సీఎం రమేశ్ పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు. త్వరలోనే కేంద్రం ప్రకటించిన పరిహారం కూడా పంపిణీ చేస్తారని తెలిపారు.

'కూటమి'.. దేవుళ్లకూ నచ్చలేదు: బొత్స

తిరుపతి, సింహాచలం, ఇప్పుడు కాశీబుగ్గ ఘటనలతో కూటమి ప్రభుత్వం అంటే దేవుళ్లకూ నచ్చలేదని తెలుస్తోందని వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ ఆరోపించారు. కాశీబుగ్గలో క్షతగాత్రులను పరామర్శించేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ముమ్మాటికీ ఇది ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. తొక్కిసలాట మరణాలన్నీ ప్రభుత్వ హత్యలుగానే పరిగణిస్తామని.. అంతా బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు. పోలీసుల స్వాధీనంలో ఉన్న ఆలయ ప్రాంగణంలోకి వెళ్దామని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పడంతో.. అలా వెళ్లకూడదని బొత్స సూచించారు.

తొక్కిసలాటపై పూర్తిస్థాయిలో దర్యాప్తు: డీఐజీ

కాశీబుగ్గ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు వెలుగులోకి తెచ్చే దిశగా పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. కేసు దర్యాప్తుపై సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు, అసత్య సమాచారం వ్యాప్తి చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమన్నారు. ఇటువంటి పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు చేస్తున్నవారి వివరాలు సేకరించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఐజీ హెచ్చరించారు.

15 మంది క్షతగాత్రులు డిశ్చార్జి

తొక్కిసలాటలో గాయపడి చికిత్స అనంతరం కోలుకున్న వారిని ఇళ్లకు పంపుతున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై ఆదివారం ఆయన సమీక్షించారు. పలాస కిడ్నీ రిసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శనివారం చేరిన వారికి వైద్యులు మెరుగైన వైద్యం అందించారని చెప్పారు. చికిత్స అనంతరం పూర్తిగా కోలుకున్న 15మందిని డిశ్చార్జి చేసినట్లు చెప్పారు. పలాస సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 11 మంది కూడా కోలుకున్నారని చెప్పారు. వీరిలో ముగ్గురు, నలుగురు మినహా మిగిలినవారు మూడు రోజుల్లో డిశ్చార్జి అయ్యే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. కాగా, పలాస సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నవారిలో ఒకరిని శస్త్రచికిత్స నిమిత్తం శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు.



లండన్‌లో చంద్రబాబు దంపతులకు స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

లండన్ చేరుకున్న సీఎం చంద్రబాబు

»» నేడు పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ

»» రేపు భువనేశ్వరి అవార్డుల స్వీకరణకు హాజరు

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు వ్యక్తిగత పర్యటన నిమిత్తం లండన్ చేరుకున్నారు. వారికి లండన్‌లోని తెలుగు కుటుంబాలు ఘనస్వాగతం పలికాయి. వారిని ఆప్యాయంగా పలుకరించిన చంద్రబాబు అందరితో ఫొటోలు దిగారు. 4న ప్రతిష్ఠాత్మక సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్(ఐవోడీ) నుంచి భువనేశ్వరి రెండు అవార్డులు అందుకోనున్నారు. డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డును ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో, ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డును హెరిటేజ్ ఫుడ్స్ వీసీ, ఎండీ హోదాలో స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చంద్రబాబు లండన్ వచ్చారు. కాగా, ఈ పర్యటనలో భాగంగా సీఎం సోమవారం పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్నారు. 14, 15 తేదీల్లో విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు వారిని ఆహ్వానించనున్నారు. అక్టోపస్ ఎనర్జీ గ్రూప్ డైరెక్టర్ క్రిస్ ఫ్రిట్జ్ గెరాల్డ్, హిందూజాకు చెందిన వివిధ సంస్థల ఛైర్మన్లు అశోక్ హిందూజా, ప్రకాశ్ హిందూజా, షోమ్ హిందూజాతో భేటీ కానున్నారు. రోల్స్ రాయిస్ గ్రూప్ చీఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫీసర్ నిక్కీ-గ్రాడీ స్మిత్, శ్రామ్ అండ్ ర్రామ్ సంస్థ ఛైర్మన్ శైలేశ్ హీరానందాని, శ్యామ్‌కో హోల్డింగ్స్ ఛైర్మన్ సంతప్‌కుమార్ తదితరులతో సమావేశమవుతారు. సీఐఐ నేతృత్వంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. లండన్‌లో భారత్ హైకమిషనర్ దొరై స్వామితోనూ సీఎం సమావేశం కానున్నారు.

బిజినెస్

అమెరికాతో వాణిజ్య చర్చల్లో జర జాగ్రత్త

టారిఫ్‌లు 20% మించకూడదు ● ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

న్యూయార్క్: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం అమెరికాతో జరుపుతున్న చర్చల్లో భారత ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ప్రముఖ ఆర్థికవేత్త రఘురామ్ రాజన్ హెచ్చరించారు. ఈయూ, జపాన్ దేశాల్లా తొందరపడి అమెరికాకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వవద్దని కోరారు. అలాగే ఈ ఒప్పందం ద్వారా అమెరికా మన ఎగుమతులపై విధించే సుంకాలు 10 నుంచి 20 శాతం మించకుండా చూసుకోవాలని కోరారు. లేకపోతే తూర్పు, దక్షిణాసియా దేశాల ఉత్పత్తులతో మన ఉత్పత్తులు పోటీపడడం కష్టమని రాజన్ స్పష్టం చేశారు. ఈయూ, జపాన్ దేశాలు అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడతామని హామీ ఇచ్చి 15 శాతం సుంకాలతో బయటపడ్డాయన్నారు. మన దేశం అలాంటి హామీలకు దూరంగా ఉండడమే మంచిదన్నారు. మన దేశం జీరో సుంకాలకు అమెరికాను ఒప్పిస్తే మరీ మంచిదన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ.	78



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	115
వరంగల్	107	గుంటూరు	121
కరీంనగర్	107	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	118
కర్నూలు	107	నెల్లూరు	123
విశాఖపట్నం	111	అనంతపురం	123
గోదావరి	115		



ఉద్యోగుల్లోని భిన్న ప్రతిభకు గుర్తింపు 'ఎస్‌బీఐ స్టార్'


న్యూఢిల్లీ: భిన్న రంగాల్లో ఉద్యోగుల్లోని అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) "ఎస్‌బీఐ స్టార్" అవార్డును నెలకొల్పింది. వృత్తిపరమైన నైపుణ్యాలకు వెలుపల భిన్న రంగాల్లో ఉద్యోగుల ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రతి ఏడాది అందచేస్తారు. కళలు, సాహిత్యం, క్రీడలు, సంస్కృతి, సమాజ సేవ, పర్యావరణ రంగాల్లో ఉద్యోగులు ప్రదర్శించే అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్టు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. ఎస్‌బీఐ స్టార్ అవార్డుకు ఉద్యోగులు తమను తాము నామినేట్ చేసుకోవచ్చునని ఆయన చెప్పారు. ఎంపిక ప్రక్రియ నిజాయతీగా, పారదర్శకంగా, నిర్మాణాత్మకంగా ఉంటుందన్నారు.

కోతల తర్వాతే కొత్త నియామకాలు

ఏఐతో మారుతున్న ఉద్యోగాల స్వరూపం

అయితే ఏఐతో మరింత ఉత్పాదకత

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాల స్వరూపమే మారిపోతోందని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల మరోసారి స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఏఐతో ఉద్యోగుల పనితీరు మెరుగుపడి వారి ఉత్పాదకతా పెరుగుతోందన్నారు. బ్రాడ్ జెర్‌స్టనర్ అనే ఇన్వెస్టర్ నిర్వహించిన బీజీ2 అనే పాడ్‌కాస్ట్‌లో ఆయన ఈ విషయాలు చెప్పారు. ఏఐ నైపుణ్యాలు లేని ఉద్యోగుల తొలగింపు పూర్తయిన తర్వాత మైక్రోసాఫ్ట్ మళ్లీ నియామకాల ప్రక్రియ ప్రారంభిస్తుందని కూడా సత్య నాదెళ్ల వెల్లడించారు. అయితే ఈ నియామకాల ప్రక్రియ ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ఉండే అవకాశం ఉందన్నారు. ఏఐ కారణంగా మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది ఇప్పటి వరకు 15,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ నేపథ్యంలో సత్య నాదెళ్ల మళ్లీ కొత్త నియామకాల గురించి మాట్లాడం విశేషం.

మార్పు సహజమే: 'ఏఐ' కారణంగా కార్పొరేట్ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులను సత్య నాదెళ్ల 'సహజ' మార్పులుగా అభివర్ణించారు. వివిధ సంస్థలు లేదా ఒకే సంస్థలో వివిధ విభాగాల మధ్య జరిగే సమాచారం మార్పిడి కోసం గతంలో పలు పద్దతులు ఉపయోగిస్తే.. ఇప్పుడు ఈ-మెయిల్స్, ఎక్సెల్ స్ప్రెడ్‌షీట్లను ఉపయోగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కంపెనీల్లో పని స్థితిగతుల మెరుగుదల కోసం ఏఐ ఉపయోగించడం అలాంటిదేనన్నారు.

ఈ ఏడాది 'లక్ష'కుపైగా కొలువులు ఔట్

ఈ ఏడాది ఇప్పటి వరకు అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి టెక్ దిగ్గజాలు ప్రపంచవ్యాప్తంగా లక్షకు పైగా ఉద్యోగులను తొలగించాయి. ఏఐతో పాటు వ్యాపారాల పునర్ వ్యవస్థీకరణ, ఖర్చులు తగ్గించుకునే ఆలోచన ఇందుకు ప్రధాన కారణం. మన దేశంలో టీసీఎస్ కూడా ఇప్పటి వరకు 12,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. వ్యాపార అవకాశాలు సన్నగిల్లడం, తీసి వేసిన ఉద్యోగుల్లో ఎక్కువ మందికి సరైన ఏఐ నైపుణ్యాలు లేకపోవడం ఇందుకు కారణమని కంపెనీ వర్గాలంటున్నాయి.

అక్టోబరులో ఎఫ్‌పీఐ పెట్టుబడులు పెరిగాయ్..

ఈక్విటీల్లోకి రూ.14,610 కోట్ల నిధులు

న్యూఢిల్లీ: మూడు నెలల నిరంతర ఉపసంహరణల తర్వాత అక్టోబరులో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారత ఈక్విటీ మార్కెట్లో రూ.14,610 కోట్ల పెట్టుబడులు పెట్టారు. అంచనాలను మించిన సంస్థాగత ఆదాయాలు, యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుతో పాటు భారత్- అమెరికా వాణిజ్య చర్చలు సానుకూలంగా ఉండటం నిధుల రాకకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. సెప్టెంబరులో రూ.23,885 కోట్లు, ఆగస్టులో రూ.34,990 కోట్లు, జూలైలో రూ.17,700 కోట్ల నిధులను ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. కాగా ఎఫ్‌పీఐలు ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మొత్తం రూ.1.4 లక్షల కోట్లకు పైగా నిధులను మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్నారు.

- ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్.. కంజప్షన్ ఫండ్‌ను ప్రారంభించింది. కంజప్షన్ (వినియోగం) థీమ్‌తో తీసుకువచ్చిన ఈక్విటీ పథకం ఇది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 14.
- యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్)ను ప్రారంభించింది. ఇది ప్యాసివ్ డెట్ ఓరియెంటెడ్ ఎంఎఫ్ పథకాలు, ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టనుంది. కనీస పెట్టుబడి రూ.100. ముగింపు తేదీ ఈ నెల 11.
- డిజిటల్ ఫిన్‌టెక్ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ఆప్టిమో క్యాపిటల్.. రూ.150 కోట్లు సమీకరించింది. ప్రస్తుత ఇన్వెస్టర్లయిన బ్లూమ్ వెంచర్స్, ఓమ్నివోర్, వ్యవస్థాపకుడు ప్రశాంత్ పిట్టీ నుంచి ఈ మొత్తాలను సేకరించింది.
- జియో-బీపీ దేశంలోనే అతిపెద్ద సమీకృత మొబిలిటీ హబ్‌ను బెంగళూరులోని దేవనహళ్లిలో ఏర్పాటు చేసింది.ఈ హబ్‌లో ఇంధన విక్రయాలతో పాటు సీఎన్‌జీ, ఈవీల కోసం 28 చార్జింగ్ పాయింట్స్‌ను ఏర్పాటు చేసింది.

25,700 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ మైనర్ అప్‌ట్రెండ్‌లో ప్రారంభమై 26,100 వరకు వెళ్లి రియాక్షన్‌కు లోనైంది. కీలక స్థాయి 26,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలం కావడంతో తక్షణ అప్‌ట్రెండ్‌లోకి ప్రవేశించలేకపోయింది. చివరికి వారం మొత్తం మీద 73 పాయింట్ల స్వల్ప నష్టంతో 25,720 వద్ద క్లోజైంది. గత రెండు వారాలుగా 26,000 వద్ద సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం జీవితకాల గరిష్ఠ స్థాయి 26,100 వరకు వెళ్లినప్పటికీ రియాక్షన్ సాధించడం గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది. మిడ్‌క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు సైతం ఇదే ధోరణిని ప్రదర్శించాయి. ప్రస్తుత ధోరణిని బట్టి నిఫ్టీ ఈ వారంలో మరింత అప్రమత్త ట్రెండ్‌లో ట్రేడ్ కావచ్చు. కీలక మద్దతు స్థాయి 25,700 వద్ద మరో పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయిల్లో పునరుజ్జీవం సాధించినట్టయితే మరింత సానుకూలత కోసం 26,000 పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 26,300. ఇదే గత ఏడాది ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయి.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 25,700 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,400. ఇక్కడ రికవరీ ఏర్పడవచ్చు. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 25,000.

బ్యాంక్ నిఫ్టీ: గత రెండు వారాలుగా సైడ్‌వేస్ ధోరణి ప్రదర్శించిన ఈ సూచీ గత వారంలో 57,770 సమీపంలో క్లోజైంది. రికవరీ బాట పడితే 58,000 వద్ద నిలదొక్కుకోవడం కీలకం. ప్రధాన నిరోధం, జీవితకాల గరిష్ఠ స్థాయి 58,600. మద్దతు స్థాయి 57,400. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: నిఫ్టీ 25,700 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. నిఫ్టీ ప్రస్తుతం ఇదే స్థాయిలో ఉన్న 25 డీఎంఏ వద్ద ఉంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,760, 25,850
మద్దతు	25,700, 25,610

అప్రమత్తంగా వ్యవహరించండి..!

దేశీయ స్టాక్ మార్కెట్ల గమనం ఈ వారం అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. దేశీయంగా జీఎస్‌టీ వసూళ్లు, కంపెనీల ఫలితాలు సానుకూలంగా ఉన్నాయి. యూఎస్ రిజర్వ్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించటం, టారిఫ్స్ నేపథ్యంలో అప్రమత్తత అవసరం. ప్రస్తుతం చమురు, రియల్టీ, ఇన్‌ఫ్రా, పీఎస్‌యూ బ్యాంకుల షేర్లు బలాన్ని ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

అరబిందో ఫార్మా: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు రివర్సల్ బాట పడుతోంది. క్రమంగా బలం పుంజుకుంటోంది. డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,138 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,100 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,250/1,330 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,050 వద్ద కచ్చితమైన స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

బీఈఎల్: జీవితకాల గరిష్ఠం తర్వాత 18 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు మళ్లీ సెప్టెంబరు నుంచి అదే స్థాయిలో రాబడి అందించింది. ఒడుదొడుకులు లేకపోవటం, రాబోయే రోజుల్లో రక్షణ రంగ డీల్స్ పెరిగే అవకాశం, మంచి ఆర్థిక ఫలితాలు ఈ కౌంటర్‌ను ఆకర్షణీయంగా మార్చాయి. గత శుక్రవారం రూ.426 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.455/475 టార్గెట్ ధరతో రూ.415 పై స్థాయిలో పడుతున్నప్పుడు కొనుగోలు చేయాలి. రూ.404 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐనాక్స్ విండ్: జీవిత కాల గరిష్ఠం తర్వాత ఈ షేరు దాదాపు 50 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం కీలకమైన మద్దతు స్థాయి రూ.150 వద్ద మరోసారి అప్‌ట్రెండ్ బాట పట్టింది. బలమైన ఫండమెంటల్స్ ఉండటం ముమ్మందు షేరు ధర పెరుగుదలను సూచిస్తోంది. గత శుక్రవారం రూ.155 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.150 ఎగువన ప్రవేశించి రూ.175/190 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.144 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్లెన్‌మార్క్: ఈ ఏడాది జూలై నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో ఉంది. దాదాపు 20 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. మళ్లీ ఆర్థిక ఫలితాల తేదీ సమీపిస్తుండటంతో ఇన్వెస్టర్ల ఆసక్తి పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,891 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,820 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: ఈ కౌంటర్‌లో డబుల్ బేస్ ఏర్పడింది. పైగా పీఎస్‌యూ బ్యాంకింగ్ రంగానికి మూమెంటమ్ ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.148 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.145/140 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.190/210 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.135 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

జోగి రమేశ్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి మూడు గంటలపాటు పడక గది తలుపులు తీయకుండా లోపలే ఉండిపోయారు. వైసీపీ కార్యకర్తలను, స్థానిక నేతలను ఇంటికి రప్పించుకున్నారు. వారు ఆందోళన చేయడం మొదలుపెట్టిన తర్వాత ఆయన తలుపులు తీసుకుని బయటకు వచ్చారు. ఆయన బయటకు రాగానే ఎక్సైజ్ ఏఈఎస్ రామ్‌శివ అరెస్టు నోటీసు అందజేశారు. తర్వాత జోగి సోదరులతోపాటు ఆయన పీఏ ఆరేపల్లి రామును అదుపులోకి తీసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనంతరం వారిని విజయవాడ గురునానక్ కాలనీలోని ఎక్సైజ్ తూర్పు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ సిట్ ఎస్పీ కడియం చక్రవర్తి సాయంత్రం 4 గంటల వరకు ప్రశ్నించి కీలక సమాచారం రాబట్టారు. కేసులో ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు, ఆయన సోదరుడు జగన్మోహనరావు చెప్పిన అంశాలు, దర్యాప్తు సందర్భంగా తాము సేకరించిన ఆధారాలను వారి ముందుంచి ప్రశ్నించారు. అయితే ఈ కేసుతో తనకెలాంటి సంబంధమూ లేదని, రాజకీయ కుట్రతోనే కేసులు పెట్టారని జోగి రమేశ్ వాగ్వాదానికి దిగారు. వారితో పాటు తీసుకెళ్లిన పీఏ రామును అధికారులు ప్రశ్నించి ఉదయం 11 గంటల సమయంలో స్టేషన్ నుంచి పంపేశారు.

కేసులో ప్రధాన పాత్రధారి..

నకిలీ మద్యం తయారీ, సరఫరా వెనుక జోగి రమేశే ఉన్నారని.. ఆయన సంపూర్ణ సహకారంతోనే తయారుచేసి మద్యం దుకాణాలకు పంపామని ఈ కేసులో ఏ-1గా ఉన్న ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు, అతడి సోదరుడు జగన్మోహన్‌రావు గతంలోనే వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే తనకు ఎటువంటి సంబంధమూ లేదని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తనను ఇరికిస్తున్నారని జోగి ఎదురుదాడికి ప్రయత్నించారు. అద్దేపల్లి సోదరులను సిట్ అధికారులు వారం పాటు కస్టడీకి తీసుకుని విచారించిన సంగతి తెలిసిందే. జోగిని ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ కలిశారు.. ఏయే అంశాలపై చర్చించారు.. నకిలీ మద్యం తయారీకి ముడి సరుకు సరఫరా, ఆ తర్వాత మద్యం షాపులకు పంపించడం, వాటి ద్వారా వచ్చిన నగదుతో జరిగిన లావాదేవీల వంటి కీలక వివరాలను జనార్దనరావు నుంచి రాబట్టారు. అతడి వాంగ్మూలాన్ని వీడియో రికార్డు చేసిన సిట్.. కొద్దిరోజుల కింద కోర్టుకు కూడా సమర్పించింది. తదనంతరమే జోగి సోదరులను అరెస్టు చేసింది. ఎక్సైజ్ స్టేషన్‌లో విచారణ పూర్తయ్యాక వారిని రాత్రి 9.45 గంటలకు వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షల అనంతరం పొద్దుపోయాక అర్ధరాత్రి సమయంలో ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసులో రమేశ్‌ను (ఏ-18), జోగి రాము (ఏ-19)గా చేర్చారు.

ఎప్పుడేం జరిగిందంటే..

- అక్టోబరు 3న అన్నమయ్య జిల్లా ములకలచెరువులో బయటపడిన నకిలీ మద్యం తయారీ కేంద్రం
- 6న ఇబ్రహీంపట్నంలో మరో తయారీ కేంద్రం గుర్తింపు. అదేరోజు జనార్దనరావు నిర్వహిస్తున్న ఏఎన్ఆర్ బార్ సీజ్
- అద్దేపల్లి జగన్మోహనరావుతో పాటు బాదల్‌దాస్, ప్రదీప్‌దాస్‌ల అరెస్టు
- ఆఫ్రికాలో ఉన్న జనార్దనరావు 10న విజయవాడ రాగానే అరెస్టు. ప్రస్తుతం నెల్లూరు జైలుకు ప్రధాన నిందితుడు
- 13న జోగి రమేశ్ ప్రోద్బలంతోనే నకిలీ మద్యం తయారీ ప్రారంభించినట్లు వీడియో విడుదల చేసిన జనార్దనరావు
- 15న నకిలీ మద్యాన్ని విక్రయించిన విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్ సీజ్
- 24 నుంచి 30 వరకు అద్దేపల్లి సోదరులను కస్టడీలో విచారించిన సిట్.
- నవంబరు 2న జోగి సోదరుల అరెస్టు.

ఎస్సైపై జోగి కుమారుడి దౌర్జన్యం!

▸▸ ప్రభుత్వాస్పత్రిలో వైసీపీ నేతల హంగామా

జోగి సోదరులను ఆదివారం రాత్రి 10 గంటలకు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చిన సమయంలో జోగి కుమారుడు రాజీవ్ వైసీపీ నేతలతో కలిసి హంగామాచేశారు. చంద్రబాబు డౌన్ డౌన్, జోగి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అత్యవసర సేవల విభాగంలోకి జోగి సోదరులను తీసుకెళ్తుండగా.. అప్పటికే అక్కడున్న రాజీవ్, వైసీపీ నేతలు లోపలకు తోసుకొచ్చారు. క్యాజువాలిటీ వార్డు అద్దం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా తనను అడ్డుకోబోయిన మాచవరం ఎస్సైపై రాజీవ్ దౌర్జన్యానికి దిగారు. దీంతో పోలీసులు ఆయన్ను బలవంతంగా బయటకు నెట్టేశారు. విధినిర్వహణలో ఉన్న ఎస్సైపై దాడి చేసినందుకు, ప్రభుత్వాస్పత్రిలో అద్దం ధ్వంసం చేసినందుకు రాజీవ్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షలు పూర్తయ్యాక జోగి సోదరులను కోర్టుకు తీసుకొస్తున్నారని తెలిసి వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు అక్కడకు తరలివచ్చారు. వారితో కోర్టు హాలు నిండిపోయింది. మేజిస్ట్రేట్ లెనిన్‌బాబు రాత్రి 11.30కి కోర్టుకు వచ్చారు. కోర్టు హాలు కిక్కిరిసి ఉండడం చూశారు. సూర్యారావుపేట ఇన్‌స్పెక్టర్ మహ్మదాలీని తన చాంబరుకు పిలిపించుకున్నారు. న్యాయవాదులు కానివారు బయటకు వెళ్తేనే కోర్టు హాలులోకి వస్తానని స్పష్టంచేశారు. దీంతో ఆయన తన సిబ్బందితో లోపలకు వెళ్లి వైసీపీ నేతలందరినీ బయటకు వెళ్లాలని సూచించారు.

మళ్లీ పిలుస్తామన్నారు: పీఏ రాము

ఎక్సైజ్ స్టేషన్‌లో విచారణ సందర్భంగా.. నకిలీ మద్యం కేసులో జోగి రమేశ్ పాత్ర ఏమిటి.. ఎన్నిసార్లు జనార్దనరావును కలిశావని తనను సిట్ అడిగిందని ఆయన పీఏ ఆరేపల్లి రాము తెలిపారు. 'నాకేమీ తెలియదని, మద్యంతో సంబంధం లేదని చెప్పాను. జోగి రమేశ్‌కు, జనార్దనరావుకు పరిచయం ఉంది. నకిలీ మద్యం కేసులో మాకు సంబంధం లేదు. విచారణకు అందుబాటులో ఉండాలని, అవసరమైతే మళ్లీ పిలుస్తామని చెప్పి పంపారు' అని వెల్లడించారు.

అరాచకాల జోగి!

ఎన్నో వివాదాలు, అవినీతి ఆరోపణలు.. గత ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ భూముల కబ్జా

▸▸ అధికారం పోయాక అక్రమాలు బయటకు

▸▸ తాజాగా నకిలీ మద్యం కేసులో అరెస్ట్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి జోగి రమేశ్ అడ్డూ అదుపూ లేకుండా వ్యవహరించారు. అక్రమాలకు పాల్పడ్డారు. వివాదాస్పదంగా వ్యవహరించారు. అగ్రిగోల్డ్ భూముల కబ్జా నుంచి ఇప్పుడు నకిలీ మద్యం వరకు ఆయనపై ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వంలో వైసీపీ శ్రేణులు టీడీపీ ప్రధాన కార్యాలయంపైన, గన్నవరం టీడీపీ కార్యాలయంపైన దాడులకు పాల్పడిన క్రమంలో జోగి రమేశ్ ఏకంగా నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై దాడికి ప్రయత్నించారు. ఈ ఉదంతంతో ఒక్కసారిగా వార్తల్లో నిలిచారు. ఆ తర్వాత వైసీపీ అధినేత జగన్ ప్రాపకంతో మంత్రి అయ్యారు. అధికారం కోల్పోయాక నాటి అక్రమాలన్నీ వెలుగులోకి రావటంతో ఇప్పుడు జోగి రమేశ్ మెడకు చుట్టుకుంటున్నాయి.

చంద్రబాబు ఇంటిపై దాడికి యత్నం

గత ప్రభుత్వంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడితో పాటు టీడీపీ కేంద్ర కార్యాలయంపైనా దాడికి వైసీపీ నేతలు పథక రచన చేసి అమలు చేశారు. నాడు పెడన ఎమ్మెల్యేగా ఉన్న జోగి రమేశ్ ఒకడుగు ముందుకు వేసి చంద్రబాబు ఇంటిపైనే దాడికి ప్రయత్నించారు. టీడీపీ శ్రేణులు బలంగా ప్రతిఘటించడంతో ఆయన ప్రయత్నం ఫలించలేదు. జోగి రమేశ్ చేసిన ఈ పనికి ప్రతిఫలంగా వైసీపీ అధినేత జగన్ ఆయనకు రాష్ట్ర మంత్రి పదవిని కట్టబెట్టారు. మంత్రి పదవి వచ్చాక జోగి టీడీపీపై ఒంటికాలిపై లేస్తూ వివాదాలకు ఆజ్యం పోసేవారు. అధికారంలో ఉన్నప్పుడు జోగి రమేశ్ అగ్రిగోల్డ్ భూముల కబ్జాకు పాల్పడ్డారు. గతేడాది జనవరి 20న విజయవాడ టూటౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ, విజయవాడ రూరల్ తహసీల్దార్‌కు ఒక లేఖ వచ్చింది. 'అగ్రిగోల్డ్‌కు చెందిన అవ్వా వెంకట నారాయణరావు అనే వ్యక్తి అంబాపురం గ్రామంలోని రీ సర్వే నంబర్ 69/2, 87లో భూమి కొనుగోలు చేశారు. ఆ భూమిలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టి బోర్డు ఏర్పాటు చేశారు. సర్వే నిర్వహించి సరిహద్దులు నిర్ణయించండి' అని కోరారు. దీనిపై తహసీల్దార్ విచారణ జరిపి ఎస్ఐకు నివేదికను అందజేశారు. 'అంబాపురం గ్రామంలో సర్వే నంబర్ 88లో పోలవరపు మురళీమోహన్‌కు చెందిన ఎకరం భూమిని ప్లాట్లుగా విభజించి గతంలోనే విక్రయించారు. అదే సర్వే నంబర్‌లోని భూమిని జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్, సోదరుడు జోగి వెంకటేశ్వరరావుకు విక్రయించారు. రీసర్వే నంబర్ 87లో ఖాళీగా ఉన్న భూమిని గ్రామ సర్వేయర్ నివేదిక మేరకు తహసీల్దార్ కార్యాలయం నుంచి భూమి స్వాధీన ఉత్తర్వులను పొంది, సర్వేనంబర్ 88 స్థానంలో 87గా సవరణ చేయించుకున్నారు. ఆ భూమి ఈడీ అటాచ్‌మెంట్ చేసిన అగ్రిగోల్డ్‌కు చెందినది' అని నివేదికలో పేర్కొన్నారు. దీంతో జోగి రమేశ్ వ్యవహారం వెలుగు చూసింది. ఈ భూలావాదేవీలకు 2023లోనే అడుగులు పడ్డాయి. అగ్రిగోల్డ్ భూములని తెలిసే జోగి రమేశ్ ఉద్దేశపూర్వకంగా పోలవరపు మురళీమోహన్ దగ్గర భూములు కొన్నట్టుగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్టు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో రిజిస్ట్రేషన్ చేసిన విజయవాడ రూరల్ సబ్ రిజిస్ట్రార్ సింగ్ ఆ తర్వాత మరో నకిలీ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో చిక్కుకుని పరారీ అయ్యారు. పోలవరపు మురళీమోహన్ కూడా తాను ఆ భూములను విక్రయించలేదని, తనకేమీ సంబంధం లేదని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసులో ఏసీబీ పోలీసులు జోగి రాజీవ్, జోగి వెంకటేశ్వరరావును అరెస్టు చేయగా, బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆ తర్వాత ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. కొద్దినెలల కిందట సీఐడీ, రెవెన్యూ జాయింట్ ఆపరేషన్ నిర్వహించాయి. వివాదాస్పద భూమిని సర్వే చేయగా, సర్వే నంబర్ 69/2, 87లో భాగమై ఉన్నాయని, ఇవి అటాచ్‌మెంట్ చేసిన అగ్రిగోల్డ్ భూములేనని తేల్చారు. అగ్రిగోల్డ్ గ్రూపునకు చెందిన ఈ భూములు వాస్తవంగా ఎవరి పేరుతో ఉన్నాయో కూడా జాబితాను పొందుపరిచారు.


జోగి రమేశ్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

నకిలీ మద్యం కేసులో కర్త, కర్మ

నకిలీ మద్యం తయారీలో కర్త, కర్మ జోగి రమేశ్ అని నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు పోలీసులకు చెప్పటంతో ఈ కేసులో ఆయన చిక్కుకున్నారు. అద్దేపల్లి జనార్దనరావు ఎవరో తనకు తెలియదని మొదట్లో జోగి బుకాయించారు. అద్దేపల్లి ఆయన ఇంటికి రావటం, గంటపాటు ఉండటం, గతంలో పలు ఫంక్షన్లలో వీరిద్దరూ కలిసి ఉండటం వంటివి బయటకు వచ్చాయి. అయితే జోగితో అద్దేపల్లికి ఉన్న బంధాలు పోలీసు విచారణలో బయటపడ్డాయి.

డాక్యుమెంట్లు, కారు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్‌డిస్క్, ఫోన్ల స్వాధీనం

మరోవైపు.. సిట్, ఎక్సైజ్ బృందాలు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతం నుంచి రాత్రి 8 గంటల వరకు జోగి రమేశ్ ఇంట్లో సోదాలు నిర్వహించాయి. కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయన కారు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఎన్‌వీఆర్ హార్డ్ డిస్క్, వైఫై రూటర్‌ను, ఆయన భార్య ఫోన్, జోగి సోదరుడు రాము ఫోన్‌ను కూడా సీజ్‌చేశారు.


దహనం చేయడానికి ముందు గంజాయిని పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రతబాగ్చి

గంజాయి సాగును సమూలంగా నిర్మూలించాం

▸▸ స్మగ్లర్లు ఉగ్రవాదులతో సమానం: డీజీపీ

▸▸ విశాఖలో 10,147 కిలోల గంజాయి దహనం

విశాఖపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించామని డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా చెప్పారు. అయితే పక్క రాష్ట్రం నుంచి రవాణా అవుతోందని, దీనిని కూడా కట్టడి చేసేందుకు ఈగల్ టీమ్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రత్యేక ఫోర్స్‌లను రంగంలోకి దింపాలని భావిస్తున్నామని తెలిపారు. విశాఖలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 10,147 కిలోల గంజాయిని నగర శివారులోని కాపులుప్పాడ డంపింగ్ యార్డులో దహనం చేసే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగం వంటి కార్యకలాపాలకు పాల్పడే మాఫియాను ఉగ్రవాదులుగానే భావించి వారిపై యుద్ధం సాగిస్తున్నామన్నారు. ఈ యుద్ధంలో చాలావరకు విజయం సాధించామని, చివరి లింక్‌ను కూడా తెగ్గొట్టేందుకు యుద్ధాన్ని మరింత ముందుకు తీసుకెళతామని చెప్పారు. ఎక్కడైనా గంజాయి పట్టుబడితే.. ఎవరు సరఫరా చేశారు? ఎవరు రవాణా చేస్తున్నారు? ఎవరికి చేరుతోంది? తదితర లింకులన్నింటినీ ఛేదిస్తున్నామని చెప్పారు. 132 మందిని అరెస్టు చేశామన్నారు. 533 ఎన్‌డీపీఎస్ కేసుల్లో 1,435 మందిని అరెస్టు చేశామన్నారు. వీరిలో విశాఖ జిల్లాకు చెందినవారు 712 మంది ఉన్నారన్నారు.

విశాఖలో వైసీపీ 'డ్రగ్స్' దందా!

(మొదటి పేజీ తరువాయి)

తనిఖీ చేయగా 36 ఎల్ఎస్‌డీ బోల్ట్స్ లభ్యమయ్యాయి. కొండారెడ్డి కోసమే బెంగళూరు నుంచి తెస్తున్నట్టు చరణ్ వెల్లడించాడు. దీంతో పోలీసులు కొండారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వాటిని నగరంలోని ఒక విద్యా సంస్థలో చదువుతున్న హర్షవర్ధన్‌నాయుడు, హైదరాబాద్‌కు చెందిన సంతానం, విశాఖకు చెందిన శరత్‌లకు విక్రయించేందుకు తెప్పించినట్టు అంగీకరించాడు. దీంతో ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు హర్షవర్ధన్‌నాయుడు, శరత్‌లను కూడా అదుపులోకి తీసుకుని 4వ పట్టణ పోలీసులకు అప్పగించారు. వీరిపై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించారు. సంతానం కోసం పోలీసులు గాలిస్తున్నారు. విశాఖలోని మద్దిలపాలెంలో నివాసం ఉంటున్న కొండారెడ్డి వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అధినేత జగన్, మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డిలకు కొండారెడ్డి సన్నిహితుడు. కొండారెడ్డి హైదరాబాద్, బెంగళూరు, గోవాల నుంచి డగ్స్‌ను తెప్పించి నగరంతోపాటు ఇతర ప్రాంతాల వారికి విక్రయిస్తుంటాడని పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన చరణ్‌ని డ్రగ్స్ రవాణాకు వినియోగిస్తున్నట్టు భావిస్తున్నారు.


వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కొండారెడ్డి(ఫైల్)

తగ్గుతున్న మావోయిస్టుల ప్రభావం!

11కు పడిపోయిన వామపక్ష తీవ్రవాద ప్రభావ జిల్లాలు

ఎస్ఆర్ఈ పరిధిలోని జిల్లాలు 46 నుంచి 38కి తగ్గుదల

న్యూఢిల్లీ, నవంబరు 2: దేశంలో మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం పడుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి తొమ్మిది రాష్ట్రాల్లో 46 నక్సల్ ప్రభావిత జిల్లాలు ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 38కి తగ్గింది. వీటిలో ఆందోళనకరమైన జిల్లాలు 4, అత్యంత ప్రభావిత జిల్లాలు 3 మాత్రమే ఉన్నాయని తాజాగా వర్గీకరించారు. అత్యంత ప్రభావిత జిల్లాలు (బీజాపూర్, నారాయణ్‌పూర్, సుకుమా) అన్నీ ఛత్తీస్‌గఢ్‌లోనే ఉన్నాయి. ఇక ఆందోళనకరమైన జిల్లాలు కాంకేర్ (ఛత్తీస్‌గఢ్), వెస్ట్ సింగ్‌భూమ్(జార్ఖండ్), బాలాఘాట్(మధ్యప్రదేశ్), గడ్చిరోలి(మహారాష్ట్ర)గా గుర్తించారు. ఈ వర్గీకరణను అక్టోబరు 15న కేంద్ర హోంశాఖ నోటిఫై చేసింది. వామపక్ష తీవ్రవాదాన్ని (ఎల్‌డబ్ల్యూఈ) ఎదుర్కోవడానికి కేంద్రం 2015లో జాతీయ విధానాన్ని తీసుకొచ్చింది. దీనిలో భాగంగా మావోయిస్టులతో పోరాడేందుకు రాష్ట్రాలతో కలసి పనిచేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తోంది. లొంగిపోయిన మావోయిస్టులకు ఉపాధి కల్పించడం, కాల్పుల్లో మరణించిన పౌరుల కుటుంబాలకు సాయం చేసేందుకు సెక్యూరిటీ రిలేటెడ్ ఎక్స్‌పెండిచర్ (ఎస్ఆర్ఈ) పథకం కింద నిధులు మంజూరు చేస్తోంది. నక్సల్స్ అణచివేతలో గణనీయమైన మెరుగుదల నమోదైందని, 2025 ఏప్రిల్ 1న 46గా ఉన్న ఎస్ఆర్ఈ పరిధిలోకి వచ్చే జిల్లాల సంఖ్య ఇప్పుడు 38కి తగ్గిందని అధికార వర్గాలు తెలిపాయి. భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించిన తర్వాత నక్సల్స్ హింస, దాని ప్రభావానికి సంబంధించిన గ్రాఫ్ పడిపోయిందని పేర్కొన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో వామపక్ష తీవ్రవాద ప్రభావం 18 జిల్లాల్లో ఉండగా ఇప్పుడు 11కి పడిపోయింది. వీటిని మూడు విభాగాలుగా వర్గీకరించారు. 'ఇతర ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత జిల్లాల' విభాగంలో దంతెవాడ, గరియాబంద్, మోహ్లా-మన్‌పూర్-బందర్‌బాగ్ చౌకీ (ఛత్తీస్‌గఢ్), కంధమాల్ (ఒడిశా) ఉన్నాయి. అదేవిధంగా 'లెగసీ అండ్ థ్రస్ట్ జిల్లాలు' విభాగంలో ఒడిశా నుంచి 8, ఛత్తీస్‌గఢ్- 6, బిహార్- 4, జార్ఖండ్-3, తెలంగాణ -2, ఏపీ -1. మధ్యప్రదేశ్-1, మహారాష్ట్ర-1, పశ్చిమ బెంగాల్-1 చొప్పున మొత్తం 27 జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో నక్సలిజం అంతమైనప్పటికీ, వామపక్ష తీవ్రవాదం విస్తరించే అవకాశం ఉన్న ప్రాంతాలుగా భావిస్తున్నందున వీటికి నిరంతర కేంద్ర ప్రభుత్వ మద్దతు అవసరమని తాజా నివేదిక పేర్కొంది.

మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారత్: షా

2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. "ఒకప్పుడు మావోయిజాన్ని వ్యాప్తి చేసేవారు రెడ్ కారిడార్ గురించి మాట్లాడేవారు. దేశవ్యాప్తంగా 130కి పైగా వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలు ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య కేవలం 11కి పరిమితమైంది. చాలామంది మావోయిస్టులు మరణించారు... కొందరు అరెస్టయ్యారు. మరికొందరు లొంగిపోయారు. ఈ హింసాత్మక ఉద్యమం వెన్నెముక విరిగిపోయిందని భావిస్తున్నాం. లొంగిపోయిన మావోయిస్టులు 6నెలలు మా కనుసన్నల్లోనే ఉంటారు. పునరావాస కేంద్రం ఏర్పాటు చేశాం. అందులో వారు మానసిక వైద్యుల పర్యవేక్షణలో ఉంటారు. నైపుణ్యాభివృద్ధితో పాటు వారి పునరావాసానికి పథకాలు సిద్ధం చేశాం. ఏదేమైనా మార్చి 31 తర్వాత ఈ దేశంలో మావోయిస్టులు ఉండరు' అని షా స్పష్టం చేశారు.

చికెన్ దుకాణాల్లో కుళ్లిన మాంసం

▸▸ గుంటూరులోని పలు చోట్ల తనిఖీలు

▸▸ నిల్వ చికెన్, చనిపోయిన కోళ్లు గుర్తింపు

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని పలు చికెన్, మటన్ దుకాణాలు, కోళ్ల ఫారాలను ఏపీ మాంసం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్ నాయుడు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక పొన్నూరు రోడ్డు, లాంచెస్టరు రోడ్డు, మణిపురం ఫ్లైవోవర్ వద్ద ఉన్న దుకాణాలను తన బృందంతో కలిసి పరిశీలించారు. కొన్నిచోట్ల నిల్వ ఉంచిన కోడి మాంసాన్ని నీళ్లల్లో నానబెట్టి విక్రయానికి సిద్ధంగా ఉంచడాన్ని గమనించారు. అలానే చనిపోయిన కోళ్లను కూడా గుర్తించారు. చికెన్ షాపుల నిర్వహణకు పొందిన ప్రభుత్వ అనుమతి పత్రాలను పరిశీలించారు. ఒక చికెన్ స్టాల్‌కు రూ.5 వేలు, మరో దానికి రూ.2 వేల జరిమానా విధించారు. అలానే మరో ఫారంపై రూ.5 వేలు పెనాల్టీ వేశారు. చైర్మన్ ప్రకాశ్ నాయుడు మాట్లాడుతూ చికెన్, మటన్ దుకాణాలు, కోళ్ల ఫారాలు, కబేళాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


చనిపోయిన కోళ్లపై బ్లీచింగ్ పౌడర్ చల్లించిన ఏపీ మాంసం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్ నాయుడు

అమరావతికి ప్రాచీన పురావస్తు సంపద

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అమరావతికి చెందిన బౌద్ధుల కాలం నాటి అపురూప శిల్ప సంపద, కళాఖండాలు తిరిగి రాష్ట్రానికి రానున్నాయి. ఈ వారసత్వ సంపదను తిరిగి తెచ్చేందుకు 2014నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కేంద్రం సహకారంతో బ్రిటిష్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియం అధికారులతో భారత రాయబారి చర్చలు జరిపారు. దీంతో ప్రాచీన సంపదను తాత్కాలికంగా ఇచ్చేందుకు వారు అంగీకరించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర విదేశాంగశాఖ అదనపు కార్యదర్శి పియూష్ శ్రీవాస్తవ వారం క్రితం ప్రభుత్వానికి లేఖ రాశారు. మరిన్ని చర్చల తర్వాత శాశ్వతంగా తరలించే ప్రయత్నాలు చేస్తామన్నారు. కాగా.. సీఎం చంద్రబాబుకు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

దొంగ ప్రమాణాల వల్లే కటకటాల్లోకి జోగి

▸▸ త్వరలో జగన్ పేరూ బయటికి: బుద్దా వెంకన్న

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేశ్ మంచివాడంటూ పెద్దదొంగ అయిన వైసీపీ అధినేత జగన్ సర్టిఫికెట్ ఇవ్వటం హాస్యాస్పదమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విమర్శించారు. విజయవాడలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం బుద్దా వెంకన్న విలేకరులతో మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో జోగి రమేశ్ జైలుకెళ్లటం ఎప్పుడో ఖాయమైందని చెప్పారు. దుర్గమ్మ ఆలయానికి వెళ్లి దొంగ ప్రమాణం చేశాడని, అందుకే అమ్మవారు వెంటనే ప్రభావం చూపారని తెలిపారు. తాను బీసీనని జోగి చెప్పుకోడానికి సిగ్గు ఉండాలన్నారు. దోచుకున్న డబ్బును బీసీలకు పంచిపెడతాడా? అని ప్రశ్నించారు. ఎన్నో రంకెలు వేసిన జోగి రమేశ్.. పోలీసులు ఇంటికి వెళ్లగానే బాత్‌రూమ్‌లో ఎందుకు దాక్కున్నాడని ప్రశ్నించారు. నకిలీ మద్యం కేసులో జగన్ కూడా ఉన్నారని, విచారణలో జగన్ పేరును జోగి రమేశ్ వెల్లడించనున్నారని పేర్కొన్నారు. జగన్ పెద్ద దొంగ అయితే, జోగి రమేశ్ అండ్ కో చిన్న దొంగలన్నారు. అతి చేస్తే కల్తీ మద్యం తాగి చనిపోయిన వారి కుటుంబ సభ్యులతో తాడేపల్లి ప్యాలెస్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఆన్‌లైన్ లావాదేవీలు లేకుండా మద్యం షాపుల్లో రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపించారు.



జోగి అరెస్టుపై వైసీపీ రాద్ధాంతం అర్థరహితం

▸▸ ప్రాణాలు తీసి కులం కార్డు వాడటం సిగ్గుచేటు

▸▸ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు విమర్శ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో జోగి రమేష్‌ను అరెస్టు చేస్తే దానిపై వైసీపీ రాద్ధాంతం చేయడం అర్థరహితమని శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లు అధికారాన్ని అడ్డంపెట్టుకుని కల్తీ మద్యం వ్యాపారం చేసి వేల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టిన జోగి రమేష్‌ను అరెస్టు చేయడం సరైన చర్యే అన్నారు. కల్తీ మద్యంతో గత ఐదేళ్లలో 30 వేల మంది ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నంత కాలం గుర్తుకు రాని బీసీ కులాన్ని ఇప్పుడు తెరపైకి తెచ్చి నీచ రాజకీయాలు చేయాలనుకోవడం దారుణమన్నారు. బీసీ నాయకుడు తోట చంద్రయ్యను నడిరోడ్డుపై పీక కోసి చంపితే ఇప్పుడు మాట్లాడుతున్న వైసీపీ నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో 30 మంది బీసీ నేతలను వైసీపీ అరాచక శక్తులు అతి కిరాతకంగా చంపేశాయన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.